(సంపుటి - II)



# హరినే అడుగరో ఆమాట

ఇది

ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు

భావ దర్పణము





శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు





# హరి సేవకే వేంకటేశ మకుటం

(సంపుటి - II)

## అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య సరస సంకీర్తనలకు

# భావపరిమళం

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

**హరి సేవకే వేంకటేశ మకుటం**
(సంపుటి - II)

మొదటి ప్రచురణ
**డిసెంబర్ 2014**

రచన
**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :
కె.వి.ఆర్.
98495 79345





## అంకితము

## మా తండ్రి, తాత, ముత్తాతలు, భార్యాసమేతులుగా శ్రీపతి పాదపద్మాలు పొందెదరు గాక



సీ॥ ప్రపితామహుడు నాకు పరగె మృత్యుంజయ
సోమయాజులుగారు చొక్కెముక్తి
దివికి సుబ్రహ్మణ్య దీక్షితులుంగారు
మా తాత వడిజేరె మహిని వీడి
చదివించు గతిలేక సంతబేహారియై
రామకృష్ణుడు తండ్రి లక్షలెన్నె
ఎంటెక్కు చదివియు ఇంకొక వ్యాపారి-
గామారి గడియించి కంటికీర్తి

ఆ.వె॥ రోగమొచ్చి బ్రతుకు రోతయై కుందితిన్
వేంకటేశుడేలె పెన్నిధాయె
కవితవ్రాయ నేర్పె ఘనమైన యీకృతి
అంకితమ్ము పెద్దలందరికిని.

# హరి సేవకే వేంకటేశ మకుటం

**(సంపుటి II)**

## అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య సరస సంకీర్తనలకు

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అంగనమోహము నీపైనటువంటిదే | 28/141 | 34 |
| 2. | అంతటి నాజన్మఫలమబ్బుట గాదా | 17/140 (పె.శృ) | 40 |
| 3. | అడిగితేనేమనునో అడగకున్నాబోదు | 17/309 (పె.శృ) | 01 |
| 4. | అప్పుడేలోనైతి నీతోనడ్డమాడేనా | 28/244 | 24 |
| 5. | అవ్వలిమోమేటికే అంతవానితో | 28/306 | 12 |
| 6. | ఆటదానగనకనేనాసలు | 10/63 (చి.శృ) | 49 |
| 7. | ఆతనినె దూరరమ్మ అలుగకుండిన | 10/49 (చి.శృ) | 25 |
| 8. | ఆయలేరే యేమిచెప్పేరాతని సుద్దులు | 17/303 (పె.శృ) | 21 |
| 9. | ఇంచుక యసమిచ్చితే యెవ్వరూ | 10/62 (చి.శృ) | 52 |
| 10. | ఇంతటి నీచక్కదనమిలాగు నేరుపులు | 17/378 (పె.శృ) | 54 |
| 11. | ఇందుకుగా గోపించనేల నీకు | 17/75 (పె.శృ) | 07 |
| 12. | ఇచ్చితిమి కానుక ఇంతకు తొలుతె | 28/155 | 22 |
| 13. | ఇద్దరికి దైవముయెట్టు గూర్చె | 28/312 | 09 |
| 14. | ఇన్ని సగినములు యింతికి మేలు | 17/408 (పె.శృ) | 50 |
| 15. | ఇరుమొన సూదివని యింపుసేసుకుందు | 10/56 (చి.శృ) | 41 |
| 16. | ఈ చనవు లీవలపు లెందుగన్నవి గావు | 17/58 (పె.శృ) | 30 |
| 17. | ఈరీతి రాముడు కృష్ణుడు యశోద యెదట | 17/372 (పె.శృ) | 17 |
| 18. | ఊరకేవున్నాడితడు వోరుపుతోడ | 28/135 | 39 |
| 19. | ఎంతకు నెంతేకాక యెక్కడేటి | 28/140 | 51 |
| 20. | ఎంతలేదుతలపోత యెంచి చూడ | 17/60 (పె.శృ) | 26 |
| 21. | ఎంత వేడుకో మోహమెటువంటిదో | 17/307 (పె.శృ) | 05 |
| 22. | ఎందరిదూరె యెవ్వరి వేడె యెంతని వేగిరించె | 10/48 (చి.శృ) | 23 |
| 23. | ఎక్కడ పరాకునీకు నేటివచ్చె సిగ్గులు | 28/117 | 02 |
| 24. | ఎవ్వరి మాటలు నేనేలవినేను | 28/206 | 31 |
| 25. | ఏటికి సిగ్గువడేవు ఇంకా నీవు | 28/134 | 46 |
| 26. | ఏమనేము నిన్ను యెగసక్కేడ విన్నిటా | 17/39 (పె.శృ) | 53 |
| 27. | ఏమి నేర్పెనో యీరమణి నీకు | 28/20 | 18 |







| | | | |
|---|---|---|---|
| 28. | ఏలవూరకుందానవు యిట్టె నివ్వెరగుతో | 28/17 | 29 |
| 29. | ఏలసేసే మాయలు యెందాకా | 28/18 | 20 |
| 30. | ఔనే మంచిదానవౌదువేనీవు | 28/305 | 14 |
| 31. | కదునేరుపరినంటా గర్వించేవు | 17/303 | 58 |
| 32. | కాదని వేగిరించితే కరగీనా | 10/53 (చి.శృ) | 56 |
| 33. | కొమ్మల జవ్వనము కోరువట్టేవా | 17/444 (పె.శృ) | 35 |
| 34. | చాలుజాలుమాతో సటలేటికి | 28/133 | 44 |
| 35. | చెప్పినట్టే సేతుగాక చేరినీకు | 20/210 | 10 |
| 36. | చెలియప్రాణనాథ నాకు చెప్పనేల | 17/305 (పె.శృ) | 17 |
| 37. | చేరితాజెప్పినట్టెల్లాజేసె | 17/308 (పె.శృ) | 03 |
| 38. | తనువె యిక్కడగాని తలపెల్లా | 10/55 (చి.శృ) | 45 |
| 39. | తానేడనేనేడ తడవినన్ను | 17/371 (పె.శృ) | 38 |
| 40. | తానేల సిగ్గువడీని తనతోనేనే | 28/19 | 16 |
| 41. | దేవుడటయీతడు దేవులట మహాలక్ష్మి | 17/445 (పె.శృ) | 32 |
| 42. | ధరలో నెఱగమమ్మ తగవులిటు | 17/306 (పె.శృ) | 09 |
| 43. | నిన్నుజూచి వెరగయ్యీ నేడు | 28/71 | 42 |
| 44. | నీవేమిసేతు వాపెనిన్ను బెరరేచగా | 10/50 (చి.శృ) | 27 |
| 45. | నీవేల వత్తువయ్య నెలతబాసి | 10/51 (చి.శృ) | 57 |
| 46. | నేనొకతెనంటానుండినేడు | 17/50 (పె.శృ) | 28 |
| 47. | పట్టరైరి గామిమ్ము బడతులు | 17/304 (పె.శృ) | 19 |
| 48. | పవ్వళించు మిపుడిట్టె పానుపుమీద | 28/72 | 06 |
| 49. | పించెపుతల జడలపిన్నవాడు | 10/64 (చి.శృ) | 33 |
| 50. | మంచితనము లదెట్టు మరచీనయ్యా | 10Y/54 (చి.శృ) | 55 |
| 51. | మాతోడ దనకేల మచ్చరములు | 28/205 | 48 |
| 52. | ముందెరిగి బతుకు మోహపుదాన | 28/243 | 37 |
| 53. | విచారించుకోవుగాక వేడుకకాడవు | 28/21 | 08 |
| 54. | వెడకూటములకంటె విరహమే మేలు | 17/379 (పె.శృ) | 43 |
| 55. | వేగిరమా నీవు విభుడవు నీవెలది | 10/57 (చి.శృ) | 36 |
| 56. | సరుసదిష్టములకు సాకిరేలరా | 17/77 (పె.శృ) | 15 |
| 57. | సాగిన సబలలోన సరివారిలోన | 17/76 (పె.శృ) | 13 |
| 58. | సిగ్గులువడుదువు నేమివి చెప్పిన | 17/409 (పె.శృ) | 47 |
| 59. | హరి మంగళం | | 59 |

# ప్రార్థన

కం॥ శ్రీకాంతుని కీర్తించుట-
కే కద! యీ జీవనంబు క్రీడించుటకా?
మాకేల కీర్తి, సిరులును
మాకీ హరిసేవ చాలు మన్నన యిదియే.

ఉ॥ చేకొని వేంకటేశ్వరుని సేవగకైతలు చెప్పినారహో!!
ఆకడతాళ్ళపాక కవులైన మహాత్ములు అన్నమయ్యకున్
సోకగు పుత్రపౌత్రులతిసొంపుగ ఆమకుటంబుతోడనే
శ్రీకరువేంకటేశ్వరుని సేవతరించిరి మాకు భాగ్యమై.

ఆ.వె॥ భావపరిమళంబు పరిఢవిల్లుచునుండ
తాళ్ళపాక కవులు తలలువూప
నేటివారి కొరకు నీటుగ జెప్పెద
చదివి దీనిమెచ్చ సంతసింతు.

తే.గీ॥ మొదట శృంగార కవితలు ముగ్గురున్ను
చెప్పినవి ఎన్నుకొంటిని చెలువమొప్ప
ఆర్తితీరక అధ్యాత్మ కీర్తనముల
జెప్పితరియింతు వేంకటశిఖరవాస!

చం॥ సరసుడు వీడు శ్రీవిభుడు జన్మల భాగ్యప్రదాత తానెయౌ
తిరుమల చేరియొక్కపరిదీవెనలందుము మంచిదారిరా
పరిమితమైన జీవితము బాధ్యత తీరదు చావుదాక,నా
తెరవును మీరు చేకొనుడుదేనికి శంకలు నమ్ముడీహరిన్.





సీ॥ హరిసేవకే వేంకటాధిపు మకుటమ్ము
చేబూనికైతలు చెప్పినారు
అన్నమయ్య, అతనికాప్తుడౌ మనుమండు,
సుతుడు అదేబాట జొచ్చినారు
తాళ్ళపాక కవులు తరియించుటే కాదు,
మనబోంట్లకును ముక్తి మార్గమిడిరి
కొడుకులన్నను తండ్రి కోర్కె దీర్చెడివారె
కొరివిబెట్టుటకేమి కొయ్యచాలు

ఆ.వె॥ అచ్చతెనుగు కవిత అవగతమగుటకు
నేటితరమువారి నేర్పు మితము
భావపరిమళంబు భక్తితో జెప్పితిన్
దిక్కునాకు నీవె తిరుమలేశ!

తరళము :
తరతరాలుగ శ్రీనివాసుని తాతతండ్రులు మన్మడున్
కొలుచుటే అపురూపమందురు కార్యదీక్షగ కైతలన్
విలువతగ్గక కీర్తనంబులు వేంకటామకుటంబుతో
చెలువమెప్పుగ చెప్పిరందుకె చేరి బొందిరి మోక్షమున్.

కం॥ హరిసేవకె యీ దేహము
హరిజేరని జన్మయేల అది వ్యర్థమురా
హరిజెప్పని చదువెందుకు?
హరిగొల్వని చేతులేల హత్యలకొరకా?

మ॥ ఇదియే చక్కటి బాటరా కొలువనై ఈశున్ జగన్మోహనున్
పదిలంబైనది పెద్దలెందరొ ఇదే బాటంది వైకుంఠమున్
ముదమొప్పున్ గడియించిరయ్య వినుడీ ముద్దార నాకున్ హరే
అదిగో ఈ మకుటంబెరక్షయనుచున్ అందింతు మీకీ కృతిన్.

# తొలిపలుకు

శ్రీవేంకటేశ్వర అనే మకుటంతో 32000 కీర్తనలు చెప్పిన ఘనుడు తాళ్ళపాక అన్నమాచార్యులవారు. రమారమి 75 సంవత్సరాలు ఆ యజ్ఞం నిర్వహించారాయన. ఆయన కీర్తన వినని శ్రీహరిభక్తుడు వుండడు. మన దురదృష్టంకొద్దీ 20 వేల కీర్తనలు లభ్యంకాలేదు.

ఆయన తదనంతరం వారి సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు తండ్రిమాట ప్రకారం అదే మకుటంతో తానూ అనేక కీర్తనలు చెప్పారు. అంతేకాదు తాతగారివద్దనే పెరిగి ఆయన వారసత్వంగా సాహిత్య పరిమళం అందుకొన్న ఒక సుపుత్రుని కన్నాడు. ఆయనే చినతిరుమలాచార్యులవారు. ఆయనా తాతగారివలె కీర్తనలు చెప్పి తిరుమలేశుని సేవించారు. కొడుకుల కవితా శైలి పరంపరగా సాగింది. ఇదివరలో అన్నమయ్య – అనుయాయులు అనే పేరుతో అన్నమయ్య భక్తి కీర్తనలు, పెదతిరుమలయ్యవి శృంగార కీర్తనలు, చినతిరుమలయ్యవి వైరాగ్య కీర్తనలను పరిచయం చేసే భాగ్యం ఆ తిరుమలేశుడు నాకు కల్పించాడు. దానిని టి.టి.డి. వారు ముద్రిస్తున్నారంటే, నా జన్మ చరితార్థమైనదని భావిస్తున్నాను.

నేడు అదే స్ఫూర్తితో వారి ముగ్గురి శృంగార కీర్తనలకు భావపరిమళం అందిద్దామనే తలంపు ఆ స్వామే నాకు





కలిగించాడు. దాని ఫలితమే ఈ నా ప్రయత్నం. ఇదే కోవలో భక్తి, వైరాగ్య కీర్తనలు చెప్పాలని నా ఆకాంక్ష. ఆపైన శ్రీనివాసుని దయ నా ప్రాప్తము.

నా భావన యేమంటే ముగ్గురిలోనూ పెదతిరుమలయ్య కవిత కొంచెం అధిక శ్రమపడునట్లు చేస్తుంది. అన్నమయ్య కవిత అలవోకగా వుంటుంది. కాకపోతే మనబోటి నవీన యుగమువారికి అన్నమయ్య కవిత కష్టమే. నాచేత తిరుమలనాథుడు చెప్పించిన దీనినాస్వాదించండి. నేను వాడిన భాష తేలికపాటిదే అవటంవల్ల మీకు నచ్చుతుందని ఆశిస్తాను.

పెదతిరుమలయ్య భార్య తిరుమలాంబ. ఈయన భగవద్గీతను తెలుగు వచనముగా చెప్పాడట. హరివంశాన్ని ద్విపద కావ్యంగా రచించాడట. రెండవది నేడు లభ్యమగుటలేదు. ఆయన "సంకీర్తనా లక్షణము" అనే గ్రంథమునకు వాఖ్య రచించినట్లు చినతిరుమలాచార్యులవారు పేర్కొనినాడు. ఈయనకు అనేక బిరుదులున్నాయట. వేదాంతాచార్య, కవితార్కిక కేసరివంటివి సుప్రసిద్ధములు.

ఆ దంపతుల సుపుత్రుడే చినతిరుమలాచార్యులవారు. ఈయనకు అష్టభాషా చక్రవర్తి అని బిరుదున్నది. తన తాతగారు అన్నమాచార్యుల శిక్షణలో పెరిగిన చిన తిరుమలయ్య తాతగారి కీర్తనలు జీర్ణించుకొని పెద్దవాడైనాడు. సంగీత సాహిత్యాలు రెండిటిలోనూ దిట్ట. ఈయన నేటి గుంటూరు సమీపమునగల

మంగళగిరి నరసింహస్వామిని దరించినట్లు ఒక శాసనముద్వారా తెలియవచ్చుచున్నది. ఈయన కీర్తనలద్వారా నేటి చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలోకూడా విశిష్టాద్వైతమత ప్రచారానికై దర్శించి పెక్కు అర్చావతారములను చినతిరుమలయ్య దర్శించి కీర్తనలు చెప్పినాడు. అలమేలుమంగాపురంలోని పెక్కు జీర్ణమైన ఆలయములను పునరుద్ధరించినాడు.

"హరి సేవకే వేంకటేశ మకుటం" అనే ఈ నా రచనలో మొదటి రెండవ సంపుటములలో శృంగార కీర్తనలు మూడు నాలుగు సంపుటములలో వైరాగ్య కీర్తనలు ఐదు, ఆరవ సంపుటములలో భక్తి కీర్తనలు చెప్పాలని నా ఆకాంక్ష. ఆపైన తిరుమలేశుని దయ నా ప్రాప్తము. తాత తండ్రి మనుమడి కవితా ఒరవడి పాఠకుల మన్నన అందుకొనేట్లు ఏడుకొండలయ్య దీవెనలకు ఆశపడుతున్నాను. లేకున్న ఇంత బృహత్ ప్రయత్నం నెరవేరేనా?

తండ్రుల దీక్షను తనయులు కొనసాగించటము ఈ నవీన కాలంలో తండ్రుల మాటవినే పుత్రరత్నాలే, రత్నాలవలె అల్పసంఖ్యలో వున్నారు. ఇక తండ్రి దీక్ష తమకేం పని అనుకోవడంలో ఆశ్చర్యమేముంది? కాని పెద తిరుమలయ్య వంటి కొడుకులు, చినతిరుమలయ్యవంటి మనుమలువున్న అన్నమయ్యలు నేటియుగంలో కానరారు. అందుకే నాఈ భగవత్సేవకు ఈ పేరు సరిపోతుందని భావిస్తాను.





ఇందులో 50 కీర్తనల సంపుటమునొకదానిని ఆడియో సి.డి.గా వెలువరించాలని నా ఆకాంక్ష. నా మిత్రులు విన్నకోట మురళీకృష్ణగారి సహకారంతో నా కోరిక తీరుతుందని నా ఆశ.

నా ఇతర రచనలన్నీ భగవద్సేవాభాగమే. అవన్నీ Google Site లో geetadeeksha.com లో లభ్యమవుతాయి

**తిరుమల తిరుపతి దేవస్థానములవారికి సదా కృతజ్ఞుడను**











సంఖ్య : 309 సంపుటము : 17 పుట: 179 రాగం : పాడి

1 అడిగితే నేమనునో అడుగకున్నాఁ బోదు
పుడివోని తలఁపోత నున్న దేకారణమో ॥పల్లవి॥

బంగారుమేడకంబము కౌఁగిలించి పట్టి
అంగన తా నిలుచున్న దప్పటనుండి
తొంగి చూచినమాతో మాటలాడ దిదే
అంగవించినట్టి పరా కది యెటువంటిదో ॥అడిగి॥

గోడలపై చిత్తరువు కోరి కోరి చూచుకొంటా
వాడుదేరి శిర సట్టే వంచి వంచి
వీడెము చేతి కిచ్చిన వెలఁది యందుకో దిదే
యేడ నున్నదో చిత్త మెన్నఁడు నెఱుఁగము ॥అడిగి॥

చేతిలోఁ దామెరపువ్వు చెలి గోర నొత్తుతాను
ఘాతఁ దన లోలోనే కరఁగఁగాను
యీతల శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
చేతనె ఆతని మెచ్చీఁ జెలికే తెలుసును ॥అడిగి॥309

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య, చేతిలో తామరపువ్వు వున్న చెలి యొక్క చిత్త ప్రవృత్తిని సరసంగా వర్ణిస్తున్నారు. అంటే అలమేలుమంగ తలపోతలిలా వున్నాయి. "నేను అడిగితే అతగాడు యేమంటాడో. అడగకుంటే ఈ అనుమానం తీరదు. నాకు వుడివోని (తొలగని) ఆలోచనలు వస్తున్నవి. కారణమేమో కదా!". తన బంగారు మేడలోని స్తంభమును కౌగలించి పట్టి ఈ యువతి అప్పటినుండి నిలుచున్నది. మేము యేమిచేస్తున్నదా అని తొంగి చూస్తే మాతో కూడ మాటలాడదు. అతిశయించిన ఈమె పరాకు యెట్టిదో చూడ నాశ్చర్యము కలుగుచున్నది. ఈమె గోడపైనున్న తన ప్రాణేశ్వరుని చిత్తరువును తీరని కోరికతో చూచుకొంటున్నది. అట్లా చూస్తూ అలసినదై తన శిరస్సును అట్టే వంచి వుండిపోయింది. మేము తాంబూలము చేతికిచ్చినా ఈ వెలది అందుకొనదు. ఈమె చిత్తము యేదనున్నదో. మేమిది యెన్నడూ యెరుగము. చేతిలో తామరపూవున్న ఈ అలమేలుమంగ తన గోటితో ఆ పుష్పమును గాటుపడేలా వొత్తుచూ తనలోతానే పరవశించుచున్నది. ఇంతలో శ్రీవేంకటేశ్వరుడు ఆమె వద్దకు చేరాడు. స్వామి ఆమెను కూడగానే ఆ చెలి ఆయనను మెచ్చినది. ఎందులకో ఆమెకే తెలియును.

★ **అంగవించి**– అతిశయించి ★ **ఘాతన్** – దెబ్బతగులునట్లు (లేక) గాటు పడేలాగున





సంఖ్య : 114 సంపుటము : 28 పుట: 77 రాగం : హిందోళవసంతం

2 ఎక్కడ పరాకునీకు నేఁటికి వచ్చి సిగ్గులు
మక్కువ నీపైఁ జల్లీ మాఁటలాడవయ్యా ॥పల్లవి॥

సానఁబట్టిన చూపులు సతి నీపై వెదచల్లి
కానుకలిచ్చీ నిదె కైకొనవయ్యా
వానల చెమటలు మైవడియంగఁ దనచన్ను
లానుకొని విన్నవించీ నాలకించవయ్యా ॥ఎక్క॥

సెలవుల నగవులు చిదుముడిఁ బచారించి
పలుమారు పాదాలొత్తీ పైఁజాఁచవయ్యా
లలిఁ దొడలకాంతులు వలిపెములోఁ జూపట్టి
కొలువు సేసీ యిదె చే కొనఁగదవయ్యా ॥ఎక్క॥

కొనగోరి తాఁకులు గురుతై ఆయములంట
యెనసి కాఁగిట నించీ నేలుకోవయ్యా
ననిచి శ్రీవేంకటేశ నంటున సేసలు వెటీ(ట్టీ?)
వనిత యిన్నిటాఁ జనవరిఁ జేయవయ్యా ॥ఎక్క॥114

**భావపరిమళం :**

ఈ సరస శృంగార కీర్తనలో అన్నమయ్య స్వామితో చనువుగా యేమంటున్నారో వినండి ప్రభూ! ఇది యెక్కడి పరాకు (పరవశత్వము)!! నీకు యేటికి (యెందుకు) సిగ్గుకలుగుతున్నదయ్యా? దేవి నీపై మక్కువ చిందిస్తుంటే నీవామెతో మాటలాడవేమయ్యా? నీ సతినీపై సానబట్టిన (పదునైన) చూపులను జల్లుచున్నది. ఆమెకిష్టమైన కానుకలందించి నీ వశము చేసికొనవయ్యా! ఆమె చెమటలు వానవలె వడియంగ (కారిపోతుంటే) ప్రేమాతిశయంతో వక్షోజములచే నిన్ను మృదువుగా వొత్తుచున్నది. అదే మైమరపులో నీకేదో విన్నవిస్తున్నది, ఆలకించవయ్యా! స్వామీ! ఆ దేవి తన వోరనవ్వులతో, సంభ్రమమును ప్రసరించుచున్నది. అనేకమార్లు నీ పాదములొత్తేననగా నీ పాదములను చాచి ఆమె వొడినుంచవయ్యా! ఆమె వూరువులకాంతి వలిపెములో (చీరలోనుండే) చూపట్టుచున్నది. ఆమెకు నీకొలువు ననుగ్రహించి స్వీకరించరాదా దేవా! అయినా, శృంగార రాయడివైన నీకు మేము చెప్పేదేమి?నీ కొనగోటితాకులలో గుర్తులు వడిన ఆమె మదనాంగముల నంటేవు.అతిశయించి, కౌగిటనించి ఆమె నేలుకోవయ్యా! ననిచి (ప్రీతితో) వో శ్రీవేంకటేశా! సంపర్కమున సేసలువెట్టి (అక్షతలు చల్లి) ఆ వనితకునీ చనవరి (చనువును) వొసగుమయ్యా!

★ **చిదుముడి** – సంభ్రమము ★ **ఎనసి** – అతిశయించి

సంఖ్య : 308 సంపుటము : 17 పుట: 178 రాగం : ధన్యాసి

**3 చేరి తాఁ జెప్పినట్టెల్లా జేసేఁ గాని**
**పేరు కుచ్చి మా యింటికిఁ బిలువకే యాతని** ॥పల్లవి॥

**యెవ్వరింటఁ జూచినాను యేరూపై వున్నాఁడో**
**యివ్వలఁ గమలాసతియింట నున్నాఁడో**
**మవ్వపు పాలజలధిమాయయింట నున్నవాఁడో**
**రవ్వగా వెదకి తేరే రమ్మని మా యింటికి** ॥చేరి॥

**గక్కన ప్రహ్లాదుకుఁగాకంబములో నున్నవాఁడో**
**పుక్కటకావులఁ గావఁ బోయి వున్నాఁడో**
**చిక్కించుక గోపికలచీర లంట బోయినాఁడో**
**దిక్కుల వెదకి తోడి తేరేమా యింటికి** ॥చేరి॥

**అల్లదే రేపల్లెలోన నాడఁబోయివున్నాఁడో**
**యిల్లిదే సీతఁబెండ్లాడనేగినాఁడో**
**వొల్లనే శ్రీవేంకటాద్రినుండేటి దైవము నేఁడు**
**వుల్లసాన విచ్చేసెనే వున్నతి మా యింటికి** ॥చేరి॥ **308**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన సరస శృంగార కీర్తన ఇది.నాయిక తనచెలులతో మొదట తనప్రియుని తనింటికి పిలువవద్దని చెప్పింది. తాను చెప్పినట్లే చేసెదనుగాని అతనిని పేర్కొని పిలువకండే అని నిక్కచ్చిగా చెబుతున్నది. కానీ అటు పిమ్మట తానే ఆతనిని పిలుచుకొనిరమ్మని వేడుకొంటున్నది. ఏమిటీ మార్పు? ఎవ్వరింట చూచినా ఇతగాడేరూపంలో వుంటాడో యెవరికి తెలుస్తుంది? కమలాసతి (లక్ష్మీదేవి) ఇంట వున్నాడేమో? లేక తనమామగారైన క్షీరసాగరుని ఇంటనున్నవాడో? చెడ్డపేరు వచ్చినా సరియే అతగాడిని మా ఇంటికి రమ్మని తీసుకొని రారే!! అవునుగానీ ఒకవేళ నరహరియై ప్రహ్లాదుని రక్షించుటకై స్తంభములో దాగినాడా యేమి? లేక పుక్కటకు (వూరకనే) ఆవులను కాయుటకై పోయినాడా? ఎందుకంటే అతగాడు ఒకప్పుడు బలరాముడు కదా! లేదా చేతికి చిక్కించుకొని మళ్ళీ గోపికల చీరలెత్తుకుపోయి యమునాతటిని చెట్టెక్కినాడా? ఏ దిక్కుకైనా పోయి వెదకి మా ఇంటికి తీసికొనిరారో!! అల్లదిగో కనుపించుచున్న రేపల్లెలో గోపాలురతో ఆడుకొనుటకు బోయినాడా? ఇదిగో సత్యసంధుడు శ్రీరాముడై సీతను పెండ్లాడబోయినాడా? నేడు ఒల్లనే (శీఘ్రముగా) శ్రీవేంకటాద్రి మీదవుండే దేవుడై మా ఇంటికి ఉల్లాసంగా విచ్చేసినాడే.

★ **ఉల్లసాన** – ఉల్లాసముగా ★ **మవ్వపు** – కోమలమైన





సంఖ్య : 312 సంపుటము : 28 పుట: 211 రాగం : రామక్రియ

**4 ఇద్దరికి దైవము యెట్టు గూర్చెనో**
**గద్దరి తనములందె కలిగె కొసరులు** ॥పల్లవి॥

**సొలసి సొలసి నిన్నుఁ జూచి నేనే భ్రమసితి**
**బలిమి నీ మనసెంత భ్రమసెనో**
**నలుపులు తెలుపులు నాకన్నులసాజము**
**తెలిసితే నలుపులుఁ దెలుపు నీ చేఁతలు** ॥ఇద్ద॥

**నలువంక నీతోడ నవ్వి నవ్వి యలసితి**
**అలరి నీ తనువెంత యలసెనో**
**మలకలు కొలుకులు మా కురులసాజము**
**అలరి మలకలు నీ యన్ని గుణములును** ॥ఇద్ద॥

**కావరించినీ కాఁగిట కలసి నే వెలసితి**
**వేవేలై నీమోవి యంత వెలసెనో**
**శ్రీ వేంకటేశుఁడ మాకు సిగ్గులెల్లా సాజము**
**యీవల నీకు సిగ్గులెందు వచ్చెనో** ॥ఇద్ద॥ **312**

**భావపరిమళం :**

అన్నమయ్య దేవి చెప్పినట్టుగా ఈ కీర్తన చెబుతున్నారు. ఆ దైవము మన ఇద్దరికి యెట్లు సమాగమమును కల్పించినాడో కదా! గద్దరి తనములందు (దిట్ట తనములలో) కలిగే కొసరులు (అనుభవములు) ఇద్దరికీ కలిగినవి. ఆ వివరములను వినండి. స్వామీ! తదేకంగా నిన్ను జూచి సొలసి సొలసి నేను భ్రమసితిని (భ్రమపడ్డాను) మరి బలీయమైన నీ మనసెంత భ్రమసినదో తెలియదు. నలుపులు తెలుపులు (నల్లని కనుగుడ్లు, తెల్లని కన్నులు) నా కన్నుల కుండుట సహజమే. కానీ తెలుసుకొంటే నీ చేతలు (పనులన్నీ) నలుపలు అనేనాకు మనస్సు తెలుపుచున్నది. నలుదిక్కుల నీతో నవ్వీనవ్వీ నేను అలసితినయ్యా! నన్ను అలరించిన నీతనువెంత అలసెనో నేనెఱుగను. మా కురులలో (కేశపాశమున) మలకలు కొలుకులు (వంకరలు చిక్కులు) వుండుట యెంతో సాజము (సహజము). కాని నీ అన్ని గుణములలోనూ మలకలు (వక్రబుద్ధులు) అలరియున్నవి. అదే వింత. అయినప్పటికీ కావరించిన (మదించిన) నీ ఆలింగనంలో కలిసిన నేను వెలసితిని (శోభించితిని) అనేకమార్లు నీ అధరామృతమునెందరు తరుణులు గ్రోలిరో, మరి నీ అధరములు వెలసినవో (ప్రసన్నమైనవో). ఓ శ్రీవేంకటేశ్వరా! మేము స్త్రీలము మాకు సిగ్గులు సహజమే. కానీ నీకు సిగ్గులెందుకు వచ్చెనో అంతుచిక్కుటలేదు.

★ **నలువంక** – నాలుగుదిక్కుల ★ **వేవేలై** – అనే విధములుగా

సంఖ్య : 307   సంపుటము : 17   పుట: 178   రాగం : పాడి

**5 ఎంత వేడుకో మోహ మెటువంటిదో**
**చెంతలను తనరాక చెప్పకు మనీని ॥పల్లవి॥**

**వెన్నెలబాయిటనుండి విభునిపైఁ బదములు**
**సన్నపు టెలుఁగునను సతి పాడఁగా**
**కన్నులను నవ్వుకొంటాగక్కననాతఁడువచ్చి**
**సన్న సేసీనే చెలుల చాటున వింటాను ॥ఎంత॥**

**శింగారవనములోన చెలులతో రమణుఁడు**
**అంగవించిన ముచ్చట లాడుకోఁగాను**
**యింగితానఁ దానె వచ్చి యింకానడుగుమంటా**
**అంగనల నెచ్చరించి ఆడనే దాఁగీని ॥ఎంత॥**

**తరుణి శ్రీవేంకటేశుఁ దలఁచి కప్పురవీడె -**
**మరిది నుపార మిచ్చి యందుకోఁగాను**
**గరిమె నాతఁడే వచ్చి కని కౌఁగలించి కూడె**
**పొరి నాకెగుణములే పొగడుకొంటాను ॥ఎంత॥ 307**

**భావపరిమళం :**

ఈ కీర్తనలో పెదతిరుమలయ్య శ్రీనివాసుని సరసత్వాన్ని వుదహరిస్తున్నారు. ఆ స్వామికి పద్మావతీదేవిపై యెటువంటి మోహమో!! ఆమెతో సరసమాడుట ఆయనకు యెంతవేడుకో!! తాను దేవి చెంతకు వచ్చినా చెలులకు తన రాకను దేవికి చెప్పకు మనీని (చెప్పవద్దని హెచ్చరిస్తాడు.) ఆ చిలిపి తనమును చూడండి. దేవి ఆరుబయట వెన్నెలలో కూర్చుని స్వామిపై పాటలు తన సన్నటి గొంతుతో పాడుతున్నది. నవ్వుతున్న కన్నులతో స్వామి రహస్యంగా అక్కడికి వచ్చాడు. చాటుగా వుండి పాటను వింటూ తనరాక చెప్పవద్దని చెలులకు సైగ చేశాడు. ఇది తెలియని దేవి పరవశంగా పాడుతూనే వున్నది.ఒక రోజు శృంగారవనంలో రమణుడు అతిశయించి చెలులతో ముచ్చటించుచూ వున్నాడు. ఇంతలో దేవి రావటం చూచి చటుక్కున దాగినాడు. పైగా తననడిగిన ప్రశ్నలే దేవినీ అడుగుడని ఆ అంగనలను హెచ్చరించినాడు. ఇదేమి తెలియని దేవి ఆ ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి అయినది. తరుణి (పద్మావతీ దేవి) శ్రీవేంకటేశుని తలచుకొంటూ చెలియ ఇచ్చిన కప్పుర విడెమును వేడుకగా "ఉపారమిచ్చి" (భోజనానంతరమున) అందు కొంటుండగా, శ్రీవేంకటేశుడే అక్కడకు హఠాత్తుగా విచ్చేసి ఆమెను బిగియార కౌగలించి కూడినాడు. శృంగారంలో కూడా ఆయన దేవి గుణములను పొగడుతూనే వున్నాడు.

★ **పొరి** – అధికముగా ★ **అరిది** – వింతగా (వేడుకగా)





సంఖ్య : 72   సంపుటము : 28   పుట: 49   రాగం : కాంబోది

**6 పవ్వళించు మిపుడిట్టె పానుపుమీఁద**
**దవ్వులనే యీవేళ తలవంచేవయ్యా ॥పల్లవి॥**

**రవ్వలాయ నామోహము రచ్చకెక్కె నీ తగవు**
**నవ్వినటులనే వుండి(డె?) నాకు నీకును**
**పువ్వువంటి జవ్వనము పూఁచరాదు దాఁచరాదు**
**చివ్వన నీవేఁటికి సిగ్గువడేవయ్యా ॥పవ్వ॥**

**మేర మీరె నావేడుక మెరసెను నీచలము**
**నారుకొనెఁ గోరికెలు నాకు నీకును**
**భారమైన తమకము పట్టరాదు ముట్టరాదు**
**దారకాన నీవేల తలపోసేవయ్యా ॥పవ్వ॥**

**కడు మించె నా కాగిలి కానవచ్చె నీగుణము**
**నడుమఁ బంతము దక్కె నాకు నీకును**
**యెడయక శ్రీ వేంకటేశ యేలితివి నన్ను**
**తడఁబడి నీవేల దప్పిదేరేవయ్యా ॥పవ్వ॥ 72**

**భావపరిమళం :**

ఇది స్వామి పవ్వళింపుసేవలో అన్నమయ్య ఆలపించిన సరస శృంగారకీర్తన అని నా భావన. స్వామీ! నీ పానుపుపై ఇప్పుడైనా విశ్రాంతిగా పవ్వళించవయ్యా! ఈవేళ దవ్వులనే (దూరానవున్న) ఆర్తుల విన్నపములకు తలవంచేవయ్యా! (అంగీకరించేవు). నేను నీ మోహములో తపించాను. నా మోహము, రవ్వలాయెను (అల్లరిపాలైంది) నీవాడిన తగవు రచ్చకెక్కింది. నీకునాకు నడచిన వ్యవహారం నవ్వులపాలైనది. ఎక్కడైనా యౌవనాన్ని అందులోనూ పూవువలె వికసించినదాన్ని దాచలేము. అలాగని చిగురింపజేస్తే చిక్కులే. అయినా తొందరపడి నీవేల సిగ్గుపడేవయ్యా? ప్రభూ! నా వేడుక (నా విలాసము) హద్దులు దాటింది. నీ పట్టుదలా అతిశయించింది. నాకూ నీకూ కూడ చిలిపి కోరికలకు అంకురార్పణ జరిగింది. భారముగా మారిన తమకమును (పారవశ్యమును) పట్టరాదు ముట్టరాదు. దీనినొక దృష్టాంతరముగా తలపోసేవయ్యా, తిరుమలయ్యా! దేవా! నా కౌగిలి అతిశయించినది. నీగుణమేమిటో బట్టబయలైనది. నాకూ నీకూ మధ్య పంతము మాత్రం దక్కినది (మిగిలిపోయింది). ఓ శ్రీవేంకటేశ్వరా! విడువక నన్నేలితివి. అయిననూ నీకీ తడబాటేల? నీవేల తృప్తిచెందెదవయ్యా?

★ **నారుకొను** – అంకురార్పణ ★ **దప్పిదేరె** – తనివితీరె, తృప్తిచెందె

సంఖ్య : 75 సంపుటము : 17 పుట: 46 రాగం : వరాళి

**7 ఇందుకుఁగాఁ గోపించ నేల నీకు?**
**ముందుగల కోపమెల్లా ముగిసెఁ బోరా** ॥పల్లవి॥

**కొమ్మ నీ కుచము లివి కొనవాండ్లా యింత?**
**యెమ్మె లేల నీకు నందు కేమి వోదురా.**
**అమ్ముదు జక్కవలంటా నడిగితినే, వోరి**
**కమ్మర మానవు నే మంగడివారమా?** ॥ఇందుకు॥

**పొలఁతి నీ మోవిపండు పుల్లనో తీపో? వోరి**
**తొలరా నీ కే లందుతోడి చింత?**
**వెలవెట్టె యందు కేమి వెఱపాయనా నీకు?**
**వలపుగంపల నమ్మ వచ్చితినా నేను?** ॥ఇందుకు॥

**వనిత నా కౌఁగిలి వదలకువే యిట్టె,**
**తనిసితి మిద్దరికిఁ దగులాయను.**
**వినవె శ్రీవేంకటవిభుఁడ నేను, అన్నిఁ**
**గనుఁగొంటి విఁక నేమి కడ మాయరా?** ॥ఇందుకు॥ **75**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరసకీర్తన నాయికా నాయకుల సంవాదము. జాగ్రత్తగా పరికించిన వారికి మాత్రమే ఇది అర్థమవుతుంది. సంవాదానికి నాయకుడే శ్రీకారం చుడుతూ "ఇందుకొఱకు నీకు కోపించనేల" అని ప్రశ్నించాడు. దానికామె "నాకు ముందుగల కోపమంతా ముగిసింది, పోరా!" అన్నది. "ఓ తరుణీ! ఈ నీ కుచములు కొనవాండ్లు "కొనతేలియున్నవి" అనినాడతను. దానికామె "నీకింత గర్వములేలరా? అందుకు నీకేమీ పోదురా" అన్నది. అతగాడు "అదికాదే, జక్కువ పిట్టల నమ్ముతావేమోనని అడిగానే" అన్నాడు కొంటెగా ఆమె వక్షోజములను చూస్తూ. దానికామె "ఓరీ! నీ చతురత మానవా? మేము అంగడిలో పిట్టలనమ్మేవాళ్ళమటరా?" అన్నది. అతడు చిలిపిగా "ఓ పొలతీ! నీ పెదవులనే పండ్లు పుల్లనా? తియ్యనా?" అన్నాడు. దానికామె "ఓరీ! వాటి గురించి నీకు దిగులెందుకురా?" అన్నది. అతడు డాంబికంగా "వెలచెప్పవే నీకు అందుకేమి భయము?" అన్నాడు. దానికామె "నేనేమన్నా వలపు గంపలతో అమ్మవచ్చానాయేమిరా" అన్నది. అతడు "ఓ వనితా! నా కౌగిలివదలవద్దే" అని ప్రాధేయపడ్డాడు. దానికామె తనిసితిమి (తృప్తిచెంది) ఇద్దరము, అందుచే మనిద్దరికీ తగులాయెను" అన్నది. అతడు "వినవే, నేను శ్రీవేంకటేశుడను" అన్నాడు. ఆమె "నేను అన్నీ చూశాను. ఇక యేమీ లోటులేదురా" అని సంవాదము ముగించినది.

★ **కమ్మర** – మరల ★ **పొలతి** – యువతి





సంఖ్య : 21 సంపుటము : 28 పుట: 15 రాగం : లలిత

**8 విచారించుకోవుగాక వేడుకకాఁడవు నీవు**
**పచారించఁ బోతేను నీపై నిట్టె మోవదా** ॥పల్లవి॥

**సొలసి మాటలాడేటి సుదతిని విభుఁడవు**
**పలుకులలో నెగ్గులు పట్టఁదగునా**
**వలపించితి వాకెను వద్దనుండనినేరమి**
**నెలకొని వెదకితే నీ వొళ్లిదే కాదా** ॥విచా॥

**కొసరి చేతులు చాఁచే కోమలిచేఁతలకుఁగా**
**యెసఁగ వాసులువంతు లెంచవచ్చునా**
**వెసఁ బెండ్లాడితి వేవేల కోర్వకుండితే**
**అసుదుగా నిన్నె దూరి అందరూను నాడరా** ॥విచా॥

**కందువ నిన్నుఁగూడిన కాంతను శ్రీ వేంకటేశ**
**పొందుల రతులయలపులు చూతురా**
**సందడిఁ బెనఁగితివి సారె మెచ్చకమానితే**
**కిందటి పనులకు నీకె దయవుట్టదా** ॥విచా॥ **21**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరసకీర్తన సమన్వయపరచవలెనంటే చేతిలో ఒక్క నిఘంటువుంటే చాలదని నా భావన. అన్నమయ్య స్వామికి నచ్చచెబుతున్నారు. ప్రభూ! నీకు నీవే విచారించుకోరాదా? పైగా నీవు వేడుకకాడవు. నీవామెను పచారించబోతే (తిరస్కరిస్తే) నీపై మోపదా (బాధించిన నింద రాదా?) స్వామీ! నీవామె విభుడవు. పరవశత్వంతో మాట్లాడే తరుణి యొక్క మాటలలోని దోషములనెంచవచ్చునా? నీవామెను వలపించితివి. నేడు నీ సమీపమున లేదనే నిందవేసి నేరములు వెదకవచ్చునా? ఆమె నీ శరీరమే కాదా? దేవా! కోరి చేతులు చాచి ఆహ్వానించే కోమలి చేతలకు పరవశించాలేకాని, వన్నెల పరిమితుల నెంచవచ్చునా? నీవామెను ప్రేమించి పెండ్లాడితివి. ఆ బేల పొరబాట్లను, సహించకుండితే, నిన్ను తక్కువగా నెంచి అందరూ భార్యను బాధించిన వానిగా నిందించరా? స్వామీ! నీవు శ్రీవేంకటేశుడవు. నిన్ను కోర్కెతో పొందిన కాంతయొక్క నేర్పు చూతురుగాని, రసికులు పొందిన రతులలో అలసటలనెంచెదరా? నీవామెను సంరంభమున పెనగితివి కదా! నీ అల్పమైన చేతల వలన నీకే ఆమెపై దయపుట్టదా ప్రభూ!

★ **నాసులువంతులు** – వన్నెలపరిమితులు ★ **అసుదుగా** – తక్కువగా
★ **కందువ** – నేర్పుతో

సంఖ్య : 306 సంపుటము : 17 పుట: 177 రాగం : దేసాళం

**9 ధరలో నెఱుఁగ మమ్మ తగవు లిటువంటివి**
**తరుణికే తెలుసును తఱవాతిపనులు ॥పల్లవి॥**

**చెలిమది మదినుండి చెక్కు లేమిటికి గిల్లె**
**కెలసిఁ యాతఁడు గోపగించుకొనఁగా**
**వొలిసి త న్ననరాదు వూరకున్నమగవాని**
**తలఁచి తడవ నేల తా నలుగ నేలా ॥ధరలో॥**

**అట్టే నవ్వి నవ్వి పతి నాన లేమిటికి బెట్టె**
**దిట్టతనాన నాతఁడు దిట్టఁగాను**
**వొట్టి తన కింతైతే వొద్దనుండ పతితోఁ జేయి**
**ముట్టి సరసము లేల ముంగోప మేలా ॥ధరలో॥**

**కౌగిట శ్రీవేంకటేశుఁ గళ లేల తాఁకించె**
**పీఁగుచు నాతఁడు వొట్టు వెట్టుకోఁగాను**
**రాఁగిన రతులలోన రాజువలె నున్నవాని**
**వీఁగి యెలయించ నేల వేఁడుకొన నేలా ॥ధరలో॥ 306**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య ఈ సరసకీర్తనలో దేవి చెలికత్తెయై యేమంటున్నారో వినండి. మాదేవికి ఆమె మగనికి మధ్య చిలిపి కయ్యాలు అధికమవుతున్నాయి. ఇటువంటి తగవులు ఈ ధరణిలో యెఱుగమమ్మ! ఆ తరువాత జరిగే పనులు ఆ తరుణికే తెలియును. మాకు తెలిసే అవకాశమే లేదు. ఈ చెలియ (దేవి) మది, మదిలో లేదు. లేకున్న స్వామి కోపగించుకొనునంతగా ఆతని చెక్కులనేల గిల్లినది? కలుగజేసుకొని దేవిననుట కూడ సముచితము కాదు. ఊరకున్న మగవానిని తలచి విచారించనేల? అట్లే చేసినదిపో, దానికే ఆతడలుగనేల? అట్టే నవ్వీనవ్వీ, వున్నట్లుండి యేవేవో ఆనలు పెడుతుంది. దిట్టతనముగల మగవానికి కోపమురాదా? ఆతడు తిట్టినాడు. ఈమె తనకింత జరిగాక ఆతని వద్దకు జేరి తాకి ఆతనితో సరసమునేల ఆడినది? దానికాతడు తటాలున అలిగినాడు. అన్నీ అటుంచి కౌగిటిలోనున్న శ్రీవేంకటేశునికి ఈమె తన కళాస్థానములనేల తాకించవలె? వీగుచు (దెబ్బతినినట్లు) అతగాడు ఒట్టుపెట్టుకొనినాడు. రాగిన (రంజిల్లిన) రతులలో రాజువలె అతిశయించుచున్న వానిని, యెలయించనేల (పురికొల్పుటెందులకు) వోడి వేడుకోనేల?

(గమనిక : ఇది నా స్ఫురణ)

★ **ముంగోపము** – తటాలున అలుగుట ★ **కెలసి** – విజృంభించి





సంఖ్య : 311 సంపుటము : 28 పుట: 210 రాగం : నాద రామక్రియ

**10 చెప్పినట్టే సేతుఁగాక చేరి నీకు**
**తప్పులుఁ దారులు నెంచతగవేదీ ॥పల్లవి॥**

**నిన్నుఁ జూచి నవ్వు వచ్చె నీమీఁది కోపము దీరె**
**అన్నిటా దొడ్డవాఁడవు ఆనలేల**
**కన్నుల నిన్ను గంటిమి కాయమెల్లాఁ జల్లనాయ**
**పన్నేటి మాయల కిఁకఁ బనియేది ॥చెప్పి॥**

**మాఁట నీకుఁగా వెళ్లె మంకులెల్లఁ బెడఁబాసె**
**చాటువ గెలిచితిమి సాకిరులేల**
**నేఁటనే తప్పుదిఁకను నీవు నేను వున్నారము**
**వాఁటాలు సేయఁగ నీవల్లనేది ॥చెప్పి॥**

**కొనగోరు నిన్ను సోఁకె కూటము లందె కలిగె**
**పనిమంతుఁడవు వొడఁబాటులేల**
**ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి మిప్పుడిట్టె**
**చనవు చేకొనుచోట సాదించ నేది ॥చెప్పి॥ 311**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస కీర్తనలో దేవి, స్వామితో రాజీకి వచ్చి యేమంటున్నదో వినండి. ప్రభూ! నీకు చేరికయై నీవు చెప్పినట్టే చేతునుగాక! ఇంకా నా తప్పులు దారులు (పొరబాట్లు) యెంచతగునా? నీకు. స్వామీ! నిన్ను చూస్తే నవ్వు వస్తున్నది. నీమీద కోపము మటుమాయమై పోతున్నది. నీవు అన్ని విధములుగా మంచివాడవేనని నాకు తెలియును. ఆనలెందుకు పెట్టుకొంటావు? నిన్ను కన్నులారా చూడగానే, నా ఒళ్ళంతా చల్లబడినది. మరి ఇంకా నీకు మాయ చేయపనేమున్నదయ్యా? దేవా! నీమాట చెల్లినది కదా! అందువల్ల నీ మంకుతనము వెడబాసె (తొలగిపోయింది). చాటించినట్లు బహిరంగంగానే ఇద్దరమూ గెలిచాము. ఇంకా దీనికి సాకిరులేలా (సాక్ష్యములెందుకయ్యా?) నీవూ నేనే వున్నాము. అంతా బహిరంగమైనది. ఎవరిదెంత తప్పో వాటాలు వేయగా యెలా సాధ్యమవుతుంది? మన సంగమమునందే నా కొనగోటి తాకులు నిన్ను సోకినవి. నీవు చతురుడవు, పనిలో నేర్పరివి. మరి నీకు ఒడబాటులేవీ? ఘనుడవైన శ్రీవేంకటేశ్వరా కాముని పనిలో కలిసినారము. చనువుగానుండక సాధింపులు తగునా?

★ **నేఁటనే** – బహిరంగమై ★ **ఒడబాటు** – సమ్మతి

సంఖ్య : 372 సంపుటము : 17 పుట: 215 రాగం : రామక్రియ

**11 ఈ రీతి రాముఁడు కృష్ణుడు యశోద యెదుట నుండి**
**కోరి ముద్దు గునియంగ కొమ్మలు నవ్వేరు ॥పల్లవి॥**

**పానిపట్టి వుమిసెనే పాలలోనగృష్ణుడు**
**నేనా రాము డుమిసెఁ దానే కాక**
**కానఁగానే యింత చేసి కల్లలాడేఁ జూడవే**
**ఆనవెట్టు మనవే తా నది నిజమనుచు ॥ఈరీతి॥**

**సారెఁ బిల్లఁ దీపు లాడి జారిపడెఁ గృష్ణుడు**
**వూరకే గడించ నేల వో యమ్మ తాను**
**వూరివారి నడుగవే వుద్దాండాలు వీనివి**
**యీరీతి నాపై గడించి యిన్నియుఁ దాఁ జేసెను ॥ఈరీతి॥**

**వెంటనే విని సుద్దులు వెళ్లవేతు నటవే**
**వొంటి నన్ను వెఱపించె వుదుటై తాను**
**దంటనై శ్రీవేంకటాద్రి తాను నే నాడితి మమ్ము**
**నింటఁ బొత్తు గలపేవు యిద్దరము వొకటే ॥ఈరీతి॥ 372**

**భావపరిమళం :**

ఉద్దండాలు అంటే "అఘాయిత్యములు" అని అర్థం. ఈ కీర్తనలో పెదతిరుమలయ్య రేపల్లెలో యశోదాదేవి వద్ద పెరిగిన నాటి ఉద్దండాలలో ఒక చిన్న అంశాన్ని వివరిస్తున్నారు. పల్లవినే ఒక ప్రత్యేకతతో మొదలుపెట్టారు. "ఈవిధముగా రాముడు (బలరాముడు) కృష్ణుడు యశోదాదేవి యెదుట కోరి ముద్దులు కుడువగా, అక్కడనున్న కొమ్మలు (గోపికలు) పకపకా నవ్వేరు". అంటున్నారు. పానిపట్టి (పనివేళా) తనకి త్రాగుటకిచ్చిన పాలగిన్నెలో వుమ్మినాడు, కృష్ణుడు కల్లలాడుట నేర్చినాడు అన్నాడు రాముడు. నేనా వుమిసినది, కానేకాదు, అన్న రాముడే వుమిసినాడు అని బొంకినాడు కృష్ణుడు. కానగానే (చూస్తుండంగానే) ఇంతజేసి కల్లలాడే చూడవే అని గోపికలు, యశోదా! వానిని నిజం చెబుతున్నానని ఆనపెట్టమనవే అని అన్నారు. మీకృష్ణుడు తోటిగోపాలయిరతో కలిసి "పిల్లఁదీపులు" అనే ఆటలాడి అందులో జారిపడ్డాడు. ఊరికనే, గడించినందువలన (కల్పించి చెబుతే) మాకేమివస్తుంది? వోయమ్మా! కావలెనంటే వూరివారిని అడుగవే, వీని అఘాయిత్యాలుయెంతటివో వారే చెబుతారు అన్నారు. రాముడు కూడా "ఈరీతి తాను గడించి నాపైన వేస్తున్నాడు" అన్నాడు. దానికి కృష్ణుడు "అమ్మా! అసలు కథ నేను చెబుతాను. నన్ను వొంటరిని, చిన్నపిల్లవాడిని జేసి...తానే వీళ్ళతో నాటకం ఆడుతున్నాడు" అన్నాడు. "శ్రీవేంకటాద్రి మీద తానూ(అన్న) నేనూ ఆడితిమి. మీరు మాకు పొత్తుకలపండి, యెందుకంటే మేమిద్దరమూ వొక్కటే", అంటూ ముగించాడు.

★ **వెళ్ళవేతు** – బయటపెడ్తాను ★ **ఆనవెట్టి** – ఒట్టుపెట్టి





సంఖ్య : 306 సంపుటము : 28 పుట: 207 రాగం : ఆహిరి

**12 అవ్వలిమో మే(మేఁ?)టికే అంతవానితో**
**నవ్వులు నవ్వేటివేళ ననుపులే కాక ॥పల్లవి॥**

**ఆఁటదానికేఁటికే అంతేసి చలములు**
**పేటగా మగవానితో ప్రియమేకాక**
**యీటువెట్టినీకతఁడు యెంత కిందుపడినాను**
**చీటికి మాటికి సేవ సేయవలెఁగాక ॥అవ్వ॥**

**మగువకు నేఁటికే మాసటీని పంతాలు**
**మొగము చూచి సన్నల మొక్కులే కాక**
**జగడము దీర నెంత చనవు నీకిచ్చినాను**
**మిగుల నీ వినయాలే మించవలె గాక ॥అవ్వ॥**

**సతికినింతేఁటికే సరిచేసి బింకాలు**
**యితవైన మనసుల యేకమేకాక**
**వెత దీర నిన్నును శ్రీవేంకటేశుఁ డిదె కూడె**
**మితిలే కిందుకే నీవు మెచ్చవలెఁగాక ॥అవ్వ॥ 306**

**భావపరిమళం :**

ఈ కీర్తనలో అన్నమయ్య దేవి చెలికత్తెయై దేవితో, స్త్రీ చాకచక్యం గూర్చి యేమంటున్నారో ఆస్వాదించండి. దేవీ! అంతవానితో (జగదీశ్వరునితో) నవ్వులు నవ్వేవేళ (సరస సల్లాపములాడవలసినవేళ) ననుపులేకాక (అనురాగములే కాక) చలములు (పంతములు) తగునటమ్మా? అయినా, దేవీ! ఆడుదానికి అంతేసి పట్టుదలలు యెందుకమ్మా? పేటగా (యత్నముతో) మగవానితో ప్రియసంభాషణలు చేయాలి. అ తనెంత నీకు లొంగియుండిననా వీలు దొరికనప్పుడల్లా వినయం చూపి సేవచేస్తుండాలి. అప్పుడే ఆతనిప్రేమను గెలువగలవు. మగువకు స్వార్థపూరిత పంతములు తగవమ్మా. అతగాని మొగములో మొగముపెట్టి సన్నల (చేతి సైగతో) "నీకు మొక్కుతాను నన్ను క్షమించు" అన్నట్లు సైగలు చేయాలి. జగడము సద్దుమణుగుటకు అతడెంత చనువు నీకు ఇచ్చినా, నీ వినయమే గొప్ప ఆయుధము. అణుకువగ వున్న స్త్రీని చూచి కరిగిపోని మగవాడుండడంటే నమ్ము. దేవీ! భార్యకు మగనితో సమానమైన బింకము (గర్వము) ప్రదర్శించరాదమ్మా! హితముగా మనస్సులను కలుపుకోవాలి. ఇంత అయ్యాక కూడా శ్రీవేంకటేశుడు నీ చింత తొలగునట్లు నిన్ను కూడినాడు దానికైనా ఆ స్వామిని అంతులేనట్లు పొగడాలి.

★ **కిందుపడి** – లొంగిపోయి ★ **మాసటీని** – స్వార్థపూరితమైన

సంఖ్య : 76 సంపుటము : 17 పుట: 46 రాగం : ఆహిరి

**13** సాగిన సబలలోన సరివారిలోన నెల్లా
యీగతి మన్నించితివి యీపెదెపో బ్రదుకు ॥పల్లవి॥

చేయివట్టి తీసి యింతిఁ జేరఁ బిలుచుకొంటివి
చాయల నిందరూఁ జూడఁ జాలదా యింత
పాయనిమోహ మెఱఁగి పైఁ జేయి వేసి నేఁడు
యీ యెడ మన్నించితివి యీపెదెపో బ్రదుకు ॥సాగిన॥

వంచిన చెలిశిరసు వడి నెత్తి పలికించి
చంచలించక నవ్వితి చాలదా యింత
కొంచ కాపెగుణములు కొనియాడి కొలువులో
యెంచి మన్నించితి విట్టె యీపెదెపో బ్రదుకు ॥సాగిన॥

చెక్కు నొక్కి నిమ్మపండు చేతి కిచ్చి బుజ్జగించి
చక్క సరస మాడితి చాలదా యింత
దక్కిన శ్రీవేంకటేశ తరుణి కౌఁగిటనే
యెక్కుడు మన్నించితివి యీపెదెపో బ్రదుకు ॥సాగిన॥ **76**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య ఈ సరస శృంగార కీర్తనలో స్వామిని వలచి ఆయన కౌగిటిలో మన్ననలందుకొన్న చిన్నదాని నభినందిస్తూ "ఈపెదెపో బ్రతుకు" అని మెచ్చుకొంటున్నారు. సాగిన (కొనసాగిన) నీ సభలలో సరివారందరిలోను యీవిధముగా ఆమెను మన్నించినావు స్వామీ! ఈమెదేపో బ్రతుకు (జన్మ) అంటున్నారు. ప్రభూ! కావాలని ఆమెను నీవద్దకు జేరపిలిపించుకొంటివి. మసక చీకట్లలో నలుగురు చూడనే చూశారు. ఇది చాలదా? వీడలేని మోహము నెఱిగిపైన జేయి వేసితివి. నేడు ఈ విధముగా ఆమెను మన్నించినావు. ఈమెదేపో భాగ్యమంటే. ఈ చెలి నిన్ను చేరినా, తన శిరస్సును వంచియేయున్నది. నీవు శీఘ్రముగా ఆమె తలను యెత్తి పలకరించితివి. ఏమాత్రమూ చలించకనవ్వితివి. ఇంక ఇది చాలదా స్వామీ? కొంచెక (అంతటితో ఆగక)నిండు సభలో ఆమె సుగుణములను పొగడితివి. ఎంచి ఆమె సుగుణములను మన్నించితివి. ఈమెదేపో భాగ్యమంటే దేవా! నీవు నిమ్మపండును ఆమె చేతికిచ్చి చెక్కిళ్లనునొక్కి బుజ్జగించితివి. చక్కగా సరసమాడితివి. ఇంతచాలదా? ఓ శ్రీవేంకటేశ్వరా! నేడీ తరుణిని నీ బిగికౌగిట మన్నించితివి. ఈమెదేపో భాగ్యమంటే.

★ **చెక్కు** – చెక్కిలి, బుగ్గ ★ **పలికించి** – పలకరించి





సంఖ్య : 305 సంపుటము : 28 పుట: 206 రాగం : పాడి

**14** ఔనే మంచిదాన వౌదువే నీవు
సానఁబట్టి వలపులు జళిపించేవు ॥పల్లవి॥

చెలఁగి యాతఁడు నీకుఁ జెప్పేటి ప్రియాలకా
చలపట్టి దగ్గరకా జంకించేవు
మొలకనవ్వులు నవ్వి ముంచిన మోహానకా
వలవని జాగుతోడ వంచేవు శిరసు ॥ఔనే॥

చిత్తగించి నీమీఁద జేయి వేసినందుకా
కొత్తలుగా నీవు కొనగోరఁజిమ్మేవు
బత్తిసేసె నీకు మంచి బాగా లిచ్చి నందుకా
యెత్తిన మదముతోడ యీసడించేవు ॥ఔనే॥

కుచ్చిపట్టి కాఁగిలించి కూడిన యిందులకా
హెచ్చి శ్రీవేంకటేశ్వరు నెలయించేవు
బచ్చన సరసముల పంతమిచ్చినందుకా
విచ్చనవిడుల నీవు వేసాలు సేసేవు ॥ఔనే॥ **305**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరసశృంగార కీర్తనలో తానే దేవి చెలికత్తెయై యేమంటున్నారో వినండి. ఔనే! నీవు మంచిదానవే. సానబట్టిన వజ్రంలా మెఱిసిపోతున్న కదలికలున్న వలపుల జవరాలివే, కానీ నేను చెప్పేది కూడా వినవమ్మా! దేవీ! ఆయన కొద్దిగా చెలరేగి నీతో శృంగార సంభాషణ ప్రారంభిస్తే నీవు పంతముతో దగ్గర చేరిన అతనిని జంకించేవు (కళ్ళతోనే బెదరించేవు). అదటుంచి నీ మనోహరమైన చిరునవ్వుతో ముంచిన మోహము ముప్పిరిగొనినందుకే, వలవని (సైపలేని) జాగుతో నీ శిరస్సును వంచియున్నావు. నీవలపును చిత్తగించి అతగాడు నీపై చేయి వేసినందుకే నీవు కొత్తగా భావించి అతగానిని నీకొనగోటితో గీరినావు. బత్తిసేసి (గౌరవంతో కూడిన అనురాగంతో) నీకు మంచి భోగము నొసగినందుకే అతిశయించిన మదముతో (గర్వముతో) ఆతడిని ఈసడించేవు (నిర్లక్ష్యం చేశావు). ఇది నీకు తగునా? కుచ్చిపట్టి (గుచ్చి) కౌగిలించి నన్ను కూడినందుకే వో శ్రీవేంకటేశ్వరా! ఆమెను అలరించేవు. రంగురంగుల అనగా నానావర్ణముల వలపు పంతములను చవి చూపినందుకే విచ్చలవిడిగా నీవు ఆమెతో వేసాలు సేసేవు (వేషాలు వేస్తున్నావు) తండ్రీ!

★ **బచ్చన** – రంగురంగుల ★ **ఎత్తిన** – విజృంభించిన

సంఖ్య : 77 సంపుటము : 17 పుట: 47 రాగం : సామంతం

**15 సరుస దిష్ట ములకు సాకి రేలరా**
**మరుతంత్రములలోన మఱుఁగులు గలవా** ॥పల్లవి॥

**యేకతాన ఆకె నిన్ను నిద్దరినేఁ బొడగంటి**
**నాకు చుట్టి యిచ్చె నింతే యని బొంకేవు**
**మేకొని పువ్వులలోన మెదలే తుమ్మెదదా**
**నాకడఁ బరిమళము లంట నంటే నిజమా** ॥సరుస॥

**యీదెస మంచముమీఁద ఇంతి నీకు యాడ దంటే**
**పాద మొత్తేచెలి యంటా బాస సేసేవు**
**పోదితోడ గుంపు మాని పొంత నున్న పూవుఁ దీగె**
**ఆదిగొని కొమ్మ గొమ్మ నలమక వుండునా** ॥సరుస॥

**వురముపైని కొమ్మ వున్న దిది యాడ దంటే**
**గరిమ బంగారులో సింగార మనేవు**
**నిరతి శ్రీవేంకటేశ నీకు భూమిదేవి నేను**
**దొరసితి నిందిరయు తోడు నీకు వలెఁగా** ॥సరుస॥ **77**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరసకీర్తనలో నాయిక యేమంటున్నదో వినండి. ఈ పల్లవిని ఇలా భావించవచ్చును. నీ సమక్షముననే జరిగినపనులకు దృష్టాంతము కావలెనా? ఆ చూడబడినవాటికి సాక్ష్యములు కావలెనా? మన్మథ లీలలు చేసేవారు మఱుగు పాటిస్తారా యేమయ్యా? ఆమెను నిన్ను నేను ఏకతాన (ఏకాంతమున) పొడగంటిని. ఏమీలేదు, 'ఆకు చుట్టి ఇచ్చింది' అని అబద్ధమాడుతున్నావు. పూనుకొని పుష్పములలో మకరందం కోసం మెదిలేతుమ్మెద, ఆ పూలవాసన తనకు అంటిందంటే, ఆ మాట నిజమవుతుందా? ఇవ్వాల్టికివ్వాళ, నీమంచం మీద వున్న వనితని పసిగట్టి అదెవరయ్యా? అంటే కాళ్ళు నొప్పులుగా వుంటే కాళ్ళు పిసికే అమ్మాయి అని బాస చేసి చెప్పావు. అనుకొంటాము గాని, చెట్టుపక్కనుంచి పాకే పూలతీగె చెట్టును చుట్టుకోకుండా వుంటుందా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీ వురము పైననే ఆడదానిని మోస్తున్నావు కదటయ్యా! అదేమిటంటే ఆమె బంగారంలో సింగారం అంటావు. స్వామీ! నేనూ (పద్మావతి), భూదేవీ కాకుండా ఈ ఇందిరాదేవి కూడా తోడుగా కావలెనా? బాగు, బాగు.

★ **మేకొని** – పూనుకొని ★ **ఆదిగొని** – ఆక్రమించి





సంఖ్య : 19 సంపుటము : 28 పుట: 13 రాగం : దేవగాంధారి

**16 తానేల సిగ్గువడీని తనతో నే నేమనేను**
**పూనిపట్టి చెలులాల బుద్ధి చెప్పఁగదరే** ॥పల్లవి॥

**చిప్పిలఁ దానూ నేనుఁ జేసుకొన్న బాసలకు**
**తప్పులెంచ నున్నదా తనపై నేను**
**కుప్పళించి పెంజెమటఁ గురియఁగా నే మొక్కితేను**
**పిప్పిగట్టఁ బెదవులఁ బిలువరే విభుని** ॥తానే॥

**సొగసి ఇద్దరికిని చుట్టరికమైనందుకు**
**తగదని కోపించేదా తనతో నేను**
**నిగిడి నిట్టూర్పులు నిండఁగా నేఁ బెనఁగేను**
**జిగి నన్నునేలుమని సేయరే సేవలు** ॥తానే॥

**బెరసి మేనవారమై పెండ్లాడినయందుకు**
**వొరసి గోరగీరేనా వొళ్ళిపై నేను**
**ఇరవై శ్రీవేంకటేశు నిన్నిటా నేఁ బొగడేను**
**నిరతపు మన్ననలు నించుమనఁగదరే** ॥తానే॥ **19**

**భావపరిమళం :**

చెలికత్తెయైన అన్నమయ్యతో దేవి యేమంటున్నదో వినండి. తనతో (స్వామితో) నేనేమన్నాను? తానేల సిగ్గుపడుచున్నాడు? ఓ చెలులారా! మీరైనా తనకు బుద్ధి (హితవు) చెప్పకూడదా? మీరే వినండి. చెలీ! తానూ (స్వామి) నేనూ (దేవి) చేసికొనిన బాసలలో తప్పులెంచుటకు యేమైనా వున్నదా? నేను విపరీతముగా చెమటలు కుప్పలు తెప్పలుగా కారిపోతున్నా అతగానికి మొక్కినాను. ఇకనైనా గొంతు తడిఆరునట్లు నా విభుని, పెదవులు విప్పి పిలువండే.మా ఇరువురకు చుట్టరికము కలిసినందున, తన ప్రవర్తన ఇట్లుండతగదని నేను తనతో కోపించితినా? ఇనుమడించుచున్న నిట్టూర్పులతో ఆతనితో వివాదములాడితినా? శోభాయమానముగా నన్నేలుకోమని తగిన విధముగా సేవలు చేసి నచ్చజెప్పరే! చేరువయై, తన ఒంటిపై మేనబావే కదా! అని నేను నా గోటితో నఖక్షతములు సేసితినా? తాను అతిశయించిన శ్రీ వేంకటేశ్వరుడని నేనెంత పొగిడాను (కీర్తించాను). కనీసం అందుకైనా నిరతపు (ఆసక్తి అతిశయించగా) నన్ను మన్నించమనరే!

★ **పిప్పిగట్టి** – తడిఆరిపోవునట్లు ★ **బెరసి** – చేరి

సంఖ్య : 305 సంపుటము : 17 పుట: 177 రాగం : ముఖారి

**17 చెలియ ప్రాణనాథ నాకుఁ జెప్ప నేమి మాపుదాఁక**
**తలఁపుఁ దలఁపు నేకమాయి తమక మింక నీదె పో** ॥పల్లవి॥

**ఆయ మెఱింగి మాటలాడి అతివమనము గరఁచె**
**కాయ మంటి కళలు రేఁచుకడమ నీదే పో**
**చాయ చూపి చనవు లిచ్చి సరవు లెల్ల నీకు నడపె**
**చేయి చాఁచి కౌగిలించుచేఁత యింక నీదె పో** ॥చెలియ॥

**వేళెఱింగి నవ్వు నవ్వి వెలఁది నిన్ను మరుగఁ జేసె**
**తాలి మలరఁ జెక్కు నొక్కు తగవు నీదె పో**
**కేలు గేలఁ గీలుకొలిపి కెరలి యాకె ప్రియము చెప్పె**
**మేలు చూచి యా గుణములు మెచ్చవలయు నీవె పో** ॥చెలియ॥

**చవి యెఱింగి సరసమాడి సకియ నీదుమీ దఁనొరగె**
**యివల రతులఁ దనుపవలయునెఱుక నీదె పో**
**జవళి శ్రీవేంకటేశ సరుగ నాపె నిన్నుఁ గూడె**
**తివిరి యాకెయలపు దీర్చుతెలివి యెల్ల నీదె పో** ॥చెలియ॥ **305**

**భావపరిమళం :**

ఇది అతి చక్కని సరస శృంగార కీర్తన. పెదతిరుమలయ్య శృంగార కీర్తనలలో అన్వయించే తీరును బట్టి ఒక్కొక్కప్పుడు భావమే మారిపోతుంది. ఈ వివరణ నా స్ఫురణ. నివారణ లేనేలేదు. ఓ ప్రాణనాథా! చెలియనాకు జెప్పెను. మాపుదాకా యేమి చెప్పిందో తెలుసా? మన తలపులు యేకమైనవిట. ఇంక తమకమంతా నీదె (స్వామిదే) పో అన్నది. ప్రభూ! నీమర్మమెరిగి మాటలాడి, ఆ అతివ నీ మనస్సు కరిగేటట్లు చేసినది. ఆమె దేహమును తాకి మదన కళలను చెలరేగజేసే నేర్పు నీదేపో! ఆమె నీవన్నెలు చూసి, అనురాగమునిచ్చి, నీకు క్షమతో వలపు నడిపినది. ఆపైన చేయిచాచి ఆమెను కౌగలించు చేతఅంతా ఇక నీదేపో! దేవా! సమయము చూసి, ఆ వెలది చిరునవ్వు నవ్వి నిను ప్రేమాతిరేకమున, మరుగ జేసినది. మరి నీవు తక్కువవాడవా? ధైర్యము ముప్పిరిగొనగా ఆమె చెక్కిలి నొక్కి తగవు (యుక్తత) చూపినావు. మరి ఆ నేర్పు నీదేపో! ఆమె నీ చేతితో చేయి కలిపి అతిశయించి నీకు ప్రియవచనములను చెప్పినది.ఇది మేలుగా భావించి ఆమె సుగుణములను మెచ్చినావు. మరి ఆ సుగుణము నీదేపో! స్వామీ! నీ అభిరుచి తెలిసిన ఆ సకియ (దేవి) నీతో సరసమాడి సుతారముగా నీపై వొఱిగినది. ఇక ఆమెను సురతముల దేల్చి అలరించు నేర్పు నీదేపో! సుస్థిరుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీతో జంటయై ఆ దేవి నిన్ను గూడినది. అటుపైన ఆమె అలపునంతా తీర్చి అలరించే తెలివి నీదే పో!

★ **కెరలి** – అతిశయించి ★ **తాలిమి** – క్షమ





సంఖ్య : 20 సంపుటము : 28 పుట: 13 రాగం : భూపాళం

**18 ఏమేమి నేర్పెనో యీరమణి నీకును**
**వేమరు నాకె బుద్దుల వెలసేవు నీవు** ॥పల్లవి॥

**నెట్టన నిందాఁకా నాతో నిజములు పచరించి**
**ముట్టివచ్చితే నాపె మోము చూచేవు**
**గట్టిగా నేర్చుకొనింకాఁ గొన్ని గలిగితే**
**అట్టె మరఁగునఁ బోఇ అడుగఁగరాదా** ॥ఏమే॥

**జోకగా నప్పటనుండి చుట్టరికములే చూపి**
**దీకొంటే నాపెఁ దోడుదెచ్చుకొనేవు**
**మేకొని యాపె బలిమి మెరఇంచవలసితే**
**యేకతాన నుండి సాము లెరుఁగు కోరాదా** ॥ఏమే॥

**అంకెల నీవివి (నీవి?)ప్పు డిట్టె ఆసతోడ నన్నుఁగూడి**
**జంకించితే నీ వాపెకు సన్నసేసేవు**
**ఇంకా శ్రీవేంకటేశ నేఁ డీఁడు చూపవలసితే**
**కొంకక నీయింట నిడుకొని వుండరాదా** ॥ఏమే॥ **20**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస కీర్తన ఆనాటి వ్యావహారిక తెలుగు పదాలతో క్లిష్టమైనదిగా వున్నది.నేటి తెలుగులో దీనిని వివరించటం ఇబ్బందే. నా ప్రయత్నం నేను చేస్తాను. ఈ రమణి నీకు యేమేమి నేర్పినదో కాని, నీవు మాత్రం అన్నీ ఆమె బుద్ధులనే పుణికి పుచ్చుకొన్నావు. కాదంటే నేను చెప్పేది విను. ఇందాక, నాతో అంతా నిజమే చెబుతానని, ముట్టి చెప్పావు. ఇప్పుడు ఆమె మొగముకేసి చూస్తున్నావు. ఇంకా నేర్చుకొని బొంకాలనుకొంటే... ఆమెతో పాటు, కాస్త మరుగునకు బోయి అడిగినేర్చుకోరాదా? అప్పటినుండీ మీ చుట్టరికాన్ని బాగానే యేకరువు పెడుతున్నావు. కావలెనంటే పూనుకొని ఆవిడగారిని నీతోడుగా తెచ్చుకోరాదా? మేకొని (పెద్దరికం చూపి) ఆమె బలిమి నాకు యెఱుక జెప్పాలనుకొంటే మీ యేకాంతంలో ఆమె సాహసాలు చెప్పించుకోరాదా? ఏదేమైనా, ఇప్పుడు నాకు సులభముగా స్వాధీనుడవై ఆశతో నన్ను కూడినావు. నేను నిన్నుగట్టిగా అడిగితే ఆమెకేదో సైగ చేస్తున్నావు. ఓ శ్రీవేంకటేశా! మీది అనాది జంట అని నాకూ తెలుసు. జంకక ఆమెను నీ ఇంటనే వుంచుకోరాదా?

★ **సాము** – సాహసము ★ **వెలసేవు** – అతిశయించేవు

సంఖ్య : 304 సంపుటము : 17 పుట: 176 రాగం : ముఖారి

**19 పట్టరైరి గా మిమ్ము బడఁతులు వద్దనుండే**
**వొట్టి చేముట్టి సరసా లొద్దంటిఁగా** ॥పల్లవి॥

**పువ్వులచెండున వేసి పుప్పొడివాయల బడ**
**నొవ్వి బడే వేలే కన్నుల దిట్టుతా**
**అవ్వలివ్వలిమోములై యలిగితి రిద్దరు**
**నవ్వి నవ్వి జగడాలు నడుమనే వచ్చె గా** ॥పట్ట॥

**పక్కన నాతని నాడి పతి మాటాడించుకొని**
**చెక్కుచేతిచింత లేలే సిగ్గుపడుతా**
**మక్కళంపు మంకులలో మాటలాడరిద్దరును**
**వొక్కటై యుండుండి మీకు మెరటులు వచ్చె గా** ॥పట్ట॥

**కుచ్చి కొనగొంగు వట్టికొప్పు జాఱ ది య్యంచుక**
**పచ్చిగా గోపించే వేలే పగ చాటుతా**
**యిచ్చకు డై శ్రీవేంకటేశు డిట్టే నిన్ను గూడె**
**మచ్చరము లిందా కా మానకుండె గా** ॥పట్ట॥**304**

**భావపరిమళం :**

క్లిష్టమైన శృంగారకీర్తనలు చెప్పటంలో తండ్రికి తగ్గ కొడుకు పెదతిరుమలయ్య. ఈ పల్లవి, నా భావనకు తట్టినది ఈ విధంగా. ఓ దంపతులారా! మిమ్మల్ని పడతులు పట్టలేకున్నారు. మీరెంత, దేవీ వేంకటేశ్వరులైనా మీకు చేముట్టి సరసాలు (మోటుసరసాలు) వొద్దంటి గా (తగదని అన్నాము కదా!) ఇంత చనవు పనికిరాదు. దేవీ! ఆయన పూలచెండుతో వేసినందున ఆ పుప్పొడి బాగా పడి నీకు నొప్పి కలిగినది. దానికే నీవాయనను నీ కన్నులతోనే తిట్టితివి. దానికే మీరిద్దరూ అవ్వలివ్వలి మోములై (యెడమొగము పెడమొగమై) అలిగినారు. ఇప్పటిదాకా నవ్వి నవ్వివున్నవారికి, నడుమ ఈ పోట్లాట వచ్చింది కదా! దేవీ! నీ పక్కనే వున్న ఆయనతో (పతితో) కావాలని మాట్లాడించుకొంటివి. మరి ఇంకా చెక్కిలిపై చేయిజేర్చి అంత ఆలోచన యెందుకమ్మా? మీ ఇద్దరూ సరితూగే మంకుతనముతో పరస్పరం మాటలాడుట మానివేసినారు.ఇప్పటిదాకా వొక్కటిగానే వుండి, ఇప్పుడు వుండుండి మీకు ఈ ఒరటులేల (దుష్ప్రవర్తన యెందుకమ్మా?) దేవీ! అతగాడు నీ కొనకొంగు పట్టి లాగునంతలో నీ కొప్పు జాటిపోయినది. దానికే పగ చాటుతూ నీవు కోపించవలెనా? నీపై కోర్కెగలవాడై శ్రీవేంకటేశుడు నిన్నిట్టే కూడినాడు. నీ మాత్సర్యము నింతదనుక మానకపోవుట నీకు తగునా?

★ **మక్కళంపు** – సరితూగె ★ **పచ్చిగా** – బహిరంగంగా





సంఖ్య : 18 సంపుటము : 28 పుట: 13 రాగం : దేశి

**20 ఏల సేసేవు మాయలు యెందాఁకానైనాను**
**చాలుఁ జాలు నాపె కిట్టె చనవియ్యరాదా** ॥పల్లవి॥

**చేరఁడేసి కన్నులాపె చేరి నిన్నుఁ జూడఁగాను**
**దారకపు నీచేఁతలు దాఁచఁగలవా**
**గోరగీరి వలపులయేరులు పైఁబరపఁగా**
**ఆరితేరే నీమనసు అడ్డపెట్టఁగలవా** ॥ఏల॥

**తీవెలవంటి చేతులవెఱవ నిన్నంటఁగాను**
**ఆవలికి నీకోరికె లంపఁగలవా**
**మోవి తీపు నాములెల్లా ముంచి తలకెక్కఁగాను**
**కావరపు నీమరులు కడు దించఁగలవా** ॥ఏల॥

**కొండలంతలు చన్నులకొమ్మ నిన్నుఁ గూడఁగాను**
**అండ శ్రీవేంకటేశ పాయఁగఁగలవా**
**దండి వేడుకల సంపదలు మీఁదఁ గప్పఁగాను**
**మెండైన పరవశాలు మీరఁగఁ గలవా** ॥ఏల॥**18**

**భావపరిమళం :**

ఈ కీర్తనలో అన్నమయ్య తానే నాయిక చెలికత్తెయై స్వామి వారితో యెలా వాపోతున్నారో ఆలకించండి. ప్రభూ! ఆమెతో మాయలు యెందుకు చేస్తున్నావు? ఇలా యెందాకా చేస్తావు? చాలు చాలునయ్యా! ఆమెకు త్వరగా నీ అనురాగము నీయరాదా? మా దేవికి చారడేసి కన్నులున్నవి. ఆమె నిన్ను చూస్తుండగానే ఈ నీ చిలిపి చేతలను నీవు దాచగలవా? తన గోటితో గీరి ఆమె వలపుల యేరులను నీపై ప్రవహింపజేయగా వలపు చేతలనారితేరిన నీ మనస్సుతో ఆమెకు అడ్డుకట్ట వేయగలవా? దేవా! లతలవంటి తన సుకుమారమైన చేతులతో నిన్ను మాదేవి చుట్టివేయగా, చెలరేగే నీ కోరికలను అంపగలవా (బయటకు తోలగలవా?) ఆమె మధురాధరముల తీయందనము అధికముగా నీ తలకెక్కగా గర్వంతో అతిశయించిన నీ వలపులను దించ (తగ్గించుకో) గలవా? స్వామీ! కొండల బోలిన కుచ గిరులున్న జవ్వని నిన్ను గూడినది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇక నీవామె అండను విడనాడగలవా? అధికమైన వేడుకలనే సంపదలు పైకొనగా, అధికమైన పారవశ్యమును అధిగమించగలవా?

★ **కావరపు** – గర్వపు ★ **దారకపుచేత** – పిల్లచేష్టలు లేక చిలిపి చేష్టలు

సంఖ్య : 303 సంపుటము : 17 పుట: 176 రాగం : మలహరి

**21 ఆయ లేరే యేమి చెప్పే రాతనిసుద్దులు నాకు**
**తాయి మక్కళాలే కాక దయ గద్దా తనకు ॥పల్లవి॥**

**కన్నులఁజూడనే పట్టె కాఁకలు సేయనే పట్టె**
**యిన్నిటా తా నన్నుఁ గూడే దెప్పుడో కాని**
**సన్నలు సేయనే పట్టె చవులు చూపనే పట్టె**
**వెన్నెల బాయిటికి రా వేళ లేదు తనకు ॥ఆయ॥**

**నవ్వులు నవ్వనే పట్టె నాలి సేయనే పట్టె**
**యివ్వల నన్నుఁ గూడేది యెన్నఁడే తాను**
**పువ్వుల వేయనే పట్టె బుజ్జగించనే పట్టె**
**పవ్వళంచఁ బొద్దు లేదు పను లే లే తనకు ॥ఆయ॥**

**మాటలాడనే పట్టె మనసు చూడనే పట్టె**
**యీటునఁ గాలు దొక్కేది యెన్నఁడే తాను**
**పాటించి శ్రీవేంకటాద్రిపతి నన్ను నురముపై**
**తేటలుగా నెక్కించుక దించ నెడ లేదు ॥ఆయ॥ 303**

**భావపరిమళం :**

దేవి అలమేల్మంగతో ఆమె చెలికత్తె ఈ కీర్తన చెబుతున్నది. పెదతిరుమలయ్యయే ఆ చెలికత్తె. ఆయలేరే (మర్మములెందుకే) ఆతని కథలను నాకు ఇంకా యేమి చెబుతారు – అంటున్నది దేవి. తాయి మక్కళాలే కాక (నాతో దాగుడు మూతలు కాక) తనకు నామీద కొంచెమైనా దయలేదా యేమే? 'పట్టె' అనేపదాన్ని "సరిపోయింది" అనే అర్థంలో ప్రయోగించారు. "కన్ను జూడనేపట్టె" అంటే కన్నులతో చూడటంతోనే సరిపోయింది, తాపము పెంచటంతోనే సరిపోయింది, ఇక ఆయనగారు నన్ను కూడేదెప్పుడో? ఆతడు నాకు సైగలు చేయటంతోనే సరిపోయింది, ఆసక్తి పెంచనే పట్టె, ఇక తనకు నాతో వెన్నెలలో విహరించేవేళ మాత్రం లేనేలేదు. అతగానికి చిరునవ్వులు నవ్వడంతోనే సరిపోయింది, నాలి (పరిహాసం) సేయుటతోనే సరిపోయింది. ఇక తాను నన్ను కూడేదెన్నడో మరి? నామీద చిలిపిగా పూవులు జల్లుటతోనే సరిపోయింది. నన్ను బుజ్జగించుటతోనే సరిపోయింది. నాతో పడక జేరే సమయమే లేని పనులెందుకే తనకు? స్వామికి నాతో మాటలాడుటతోనే సరిపోయింది. నా మనసు తెలుసుకోవడంతోనే సరిపోయింది. ఇకనన్ను తాను కాలుదొక్కేదెన్నడే (పరిణయమాడేదెన్నడే?) ఇక ఆదరించి శ్రీవేంకటాద్రిపతి నన్ను వురముపై ప్రసన్నుడై యెక్కించుకొన్నవానికి దించి కూడే సమయమే లేదు.

★ **తేటలుగా** – ప్రసన్నుడై ★ **పాటించి** – ఆదరించి





సంఖ్య : 155 సంపుటము : 28 పుట: 105 రాగం : ముఖారి

**22 ఇచ్చితిమి కానుక యింతక తొలుతే నీకు**
**తచ్చేము మా సిగ్గు దగ్గరిరావయ్యా ॥పల్లవి॥**

**పంతము లేమీనాడరు పడఁతులయినవారు**
**చింతలనే వలపించి చిక్కింతురు**
**అంత నేరుపరివైతే అందుకేమి దోసమా**
**దొంతినున్నది మా గుట్టు దోసిలొగ్గవయ్యా ॥ఇచ్చి॥**

**యెగసక్కెము సేయరు ఇంతులైన యట్టివారు**
**తగులాయములు చూపి దక్కఁ గొందురు**
**నగ నీవు దొరకొంటే నాకు నీకు దోసమా**
**చిగిరించె మాకోరికె చేఇ చాఁచవయ్యా ॥ఇచ్చి॥**

**కక్కసించి పెనఁగరు కాంతలయినవారు**
**గక్కనఁ గెమ్మోవి ఇచ్చి కాఁగిలింతురు**
**యెక్కువ శ్రీ వేంకటేశ ఇటు నన్నుఁ గలసితి**
**పిక్కటిల్లె మా చన్నులు బిగిఇంచవయ్యా ॥ఇచ్చి॥ 155**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేవి తన రమణునితో యేమంటున్నదో వినండి. స్వామీ! నీకు ఇంతకు తొలుతే (ఆదిలోనే) సానబట్టిన మా సిగ్గులను మా ప్రేమ కానుకగా నొసగితిమి. మాకు దగ్గరివాడవై వాటిని వలపుతో గైకొనవయ్యా! స్వామీ! పడతులనువారు దిగులుగావున్న తమ ప్రియులను వలపించి వారి అనురాగ బంధములో చిక్కింతురుగాని, పంతములేమీనాడరు. అంత నేర్పరివైతే అందులో దోసమేమున్నది. వరుసగానున్న మా రహస్యములను మఱచిపోరాదా? ప్రభూ! ఇంతులైనవారు ప్రయులతో వేళాకోళము లాడరు. తమ ప్రేమ తమ అంతరంగము తెలిపి సానుకూలురను చేసికొందురు. నీ నవ్వుతో నన్ను వవపరచుకొంటే అదినాకు నీకు దోసమా? చిగురించిన మా కోర్కెలకు నీవు చేయిచాచవయ్యా (స్వీకరించవయ్యా!). మేము అబలలము. దేవా! కాంతలయినవారు బాధ కలుగునట్లు పోట్లాడరు. శీఘ్రముగా అరునాధరమునొసగి కౌగలింతురు. అధికుడవైన శ్రీవేంకటేశ్వరా! ఇట్లు నన్ను గలసితివి విజృంభించిన మా కుచగిరులను నీకరముల బిగియించవలయ్యా

★ **కక్కసించి** – బాధించి ★ **దొంతినున్న** – వరుసగానున్న

సంఖ్య : 48 సంపుటము : 10-2 పుట: 28 రాగం : కేదారగౌళ

**23 ఎందరి దూరె యెవ్వరి వేఁడె యెంతని వేగించేనె**
**పొందు దలఁచుక వచ్చెనా వానిచే పుణ్యమింతే కాక ॥పల్లవి॥**

**పుక్కిలిబంటి కాఁకలలోనె పొద్దువోవు టెట్లే**
**యెక్కువైన నా మోహము చెలులూ నెరఁగ రేమందునే**
**వొక్కనిమిషము వానిఁ బాసి నే వోరువఁ గల నటే**
**మొక్కలీఁడయిన మరునమ్ములకు మొకమోట గలదా ॥ఎంద॥**

**తలమునుకల విరహము నే ధరియించు టెట్లే**
**వల పెరిఁగియు సకులు మీరైన వానిఁ దే రేమందునే**
**అలిగినవానిఁ బాసి నిమిషము ఆఁపఁ గల నటవే**
**దళమై కప్పెటి పూవుటమ్ములకు దయగల దటవే ॥ఎంద॥**

**ఇట్టె యీఁదరాని తమకముననె యీడేరేదెట్లే**
**వొట్టిన నా కాఁక లెరిఁ గింతు లూరకున్నా రేమందునే**
**నెట్టన శ్రీవెంకటనాథుఁడు నేఁడు నన్నుఁ గూడెనే**
**గట్టిగనాయింట కాఁపుర మున్నాఁడు కడమలున్నవటే.॥ఎంద॥ 48**

**భావపరిమళం :**

తాళ్ళపాక చినతిరుమలాచార్యులవారు చెప్పిన సరస శృంగార కీర్తననిప్పుడు ఆస్వాదిద్దాం. తన తాత అన్నమయ్య సంరక్షణలో పెరిగిన చినతిరుమల, వారి కవితా శైలిని జీర్ణింపజేసికొని, వేంకటేశ మకుటంతోనే కీర్తనలు చెప్పాడు. చెలికత్తెతో, దేవి అలమేల్మంగ యేమంటున్నదో వినండి. చెలీ! యెందరిని నిందితును? యెవ్వరిని వేడెదను? యెంత వేదన కలిగించాడే? మా పొందులు తలపోసి వచ్చినచో పుణ్యమంతా స్వామిదేనే. చెలీ! నిలువెల్లా మదనతాపముతో పొద్దు గడుచుటెట్లే? ఎక్కువైన నా మోహమును చెలియలైనా గుర్తించకున్నారు, యేమందునే? ఒక్క నిముషమైనా వానిని విడచి నేనుండగలనటే? స్వార్థపరుడైన మన్మథుని అమ్ములకు మొగమాటమేలేదుకదే! సఖీ! తలమునకలైపోతున్న విరహమును భరించుటెట్లే? నా వలపు నెఱిగిన నా స్నేహితురాండ్రైన మీరైనా వానిని తెచ్చుటలేదు. నేనేమందునే? హరి అలిగెనో, అట్టైన వానిని వీడి నేనుండలేనే. తన బలగంతో దండెత్తుతున్న పూవుటమ్ముల వానికి (మన్మథునికి) దయ అనేదుంటుందటనే? చెలీ! సులభముగా ఈదలేని ఈ తత్తరపాటునుంచి కడతేరుటెట్లే? చుట్టుముట్టిన నా తాపమునెరిగిన మీరు వూరకున్నారే, నేనేమందునే. ఎట్టెదుటకు వచ్చి శ్రీవేంకటనాథుడు నన్ను గూడినాడు. అతగాడు నా ఇంటనే కాపురమున్నాడు. ఇక నాకు కొఱతేమున్నదే?

★ **మొక్కలీడు** – స్వార్థపరుడు ★ **తమకము** – తత్తరపాటు





సంఖ్య : 244 సంపుటము : 28 పుట: 165 రాగం : దేసాళం

**24 అపుడే లోనైతి నీతో నడ్డమాడేనా! నీ--**
**రపమాయ మమ్ము నిఁక రవ్వసేయనేఁటికి ॥పల్లవి॥**

**మనసొక్కటైతేఁ జాలు మాట లెట్టున్నా నేమి**
**కొనమొదలేల దిద్దుకొనేవు నీవు**
**పెనఁగి చూచితి నీతో ప్రియము చెప్పిఁ జూచితి**
**వెనకటి సుద్దులకు వేఁడుకొన నేఁటికి ॥అపు॥**

**ప్రియముగలిగితేఁ జాలు బిరుదులాడితే నేమి**
**క్రియెఱిఁగి ఇఁకనేల కిందుపడేవు**
**దయతోడ నుండితి నీదంటతనాన నుండితి**
**నియతపు నీసత్యాలు నెరపఁగ నేఁటికి ॥అపు॥**

**కూటమి గలితేఁ జాలు కొసరితేఁ దప్పేమి**
**మూటగట్టి మాకునేల మొక్కేవు నీవు**
**గాటపు శ్రీవేంకటేశ కలసితి మెలసితి**
**పాటించి నీ బాసలు పచరించనేఁటికి ॥అపు॥ 244**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో నాయిక స్వామితో యేమంటున్నదో వినండి. స్వామీ! నీతో నేను అప్పుడే ఒడబడితిని. నీకు నేను అడ్డు చెప్పెదనా? నీరసించి వున్న మమ్ము మరింత రట్టుసేయ (అల్లరిపెట్టుట) యెందులకు? ప్రభూ! మనసులొక్కటైతే చాలు మాటలెట్లున్ననేమి? నీవు పూర్తిగా మారిపోనవసరమేమి? నీతో పోట్లాడి చూచాను. వలపుతో చెప్పి చూచాను. నీ వెనుకటి "కథ"లకు నేడు తూలనాడి లాభమేమి? దేవా! నీకు ప్రియము గలిగితే చాలు, నీవు ప్రతిజ్ఞలు సేయనక్కరలేదు. కర్తవ్యం తెలిసిన వానికి క్రిందమీద అవటం దేనికి? నీమీద దయతో వుండి చూచాను. దిట్టతనముతో వుండి కూడా చూచాను. ఇప్పుడు నీవు నియమంతో సత్యప్రమాణాలు చేసినందువలన వొరిగేదేమిటి నాకు? స్వామీ! నీతో యెట్టైనా కూటమికలిగితే చాలు నీవు కసురుకొన్నా తప్పేమిటి? సొగసుగా నీవు మాకు యేలమొక్కేవయ్యా? ఓ శ్రీవేంకటేశ్వరా! నాతో కలిసి మెలసివున్నావు. అదే చాలు ఇంకా నీ బాసలను పాటించి తీర్చుట దేనికిలే!

★ **మూటగట్టి** – సొగసుగా ★ **నీరపము** – నీరసము (అని నా భావన)

సంఖ్య : 49 సంపుటము : 10-2 పుట: 28 రాగం : పాడి

**25 ఆతనినె దూరరమ్మ అలుగ కుండిన నాఁడు**
**యీతల నాతల నివి యితవుగా కుండెనా** ॥పల్లవి॥

**పున్నమచందురుఁడు దప్పులురేఁచఁ బగవాఁడ**
**ఇన్నిటా నా విభుఁడె గురింతె కాక**
**సన్నపుఁ జల్లనిగాలి జాలి రేఁచఁ బగవాఁడ**
**మన్నమగఁడు సేసిన మతకము గాక** ॥ఆతనినె॥

**కమ్మని పువ్వులు మేను కాఁడిపార సూడు గద్దా**
**చిమ్ముల నా రమణుని చేఁతలె కాక**
**దొమ్మిసేసి తుమ్మిదలు తొలియాడ వైరులా**
**నమ్మించి బాస దప్పిననాథుఁ డింతె కాక** ॥ఆతనినె॥

**ముప్పిరి మరుఁడు కాఁక ముంచఁగ దోసమువాఁడ**
**యెప్పుడు నీచేఁతలు ప్రాణేశువెకాక**
**కప్పుచు నన్నును శ్రీవేంకటనాథుఁడు గూడె**
**అప్ప టప్పటిచేఁతలు ఆతనివె కాక.** ॥ఆతనినె॥ **49**

**భావపరిమళం :**

ఇది చినతిరుమలయ్య చెప్పిన క్లిష్టమైన శృంగార కీర్తన. కొన్ని పదాలు వాడుకలో లేనందువల్ల నిఘంటువులలో కానరానందున దీని వివరణ కొండొకచో, నా స్ఫురణయే. ఓ చెలులారా! అలుగకుండా వున్ననాడు అతగానినే తప్పు పట్టండి. అప్పుడప్పుడు నిందలు కూడా హితమైనవిగానే అనిపిస్తుంటాయేమో! పున్నమి చందురుడందరికీ ఆనందకరుడే. కాని తప్పు లెంచి చూసే నాబోటి విరహిణులకు మాత్రం పగవాడే.అన్నివిధాలా నా విభుడు కూడా అంతేనే, సన్నగా వీస్తున్న చల్లగాలి అందరికీ హాయిగా వుంటే నాకు జాలి (ఖేదము) కలిగిస్తున్నది. ఇది నా ప్రాణనాథుడు చేసిన మాయవలెనే వున్నది. కమ్మని సువాసనలు వెదజల్లే పూవులు నా శరీరాన్ని గర్వంతో ఈర్ష్యపాలుజేస్తున్నవి. దీనికి తోడు నా రమణుని చేతలుకూడా అలాగే వున్నాయి. నాపై తుమ్మెదలు దాడిచేసి మొదటిలోనే నాకు శత్రువులైనవి. నమ్మించి బాస తప్పిన నామగడు కూడా తుమ్మెదలవంటివాడే. దాడిచేసే మన్మథుడు తాపముపెంచే దోషము మూటగట్టుకొంటూనే వున్నాడు. ఎప్పుడైన యీచేతలు నా ప్రాణనాథునివేకాక వొరులవికానేరవు. ఇప్పుడు నన్ను శ్రీవేంకటేశుడు ఆక్రమించికూడెను. అప్పటికప్పుడు అట్టి చిలిపిసేతలు తానుకాక వొరులెవ్వరు సేయగలరు?

★ **దొమ్మిసేసి** - దాడిచేసి ★ **మన్నమగడు** - ప్రాణనాథుడు



హరి సేవకే వేంకటేశ మకుటం

సంఖ్య : 60 సంపుటము : 17 పుట: 37 రాగం : కేదారగౌళ

**26 ఎంత లేదు తలపోఁత యెంచి చూడ నెవ్వరికి**
**యింతటే నీసతి ననే దిది చాలదా** ॥పల్లవి॥

**చూపుల దవ్వుల నిన్నుఁ జూచితేనే నవ్వితివి**
**యీపాటికీపాటి యింత చాలదా**
**వోపి కొండశిలవలె నో యంటే నో యంటివి**
**ఆ పలుకు కీ పలుకు అంత చాలదా** ॥ఎంత॥

**సోవలఁ దాపపు నన్నుఁ జూడఁ జెలి నంపితివి**
**యీవాడ కావాడ యింత చాలదా**
**నీవు వీది నుండఁగాను నిక్కి నిన్నుఁ జూచితేనే**
**ఆవలిమో మీవ లైతి వంత చాలదా** ॥ఎంత॥

**ప్రేమము నీవే యెఱిఁగి పిలిచి నన్నుఁ గూడితి**
**వీ మేలు కా మేలు యింత చాలదా**
**నేమపు శ్రీవేంకటేశ నీ రతియు నా రతియు**
**ఆమనిపై నామ నాయనంత చాలదా** ॥ఎంత॥ **60**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ శృంగారకీర్తనలో మధురభక్తి పారవశ్యత దేవికెంతవున్నదో అద్దం పట్టి చూపుతున్నది. “తరచి చూస్తే స్వామినొక్కసారి చూచినవారు ఆయన తలపోతలలో మునిగిపోక తప్పదు. ఎవ్వరికైన ఇది తప్పదు. కోటానుకోట్లు ఆయనే కావాలనుకొంటుంటే ఆయన కోసం నిరీక్షణ తప్పదు.ఇంత సందోహంలోనూ నీ భార్యననే తృప్తి అసామాన్యమైనది. అది చాలదా ప్రభూ! అంటున్నారు. నామధురానుభూతులు అనంతములు. నీవు నన్ను చేరవచ్చేటప్పుడు, దూరంనుండే నిన్నుచూడగానే నీవు నవ్వితివి. ఇప్పటికిప్పుడు ఇది చాలదా ప్రియా? కొండ శిలలు కదలవు కాని దూరము నుంచే మనము ‘వో’అని యెలుగెత్తి అంటే అవీ ‘వో’ యని అంటాయి. నీవూ నన్నుచూచి“వో” అన్నావు. నాకీ జన్మకది చాలదా ప్రభూ? ఎదురుగా నిన్నుజేర వచ్చుచున్న నన్ను చూచి జాగ్రత్తగా నన్నుతోడ్కొని రమ్మని నీ చెలికత్తెను పంపితివి. నేనుండే యీ వాడకు నీవుండే ఆవాడకు యేమిదూరమున్నది? కాని నీవు నా కోసం చూపిన శ్రద్ధ మరువరానిది, ఈ జన్మకది చాలదా? ప్రభూ! నీవు ఇంకా వీధి మలుపులో వుండగానే నిక్కి నిక్కి నేను నిన్ను చూచితే అటువైపు తిప్పివున్ననీ మోము ఇటుతిప్పితివి. ఆ నీ చూపు చాలదా నాకు?నీవే నా అనురాగమును గ్రహించి నన్ను పిలిచి మరీ కూడితివి. ఈ మేలుకామేలు నా భాగ్యమే. ఇంత చాలదా, ప్రభూ! నియమముగల వోశ్రీవేంకటేశ్వరా! నీరతియు నారతియు అతిశయించి ఆమనిపై ఆమని వచ్చినట్లయినది. నాజన్మకది చాలదా ప్రభూ!

★ **నేమపు** - నియమముగల ★ **సోవల** - ఎదురుగా

సంఖ్య : 50 సంపుటము : 10-2 పుట: 29 రాగం : బౌళి

**27 నీవేమి సేతు వాపె నిన్నుఁ బెరరేఁచఁగాను**
**తావుల సాకిరి గోరఁ దగదా నిన్నును** ॥పల్లవి॥

**పోరాడే వాపెకుఁగా పూనుక నీవు రాఁగా**
**మేరతోఁ జుట్టా లెల్లా మెచ్చుకుండేరా**
**సారె సారెఁ బిరిదూరి సాకిరులు చెప్పఁగాను**
**తీరిచేటి చెలు లెల్ల దీవించకుందురా** ॥నీవేమి॥

**కన్నుగీఁ టాపెకు నాకుఁ గైలాటాలు వెట్టఁగాను**
**కన్న విన్నవారెల్లాఁబొగడకుండేరా**
**మన్నించి యాపెకు నీవు మాఁట లందియియ్యఁగాను**
**సన్నలవాడవా రెల్లా సంతసించకుందురా** ॥నీవేమి॥

**సందడి జగడాలలో సారె నన్నుఁ బట్టఁగాను**
**అందరును నిన్నె మే లనకుండేరా**
**అంది శ్రీవెంకటనాథ ఆపెను నన్నుఁ గూడితి**
**విందరు నీచేఁత లివి యెంచకుండేరా.** ॥నీవేమి॥ **50**

**భావపరిమళం :**

తాళ్ళపాక చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి, స్వామిని దెప్పిపొడుస్తున్నది. చినతిరుమల తన తాతగారి తరహాలో స్వామి రహస్య ప్రియురాలైపోయారు. వారి వ్యవహారం తెలిసిన దేవి, స్వామిని దెప్పిపొడుస్తున్నది. "నీవేమి చేస్తావులే, ఆమె నిన్ను ప్రేరేపించగా బాగానే వున్నది. మధ్యలో నేను నిన్ను సాక్ష్యం చూపించమని కోరటం తగదా? నీవు నిష్కళంకుడివని నమ్మాలా?" ప్రభూ! పూనుకొని ఆమె తరపున నాతో పోరాడవస్తే మన చుట్టాలు అందరూ నన్ను మెచ్చక ఆమెను మెచ్చెదరా? ప్రతిసారీ నిన్ను సాక్ష్యాలడిగితే వెనకనుండైనా నన్ను తిట్టకుందురా? వ్యవహారం తెలిసిన చెలులు నన్నుదీవించక వుందురా? స్వామీ! ఆమెకన్నుగీటి నాతో కైలాటాలు (కలహము) పెట్టగా మాగొడవ గురించి విన్నవారు కన్నవారు అందరూ నిన్నుపొగడెదరా? ఆమెను మన్నించి మా పోట్లాటలో ఆమెకు నీవు మాట సాయం అందిస్తే చీకటిపడ్డాక మనవాడలోని వాళ్ళంతా సంతోషం పొందకుండా వుంటారా? సందడించు జగడములలో నువ్వు నన్ను పట్టుకొనగా చూచిన నీ భక్తులంతా నీవే లెస్సయనకుండెదరా? నువ్వు తక్కువ వాడవా వేంకటనాథా! ఆమెను (పెద తిరుమలయ్య తాదాత్మ్య ప్రియురాలి రూపం) నన్నూ కూడితివి. ఇంతమందినీ భక్తులు నీ చేతలను మెచ్చుకుండెదరా?

★ **మేరతో** – సరిగా ★ **తావుల** – చోట్లలో





సంఖ్య : 59 సంపుటము : 17 పుట: 36 రాగం : శంకరాభరణం

**28 నే నొకతె నంటా నుంటి నేఁడు నీ కాపె గలిగె**
**మోనాన నుండక నీతో ముచ్చటలాడితిని** ॥పల్లవి॥

**అట్టె నాతో మాటలాడి యాడి నడుమనడుమ**
**ముట్టివచ్చితే నాకెమోము చూచేవు**
**దట్టమై చుట్టాలు నీకు దండ నుండు టెఱుఁగము**
**వెట్టికే మాటలాడితి వేగినంతా నేను** ॥నేనొక॥

**నంటున నన్ను నవ్వించి నవ్వించి యంతలోనే**
**కంటకానఁ గన్నుసన్న గావించేవూ**
**వెంట నీకె తవరులు వేరే వచ్చు టెఱుఁగము**
**యింటికిఁ బిలుచుకొంటి యేడ కేడో నేను** ॥నేనొక॥

**కూరిమిఁ గౌఁగిట నన్ను కుచ్చి కుచ్చియెడనెడ**
**చేరి చేరి యాకెమీఁద చేయి వేసేవు**
**వూరట శ్రీవేంకటేశ వూడిగాలవారి నింత**
**గారవించు టెఱుఁగను కలసితి నేను** ॥నేనొక॥ **59**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో స్వామి తనకు "వూడిగకత్తెగా వున్న ఆమె" (పెదతిరుమలయ్య భావనా భామిని) గారవించి ప్రేమ చూపినాడని, దేవి ఇలా ఆయనను దెప్పి పొడుస్తున్నది. స్వామీ! నేనంటూ ఒకతెను వున్నాను. నేడు నీకామె (పెదతిరుమల) కలిగినది. అది భరించి మౌనంగావుండక, నిన్ను మాటలన్నాను. నిజమే కాని నా ఆవేదన నీ వెఱుగవద్దా? ప్రభూ! అప్పటిదాకా నాతో మాటలాడి, ఆడి మధ్యమధ్య ఆమెను "తాకి" వచ్చితివి. ఆమె మోమును చూచి వచ్చెదవు. నీకు అంత 'కావలసిన చుట్టాలు' దగ్గరనే వున్నారని నాకు తెలియదు. నేనే ప్రయోజనం లేకుండా మాటలాడినాను. అదికూడా, తెల్లవారేదాకా. ప్రభూ! నన్ను చెలిమితో నవ్వులలో ముంచెత్తుతూనే అంతలోనే నాకు ముల్లు గుచ్చుకొనునట్లు ఆమెకు కనుసైగచేసెదవు. ఈమె వెంట ఆమె తవరులు (కావలసినవారు (?) అనగా... తోటి శరణాగతులు) వేరే వచ్చుట నేనెరుగను. వారినందరిని నీ ఇంటికే (నీ సన్నిధికే) పిలిపించుకొంటివి. మరి నేనునీకేమవుతాను స్వామీ! ఓ తిరుమలేశా! నీకు నేనూ కావాలి, ఆమే కావాలి. నన్ను గుచ్చిగుచ్చి కౌగలించి అక్కడక్కడా తాకి చేరువౌతూనే ఆమెను (పెదతిరుమల) వదలక మీద చేతులు వేసేవు. ఊరట కలిగించే ఓ శ్రీవేంకటేశ్వరా! ఆమె, ఆమె బంధుజనమంతా నీవూడిగాలవారు (నీ దాసులు). దాసులను ఇంతగారవించే వారిని నేనెరుగను.

★ **వేగినంతా** – తెల్లవారేదాకా ★ **నంటన** – చెలిమితో

సంఖ్య : 17 సంపుటము : 28 పుట: 12 రాగం : మంగళకౌసిక

**29 ఏల వూరకుందానవు యిట్టే నివ్వెరగుతో**
**మూలఁ బొద్దు వుచ్చితేను ముచ్చట వాసీనా ॥పల్లవి॥**

**మంతన మాడేవేళనే మాటలు వెలుచుకొని**
**కాంతుని చిత్తమెల్లాను కనుకోరాదా**
**సంతసతులలో (తో?) నెన్ని జాణతనా లాడినాను**
**యెంతైనా రతికేలికి నీడు వచ్చీనా ॥ఏల॥**

**పెనఁగేటి వేళనే ప్రియునిచేఇదుకొని**
**చెనకి సేఁతకు సేఁత సేయరాదా**
**యెనయక రచ్చలోన యెంత చేయి ముట్టినాను**
**తనువులు సోఁకినట్లు దప్పిదేరీనా ॥ఏల॥**

**భావించి కూడేవేళనే పైపైఁ బ్రియాలు చెప్పి**
**శ్రీవేంకటేశు చనవు చేకొనరాదా**
**వొవరిలోఁగూచుండి వుపమ నెంత నవ్వినా**
**తావిమీకాఁగిటివలె తనివి నొందీనా ॥ఏల॥ 17**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస శృంగారకీర్తన ఆనాటి తెలుగు నుడికారం అర్థంకాక కొంత ఇబ్బందేకాని అతి సుగమమైన కీర్తన. ఈ పల్లవినే ఈనాటి తెలుగులో ఇలా చెప్పుకోవచ్చును. ఇట్టే (ఈ రీతిగా) నివ్వెరగుతో (పారవశ్యముతో) వూరకున్నావు? ఒకమూల కూర్చొని పొద్దుబుచ్చితేనీ ముచ్చట తీరుతుందా చెప్పు తల్లీ! స్వామి నీతో మంతనాలాడుచున్నవేళ నీమనస్సులోని మాటవెలిబుచ్చి, నీకాంతుని మనస్సులో యేమున్నదో తెలుసుకోరాదా? సంతోషముతోనున్నపుడు నీమగడు యెంత జాణతనము ప్రదర్శించినా అది రతికేళికి సాటి అవుతుందా? నిను సయ్యాటలు సలుపుతూ అలరించువేళనే,నీ విభుని చేయిపట్టుకొని ఆయనచేసినట్లే నీవూ చేయరాదా? నీపై ప్రేమాతిశయమున బహిరంగంగా స్వామి, యెంత చేయిపట్టుకొన్నా అది తనువులు కూడినట్లవుతుందా? ఏనాటికీ కాదు. దేవీ! అతగాడు భావించి పైపై ప్రియములు చెప్పి నిన్ను కూడేతరుణముననే ఆ శ్రీవేంకటేశుని వద్ద చనువులు తీసికొనరాదా? పడకటింట్లో ఎంత ఉపమ (ఉపాయముతో) నవ్వినా, అది మీ కౌగిటి మాధుర్యంతో సరితూగుతుందా?

★ **ఓవరి** – పడకటిల్లు ★ **యెనయక** – వెనుదీయక (?)





సంఖ్య : 58 సంపుటము : 17 పుట: 36 రాగం : పాడి

**30 ఈ చనవు లీ వలపు లెందుఁ గన్నవి గావు**
**చేచేతఁ దప మెంత చేసెనో చెలియా ॥పల్లవి॥**

**పడఁతి తనవదనమున బాగాలు నించిఁ నీ**
**వెడనెడల నాకు మడిచి యియ్యఁగాను**
**తొడమీఁదఁ దొడ వేసి తొదలు (?) మాటాడి, నీ**
**కడ చూచె నిది యెంత కలికియో కాని ॥ఈచన॥**

**బంగారుమేడలో పరపుపై చెలికి, నీ-**
**వంగములఁ గస్తూరి యలఁదఁగాను**
**ముంగయి మురువులు నీ ముంజేత నిడి, మోవి**
**యెంగిలిగాఁ జేసె నిది యెంతటిదో కాని ॥ఈచన॥**

**నిండు రాజసముతో నీమీఁద నొరగుకొని**
**అండనే నీవు తను నలమఁగాను**
**బెండుపడి రతి నిన్నుఁబెనఁగె శ్రీవేంకటేశ**
**కొండగొనె నిది యెంత కూర్మియో కాని ॥ఈచన॥ 58**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో దేవి చెలికత్తెయైన పెదతిరుమల భావనా నెచ్చెలి యేమంటున్నదో వినండి. ఓ చెలియా (దేవీ!) యీ చనవులు, యీ వలపులు మేమెందుననూ చూడము. ఈమె చేచేత (స్వయముగా) యెంత తపము చేసెనోగాని తిరుమలనాయకుని వలపునందుకొన్నది. ఆ పడతి (దేవి) తన వదనమున చక్కందనములను నింపి నీవు (స్వామి) ఆకు మడచి యీయగా (తాంబూలమునందించగా) తొడలను తాకించి నయముగా మాటలాడి చివరకు నెగ్గినది. ఈమె యెంత నేర్పరియో కదా! బంగారు మేడలో పరపుపై శయనించియున్న ఆ చెలికి (దేవికి) నీవు అంగాంగముల కస్తూరిని అలదినావు. అప్పుడామె లేచి తన ముంజేతికున్న కడియాలను చిలిపిగా నీ చేతికి తొడిగి నీ అధరమును యెంగిలి చేసినది. ఔరా! ఈమె యెంతటిదో వూహించలేము. ముంచేతిని రాజఠీవితో ఆమె నీ మీద వొరగగా అందుకు తగినట్లు నీవు (స్వామి) తనను ఆక్రమించినావు. ఆపై తాను అలసిననూ ఓ శ్రీవేంకటేశ్వరా ఇది (ఈమె) నిన్ను కొండగొనె (పొందినది). ఈమెకు నీపై యెంత కూరిమియో గదా!

★ **బాగాలు** – చక్కందనములు ★ **బెండుపడి** – అలసిపోయి

సంఖ్య : 206 సంపుటము : 28 పుట: 139 రాగం : ముఖారి

**31** ఎవ్వరి మాటలు నేనేల వినేను
దివ్వెలెత్త నియ్యవయ్య తేనెలు నించేను ॥పల్లవి॥

నవ్వులకుఁ గడమా నాకు నీవు గలిగుండి
రవ్వలుగ మీఁద మీఁద రాఁపుసేయఁగా
పువ్వువంటిదాన నేను పూఁపవంటి విభుఁడవు
బువ్వానకు రావయ్యా బుద్ధిచెప్పే నేను ॥ఎవ్వ॥

సంతోసాలు బాఁతే సారె నీవిందరిలోనా
చింతదీర వేఁడుకొని చెక్కు నొక్కఁగా
పొంత నిదె నావలపు పొరుగే పోనీవావి
మంతనాన వినవయ్య మాట చెప్పే నేను ॥ఎవ్వ॥

ఆసకు లెక్కవున్నదా ఆయాలు మోవఁగ నీవు
సేసవెట్టి పెండ్లాడి చేరి కూడఁగా
వాసి నలమేల్‌మంగను వడి శ్రీవేంకటేశుఁడ
యీసులేక కూడితివి యెనశుండే నేను ॥ఎవ్వ॥ **206**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో దేవి అలమేల్మంగ తన విభునితో యేమంటున్నదో వినండి. ప్రభూ! ఎవ్వరో నీమీద యేవేవో చెబుతుంటారు. వారి మాటలను నేనెందుకు వినాలి? ఎందుకు వింటాను? దివ్వెలెత్తనే (దీపాలు పెట్టేవేళయింది) నీ అధరామృతమునందించవయ్యా! ప్రభూ! నీవు నన్ను కలిసివుండగా నా సంతోషానికి లోటు వుంటుందా? రవ్వలుగ (రచ్చజేసి) సంఘర్షణ కలిగించగా పాడియేనా? నేను పూవువంటి సుకుమారిని. నీవు పూఁపవంటి (పూవుపిందెను పోలిన) నాథుడవు. నీవు భోజనానికి రావయ్యా! నాకు తోచిన మంచి మాటలు చెబుతాను. దేవా! నీవు సంతోషాలనందరిముందూ పంచుతావు. నా చింతదీరునట్లు వేడుకొని నా చెక్కిలి నొక్కుతావు. నా వలపు నీకు చేరువైతే పొరుగుననున్న చుట్టుపక్కాలమాటలు మనమెందుకు పట్టించుకోవాలి. ఏకాంతములో నేను చెప్పే మాటను వినవయ్యా! స్వామీ! ఆశకు అంతులేనేలేదు. ముత్తైదువలందరూ ఆశీర్వదిస్తుండగా, నీవు నన్ను మంగళాక్షతలు జల్లి పెండ్లాడితివి. నన్ను చేరి కూడితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! నేను వాసికెక్కిన నీ ఇల్లాలు అలమేల్మంగను. నీవు ఈర్ష్యా ద్వేషముల కతీతుడవై నన్ను కూడితివి. నేను అతిశయించితిని.

★ **బువ్వానకు** – భోజనానికి ★ **మంతనాన** – ఏకాంతమున





సంఖ్య : 445 సంపుటము : 17 పుట: 256 రాగం : దేసాళం

**32** దేవుఁడట యీతఁడు దేవులట మహాలక్ష్మి
దేవుని దేవిని నగి తెగడరో హరిని ॥పల్లవి॥

రోలఁ గట్టు వడె నని రోకలి చేఁ బట్టె నని
రోలా రోఁకటఁ బాడరోఁహరిని
కాల బండి దన్నె నని కైకొనె మానము లని
కాలనే మానమున కాడఁ గదరో హరికి ॥దేవు॥

సుద్దులే దొంగరికాలు మద్దులు విఱిచినాఁడు
సుద్దులు ముద్దులుఁ జెప్పి చూపరో హరిని
చద్దులు చిక్కానఁ గట్టే చాలఁ జిచ్చువేఁడి మింగె
చద్దికి వేఁడికి మీరు సతులెల్ల నగరో ॥దేవు॥

చేతనే చీరలు దీసె వాతఁ బిల్లఁగోలు వూదె
చేతి వాత బ్రియములు చెప్పరో హరికి
యేతుల శ్రీవేంకటాద్రికృష్ణుడు మనలఁగూడె
యీతల నాతలఁ బంత మియ్యరో హరికి ॥దేవు॥ **445**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరసకీర్తనలో శ్రీవేంకటాద్రి కృష్ణుని లీలలను వివరిస్తున్నారు. (క్లిష్టమైన దీని వివరణ నా భావన). ఈ హరియే దేవుడట. ఇక శ్రీమహాలక్ష్మి అతగాని దేవేరి. దేవుని దేవిని నవ్వుతూ పొగడి హరిని తెగడరో. ఎందుకంటే హరి చిలిపికృష్ణునిగా చేసిన పనులు సామాన్యమైనవా? అతగాడు అల్లరిమాననందున రోటికి కట్టివేయబడ్డాడు (కృష్ణుడు) రోకలి చేతబట్టె (బలరాముడు). రోలారోకట (రోట్లో రోకలితో దంచుతూ) పాడరో హరిని. వీడు కాలితో బండిని (శకటాసురుని) తన్నాడు, సంహరించాడు. వనిత సిగ్గులనపహరించినాడు. కావున అట్టిహరికై నీ మానమునే కాలదన్నరో! అతగాని సుద్దులన్నీ (సంగతులన్నీ) దొంగతనానికి సంబంధించినవే. పాపడిగానే పెరట్లో ముద్దులను విరిచినాడీ కృష్ణుడు. మరి హరికథలను మద్దులు (వ్యాప్తిచెందగా) చేయరో! కృష్ణునిగా తనవెంట చద్దిఅన్నం, చిక్కానికి కట్టి తీసికొనిపోయాడు. అడవిలో దావాగ్ని చెలరేగగా దానిని మ్రింగివేసినాడు. చద్దికి వేడికి (రాత్రింబగళ్ళు) ఇతని సరసాలకు సతులెల్లా నవ్వరో! ఇతగాడు చీరెలపహరించినాడు. వాత (నోటితో) పిల్లనగ్రోవి వూదినాడు. మరి శ్రీహరికి చేతలతోనూ మాటలతోనూ ప్రియములు సలుపరో! శ్రీవేంకటాద్రి కృష్ణుడైన శ్రీవేంకటేశ్వరుడు మనలను కూడినాడు. ఇహపరములలో హరిని వదలక శపథము చేయరో

★ **పంతమియ్యరో** – (శపథముజేయరో) ★ **నగి** – నవ్వుతూ

సంఖ్య : 64    సంపుటము : 10-2  పుట: 37    రాగం : రామక్రియ

**33** పించెపుతలజడల పిన్నవాఁడు
పెంచీనె వలపులు పిన్నవాఁడు ॥పల్లవి॥

చనవరివలెనె వేసాలచేఁతలు సేసి
పెనఁగీఁ గుచములతోఁ బిన్నవాఁడు
ఘనమై ముద్దులు చూపి కరఁగించి యింతలోనె
పెనపులఁ బెట్టీనె పిన్నవాఁడు ॥పించెపు॥

చెలిమికానివలెనె సిగ్గు వీడ మాఁటలాడి
పిలిచీ యేకతానకుఁ బిన్నవాఁడు
కులమువావులు చెప్పి గుట్టు దెలుసుక నాతో
పెలుచుమాఁట లాడీనె పిన్నవాఁడు ॥పించెపు॥

చిట్టకపు చేఁతలను చెనకి నా వేలఁ దెచ్చి
పెట్టీనె వుంగరము పిన్నవాఁడు
గట్టిగాఁ దానె శ్రీవెంకటనాతుఁడై వచ్చి
బెట్టుగా నన్నుఁ గూడెనే పిన్నవాఁడు. ॥పించెపు॥ **64**

**భావపరిమళం :**

ఇది చినతిరుమలయ్య తన తాతగారిని అనుకరిస్తూ చెప్పిన శ్రీకృష్ణ రసాయనామృతం. నేటి ఆధునిక “తెలుగు పండిట్స్‌కు” తలనొప్పి అయినా, శ్రీకృష్ణ ప్రియులకు మాత్రం కర్ణామృతమే. ఈ పిల్లగాడు నెమలి పింఛము తలపై అలంకరించుకొన్న అందమైన జడలున్నవాడు. వీడేంచేశాడో తెలుసా? అమాయకులైన గోపికలలో వలపులను పెంచినాడు. ఇతగాడు బాగా చనవు వున్న స్నేహితునివలె వేషాలు వేస్తుంటాడు. గోపికల పయోకుంభములతో పెనగులాడుతుంటాడు.ఇంతలోనే దట్టమైన ముద్దులలో ముంచి కరగించు రసికుడు. ఈ పిన్నవాడు పెనపుల (వివాదాలలో) అందరినీ పెట్టువాడు. గొప్ప స్నేహితునివలె మాతో సిగ్గు లేకుండా మాట్లాడతాడు. యువతులను ఏకాంతమునకు పిలుస్తాడీపిన్నవాడు. ఆడది కనబడితే చాలు దాని కులము చుట్టరికము యొక్క గుట్టు తెలిసికొని, విరసంగా మాట్లాడతాడీ పిన్నవాడు. శృంగారలీల చూపుతూనన్ను తాకుతూ ఈ పిల్లవాడు నా వేలికి ముద్దుటుంగరము తొడుగుతాడు. దిట్టతనముతో ఆగోపాలకృష్ణుడే శ్రీవేంకటేశ్వరుడైవచ్చి ఈ పిన్నవాడు నన్ను గూడినాడే.

★ **పెలుచు** - విరసపు ★ **చిట్టకపుచేతలు** - శృంగారలీలతో





సంఖ్య : 141  సంపుటము : 28  పుట: 95    రాగం : బౌళి

**34** అంగనమోహము నీపై నటువంటిదా
యింగిత మెఱఁగవా నీ వింత దొరవు ॥పల్లవి॥

సిగ్గువడి యాపె నీతో శిరసువంచుకుండఁగా
దగ్గర లోఁగే వదేమి దంటవాఁడవు
యెగ్గున నీ వలఁ(ల్లఁ?)దప్పు యేమైనాఁ గలదోనేఁడు
వొగ్గి నీకు ఆపె యిందు వొరటులాడీనా ॥అంగ॥

కన్నెపాయ మటుగాన కాంత పలుకఁగ వుంటే
పన్ని యేల పైఁకొనవు ప్రౌఢవాఁడవు
యెన్నికలు యేమైనా యెంచుకొన్నవిఁగలవో
అన్నిటా నీ వేమనినా అవుఁగాదనీనా ॥అంగ॥

నెలఁత నిన్నుఁ గలసి నివ్వెరగైయుండఁగాను
యెలయించకు శ్రీ వేంకటేశ్వరుఁడవు
అలుకదేరి కూడితి వాస లేమైనాఁ గలవో
చెలియ నీ చెప్పినట్లు సేయకమానీనా ॥అంగ॥ **141**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో ఆయన స్వామి చెలికత్తెయై యేమంటున్నారో వినండి. స్వామీ! ఆయువతికి నీపై కలిగినటువంటి మోహము అటువంటిదనుకొన్నావా?నీవు ఇంతటి దొరవు కదా! ఆమాత్రం ఇంగితము (అభిప్రాయము) నెఱగవా? ఆదేవి నీదగ్గర సిగ్గుపడి తలకొద్దిగా వంచినది. ఆమె నీకు దగ్గర కాగానే ఆమెను అడిగివుంటావు అదేమి దిట్టతనమయ్యా? నీవల్ల యేమన్నా తప్పు వున్నదా స్వామీ? లేక ఆమె నిన్నిందుకు ఒఱటులాడీనా (దుశ్శీలుడవని నిందిస్తుందా? స్వామీ! ఆమె కన్నెప్రాయపు చిన్నది. అందువల్ల బిడియంతో నిన్ను పలుకరించకపోయి వుండవచ్చును. మరి నీవు ప్రౌఢత్వముగలవాడవు కదా! నీమెనేల స్వీకరించవు? భార్యాభర్తల ఎన్నిక విధిప్రాలు. ఇందులో యేమైనా యెంచుకొనేదున్నదా? అయిననూ దేనినైనా నీవేమనినా ఆమె అవునంటే కాదంటుందా? స్వామీ! ఆ నెలత నిన్ను కలిసినప్పటినుండి పారవశ్యములోనున్నది. నీవు శ్రీవేంకటేశ్వరుడవు ఆమెను యెలయించవలదు (ఆసక్తి పెంచవలదు). అలుకమాని దేవితో కూడితివి. ఇంకా ఆశలేమివుంటాయి? ఆ చెలియ నీవు చెప్పినట్లు సేయక మానీనా?

★ **నివ్వెఱగ** - పారవశ్యము ★ **పన్ని** - పన్నుగడచేసి

సంఖ్య : 444 సంపుటము : 17 పుట: 256 రాగం : పాడి

**35** కొమ్మల జవ్వనములు కోరువట్టేవా
కమ్మర మా కోరికెలు గాదె బోసేవా ॥పల్లవి॥

నామనసు అడుగ నేల నమ్మించ నీ కేల
కోమలపు మాగుణాలు కొలవట్టేవా
యేమీ మాకుచగిరు లెంత లెంత లాయ నేమి
లేమల చక్కఁదనాలు లెక్క వ్రాసేవా ॥కొమ్మల॥

యెక్కువ మా కనుఁగవ లెంత ఘన మాయ నేమి
కక్కసించి యిందులో సుంకము గొనేవా
చక్కని మాగో ళ్ళివి సరి గానీ బేసి గానీ
పక్కనవినియు నాతో పందె మాడేవా ॥కొమ్మల॥

మంతనాలు నెరపేవు మరురాజ్యపదవికి
యింతటికీ నన్నుఁ బట్ట మేలించేవా
చెంతలఁ గూడితి విదె శ్రీవేంకటేశ నీవు
సంతనాన గోరి లచ్చన వెట్టేవా ॥కొమ్మల॥ **444**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరసశృంగార కీర్తనలో నాయిక స్వామిని యెలా దెప్పుతున్నదో ఆలకించండి. ఏమయా శృంగారరాయా! స్త్రీల యౌవనములను కోరువట్టేవా (కౌలుకు తీసికొంటావా?) ఆ తరువాత మా కోరికలను కూడబెడతావా? నామనసు యెట్లున్నది అడుగ నీకేల? నన్ను నమ్మించే అవసరం నీకేల? సుతిమెత్తని మాగుణములను కొలవడానికి వచ్చావాయేమి? మాకుచగిరులెంతెంత వుంటే నీకేమి? ఇక్కడవున్న యువతుల చక్కదనాలను లెక్కిస్తున్నావాయేమి? మాకనుగవలు యెంత పెద్దవైతే నీకేమి? కక్కసించి (బాధించి) వాటికి పన్ను విధిస్తావాయేమి? మాగోళ్ళు (కనబడునట్లు తెరచిన వేళ్ళకువున్న గోళ్ళు) సరిసంఖ్య అయితే నీకేమి, బేసిసంఖ్య అయితే నీకేమి? పక్కనవున్న యువతి చెప్పింది విని మాతో పందెం కాస్తావా? ఏమి తెలివితేటలు. మన్మథ రాజ్య పట్టాభిషిక్తుడవవుటకు మంతనాలాడుతున్నావా యేమి? ఈ రాజ్యానికి నన్ను పట్టమహిషిని చేస్తావా? ఏమి దాతృత్వము? ఓ శ్రీవేంకటేశ్వరా! నా చెంతకు వచ్చి నన్ను కూడితివి? కోరి నన్ను సంతలో గుర్తుపట్టేవా?

★ **లచ్చనవెట్టేవా** – గుర్తుపట్టేవా ★ **మరురాజ్యం** – మన్మథసామ్రాజ్యము



హరి సేవకే వేంకటేశ మకుటం

సంఖ్య : 57 సంపుటము : 10-2 పుట: 33 రాగం : నాదరామక్రియ

**36** వేగిరమా నీవు విభుఁడవు నీ వెలఁదిని నేను
సోగకన్నుల నీసొలపుఁజూపులసొంపు నాకుఁ జాలదా ॥పల్లవి॥

చెలియ మునుపు సింగారించుకొన్న చెంగావిచీర యిది ।నీవు।
తలఁకక నేఁడు దట్టి గట్టుకొంటె దాని కేమి దోసమా
అలిగేనా నేను అందుండె మాఁటాడు అంటుకొన నోపను ।అది।
తలఁగ వేరొక్కతావునఁ బెట్టిరా దగ్గరుందు గాని ॥వేగి॥

కందువతో నాపె కస్తూరి వూయఁగ గట్టిబేఁటులు రాలితే ।నీవు।
పొందు చెడకుండ బొట్టు వెట్టుకొంటె బోగానకుఁ గడమా
నింద నిన్నాడేనా నేటి కటుండరా నే నందు కోరువను ।వొక।
చందానఁ బన్నీట జలక మాడి నాసంగడికి రారా ॥వేగి॥

ముద్దియ వేలనె ముందర నుండెటి ముద్దుర వుంగరము ।నీవు।
పెద్దరికానకు ప్రియమునఁ గేలఁ బెట్టుకొంటేఁ దగదా
గద్దరివై శ్రీవెంకటనాథ నన్నుఁ గరఁగించి కూడితి ।నా।
వద్దనె పాయక వాలాయించి దేవరవలె నుండరా. ॥వేగి॥ **57**

**భావపరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో ఆయన వేంకటరమణుని ప్రియురాలైనందున దేవి ఆయనను యెలా దెప్పుతున్నారో చూడండి. వేగిరమా (అంత తొందరెందుకు) స్వామీ! నీవు నాథుడవు, నేను నీ వెలదిని (ఆడుదానిని). నాకు నీతో భువనాల నేలుదామనే ఆశలు లేవు. నాకు నీవు నీ సోగకన్నులతో చూచే సొలపు జూపుల (పారవశ్యపు చూపుల) సొంపు చాలును ప్రభూ! స్వామీ! నీవు నేడు కట్టుకొన్న "దట్టీ"ని (నేటికాలం ధోవతి) గమనించావా? అది ఆ చెలియ కట్టుకొని విడచిన చెంగావిరంగుచీరె. వెనుదీయక దానినే కట్టినావు. దానికి నేనెందుకు అలిగెదను? కాని నువ్వు నన్ను అంటుకొన వద్దు. అందుండే మాట్లాడుము. నిన్ను నేను అంటుకొనజాలను. ఆమెను వేరొకచోట బెట్టిరారాదా? దగ్గరనే వుండొచ్చుగదా? ప్రభూ! ఆవిడగారు ప్రేమగా నీకు కస్తూరి అలదితే అది యెండి పెచ్చులురాలిపోయినా తిరిగి వాటినే కస్తూరి తిలకములా పొందు చెడకుండా ధరించావు. ఆహా! నీ భోగానికి యేమీ కొదవలేదు. నేను నిన్నెందుకు నిందిస్తానయ్యా? కానీ, నేనందుకు (ఇద్దరితో వలపు) సహించను. నేటికి ఆవిడదగ్గరే వుండరాదా? అయినా నన్ను వెతుక్కుంటూ వచ్చావు కాబట్టి ముందువెళ్ళి పన్నీటితో స్నానం చేసిరా! పాపం ఆ ముద్దరాలు, నీ చేతివేలికి తన ముద్దుటుంగరం తొడిగినట్లుంది. నీవు పెద్దరికంతో చేతికి బెట్టుకొంటే తప్పేముంది? కానీ తెంపరివై ఓ వేంకటేశ్వరా! నన్ను కూడా కరిగించి కూడితివి. ఇకపై దేవరవలె నావద్దనే నిర్బంధించినట్లు వుండరాదా ప్రభూ!

★ **వాలాయించి** – నిర్బంధముగా ★ **తలఁగ** – తొలగించి

సంఖ్య : 243 సంపుటము : 28 పుట: 164 రాగం : ఆహిరి

**37 ముందరెరిగి బదుకుమోహపుదాన నేను**
**సందడి జాణతనాలు చాలుఁజాలు నిఁకను** ॥పల్లవి॥

**జగడాలదాననా సరసపుదానఁ గాక**
**యెగసక్కె లింతులచే నే లాడించేవు**
**నగినట్లనే వుండు నాట దా కొనగోరు**
**వొగరులు మాతోడ వొద్దు వొద్దు నీకు** ॥ముంద॥

**పంతములదాననా పైకొనేటిదానఁ గాక**
**వంతులేల పెట్టేవు వాసు లెక్కించి**
**కాంతుఁడ ముదిరితేను కలియే మేడిదె గాదా**
**వింత గుణములు ఇఁక విడు విడు నీవు** ॥ముంద॥

**అలుకలదాననా నెయ్యపుదాన నేఁ గాక**
**పలుకుల నన్ను నేల భ్రమయించేవు**
**యెలమి శ్రీవేంకటేశ యెనసితి మిఁక నుప్పు**
**యిలఁ జిందితే రెట్టించు యేల జోలి మనకు** ॥ముంద॥**243**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరసశృంగార కీర్తనలో దేవి యేమంటున్నదో వినండి. ప్రభూ! నేను నీ సాంగత్యం కోసం బ్రతుకుపై మోహము కలిగినదానను. నేను ముందరెరిగినదానను (జరుగబోవునదేమియో తెలిసినదానను). అతిశయించి నీ జాణతనాలు ఇకచాలు, చాలయ్యా! నా మనవి వినుము. ప్రభూ! నేను సరసము తెలిసినదాననేకాని, జగడాలమారిదానను గాను. అట్టి నన్ను సాటి ఇంతులతో యేల వేళాకోళము లాడించేవు. నాతో నవ్వుతోనే వుండు, కొనగోటి నాటులు పెట్టికటువుగా మాతో వుండవద్దు. స్వామీ! నేను నీతో పంతములాడేదాననా? వలపుతో నిన్నాక్రమించుదాననుకదా! మనవంశౌన్నత్యముల వంతులేల లెక్కించెదవు? ఓ నాథుడా! చిన్న జగడము ముదిరితే పెద్ద యుద్ధానికి దారితీసినట్లు, ఇకనైనా నీవింత గుణములను విడువకపోతే మన జగడాలు దుష్పరిణామాలనిస్తాయి. ప్రియా! నేనెప్పుడూ అలుకతో వుండేదాననా? కాదే స్నేహశీలిని. నీ మాటలతో యేలనన్ను భ్రమలో ముంచెదవు? ఓ శ్రీవేంకటేశ్వరా! ఉప్పు (రాళ్ళఉప్పు) కిందపడితే చిటికి రెట్టింపైనట్లు మనకు జగడముల జోలియేల.

★ **ఒగరులు** – కటువుతనము ★ **జోలి** – సంపర్కము





సంఖ్య : 371 సంపుటము : 17 పుట: 214 రాగం : సామంతం

**38 తా నేడ నే నేడ తడవి నన్ను**
**నానఁబెట్టి వట్టిమాట నయగారి గదవే** ॥పల్లవి॥

**వచ్చి వచ్చి చూచేది వలపు మోచేది**
**బచ్చనల సటకాఁడు పాయఁడే నన్ను**
**కొచ్చి నడుము దూరేది గోరనే గీరేది**
**నిచ్చలు మానఁడు వీఁడు నేరుపరి గదవే** ॥తానేడ॥

**ఆసలనే పొనిఁగేది ఆచ్చులాన మునిఁగేది**
**వాసులకు వెంట వెంట వచ్చీనే తాను**
**బాస లెల్ల నెరపేది పను లెల్లా మరిపేది**
**కాసీఁ గూరిమియెండ కడు జాణ గదవే** ॥తానేడ॥

**కడు సిగ్గు విడిచేది కలికియై నడచేది**
**నడుమంత్రమున వీఁడు నవ్వీనే నన్ను**
**యెడలేక శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె**
**అడియాలా లెల్ల నిచ్చె నందగాఁడు గదవే** ॥తానేడ॥**371**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార సంకీర్తనలో ఆయన స్వామిని వలచిన జవరాలు. ఆమె తలపోతలెలా వున్నాయో గమనించండి. తాను దేవదేవుడు. నేను సాధారణ వలపుకత్తెను. తానెక్కడ నేనెక్కడ. తడవి (నన్ను స్పృశించి) నానబెట్టి (మదనతాపమునకు గురిచేసి) వట్టి మాటలతో భ్రమింపజేసిన నయగారి (ఇచ్చకపు మాటల శృంగారరాయుడు కదా!) అయినా నన్ను తానూ విడువలేడు. అతగాడెట్టివాడో తెలుసా? వస్తాడు, పచ్చి చూపులు చూస్తాడు, వలపులు రేకెత్తిస్తాడు, ఆ బచ్చెనల సటకాడు (పైపై రంగుల కపటి). కాని నన్నెన్నటికీ వదలలేడు. నా నడుమును గుచ్చి పట్టుకొంటాడు. గోటితో రక్కి చెప్పరాని మాటలంటాడు, ప్రతిదినము ఇదే తంతు మానడు. అయినా వీడు గొప్ప నేర్పరి కదే! అతగాడి చేతలు ఇంకా వినండి. ఆశలను క్షీణింపజేస్తాడు. ఆశ్చర్యంలో ముంచెత్తిస్తాడు, తన లాభము కోసం వెంటవెంట తిరుగుతాడు. నావెనకే వస్తాడు. ఏవేవో బాసలు చేస్తాడు, నాపని నన్ను చేసికొననియ్యడు. ప్రేమ అనే యెండ బాగా కాసేట్లు చేస్తాడు. అమ్మో! గొప్ప జాణ కదండీ! అతగాడి మరికొన్ని లక్షనాలను వినండి. సిగ్గును పూర్తిగా వదలిపెట్టేశాడు. అందానికి అతడే సారధి. మధ్యలో వచ్చి నవ్వులు కురిపిస్తాడు. ఈ శ్రీవేంకటేశ్వరుడు, యెడెతెఱపిలేక నన్ను కూడినాడు. అందగాడు కదా! అందుకని తన గుర్తులను నేను మఱువలేను.

★ **పొనుగు** – క్షీణింపజేయు ★ **నడమంత్రము** – మధ్యలో వచ్చింది

సంఖ్య : 135 సంపుటము : 28 పుట: 91 రాగం : పాడి

**39 ఊరకే వున్నాఁ డితఁడు వోరుపుతోడ**
**ఆరీతి మాటలాడ ఆరుహమా ఇపు(త)డు ॥పల్లవి॥**

**మంతనము లాడెనంటా మగువతో నీవతని--**
**నెంతకెంత సేసేవే ఇప్పుడు నీవు**
**వంతులు దప్పకవుండవచ్చీఁ గాక రమణుఁడు**
**అంతేసి మాటలకు నరహమా ఇతఁడు ॥ఊర॥**

**అంగనచేతి విడెమాకు నందుకొనె నంటా**
**యెంగిలి మాటాడకువే యెగసక్కేన**
**జంగిలిలో నీతోడ సరసము నాడీఁగాక**
**అంగమంటి ఇంతసేయ నరుహమా ఇతఁడు ॥ఊర॥**

**మేడమీఁదనున్నచెలి మేలమాడి కూడెనంటా**
**ఆడుకొనే వింతలోనె అందరితోడ**
**వోడక శ్రీవేంకటేశుఁ డొడివట్టి నిన్నుఁగూడె**
**ఆడ నీడా గేలిసేయ నరుహమాఇతఁడు ॥ఊర॥ 135**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో తాను దేవి చెలికత్తెయై స్వామి తరపున మాటాడుతున్నారు. ఈ నీ రమణుడు నిన్నేమీ అనటంలేదని వూరకనే వున్నాడని అతని యెగ్గుల నెంచుతున్నావు. అతను వోర్పుతో వున్నాడని ఆరీతి మాటలు అనుటకర్హుడా అతడు? ఇది తగిన పనియేనా? దేవీ! నీవిప్పుడు యెంతెంత పనులు చేస్తున్నావు. ఇతనిపై ఆ మగువతో మంతనాలాడుతున్నాడని నెపమునేస్తున్నావు. నీ రమణుడు మాటలాడిన ఆమె అతనికి వరుస కాకపోయి వుండవచ్చును. కాని అందుకు అతనిని అన్ని మాటలనవచ్చునా? దానికతను అర్హుడేనా? దేవీ! నీ రమణుడు ఆమె (అన్నమయ్య భావనా సుందరి) చేతి తాంబూలమునందుకొన్నాడని, దెప్పిపొడవకమ్మా! అపభ్రంశపు మాటలనకమ్మా! అనాగరికంగా నీతో సరసమాడినాడని అతని చేయిబట్టి నిలబెట్టి ఇంతసేయతగునా? దీనికితడు అర్హుడా? దేవీ! ఆ మేడలోనున్న చెలి నీరమణునితో పరాచికములాడి ఆపైన కూడినదని ఇంతలోనే అందరితో “చెవిలో ఇల్లు కట్టుకొని” మరీ చెబుతున్నావు.కాని, యేమాత్రం వోటమి నంగీకరించని శ్రీ వేంకటేశ్వరుడు రొండిపట్టుకొని నిన్ను గూడినాడు. ఆ రమణి దగ్గర, నీ యేకాంతములోనూ నీ రమణుని గేలిసేయతగునా? స్వామిదాని కర్హుడేనా?

★ **గేలిసేయు** – వేళాకోళములాడు ★ **అంగమంటి** – చేయిబట్టి





సంఖ్య : 410 సంపుటము : 17 పుట: 237 రాగం : సామంతం

**40 అంతట నాజన్మఫల మబ్బుట గాదా**
**చెంతల నిన్నియు నీకే సెలవుగాదా ॥పల్లవి॥**

**మఱి పొరుగున నున్నతఱి నొక్క మాటైనా**
**నెఱవుగా నీవు నన్నునిక్కి చూడవా**
**గుఱిగా దినమూ నీకొలువుకు రాఁగాను**
**మఱచి తప్పియైనాను మాటాడవా ॥అంతట॥**

**చెలితో నావిరహము చెప్పి చెప్పి పుత్తేఁగా**
**అలరి యేపాటైనా నాలకించవా**
**నెలకొని యిందరితో నీవార మను కోఁగా**
**తలఁచి నీవే నన్ను దయ జూడవా ॥అంతట॥**

**చెక్కుచేయి దీసి నీకు సిగ్గువాసి మొక్క గాన**
**గక్కన నట్టే నీవు కౌఁగిలించవా**
**యిక్కు వంటి శ్రీవేంకటేశ యిట్టె కూడితివి**
**మిక్కిలి యింతట నన్ను మెఱయించవా ॥అంతట॥ 410**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరసకీర్తనలో ఆయన స్వామి ప్రియురాలివలె స్వామితో యేమంటున్నదో వినండి. ప్రభూ! ఈ నా సుకృతమంతా నా గతజన్మల ఫలము అబ్బుట కాదా? నీచెంతనుంటే ఇవన్నియు నీకే సెలవుగాదా? (అర్పణము గాదా?) అందుకే నేను చెప్పేది విను. నేను నీ పొరుగుననే వున్నానని తెలిస్తే ఒక్కమాటైనా ఒడుపుగా నిక్కి నన్ను చూడకుందువా? దీక్షగా నీకొలువుకు నేను నిత్యమూ వస్తుంటే ఏదో ఒక్కనాడన్నా పొరబాటుగానైన నాతో మాటలాడకుందువా? స్వామీ! నా చెలికత్తెతో నా విరహబాధను మరీమరీ చెప్పుకొనగా పుత్తెగా (వివశత్వముతో) అతిశయించి యేదో ఒక పొద్దున నేను పాడేయేదో ఒక పాట వినకుందువా? ఇందరితోపాటు నన్నూ తృణీకరించినా, యేదో ఒకనాడు నీకేనాపై దయకలుగదా? దేవా! నా సిగ్గును విడనాడి చెక్కిలిపైనున్న నాచేయిని తీసి నీకు మొక్కితిని. అందుకు నీవు చటుక్కున నన్ను కౌగలించకుందువా? ఓ శ్రీవేంకటేశ్వరా! నా కళాస్థానములంటి ఇట్టే నన్ను కూడితివి. ఈవిధంగా నన్ను గొప్పగా మెఱపించకుందువా?

★ **ఇక్కువ** – కళాస్థానము ★ **వాసి** – విడచి

సంఖ్య : 56 సంపుటము : 10-2 పుట: 32 రాగం : కాంబోది

**41** ఇరుమొనసూది వని యింపు వేసుకుందుఁగాని
మరిగి నే మన సిచ్చి మాఁటలాడఁ జాలరా ॥పల్లవి॥

ఆపెతోఁ బురుదువెట్టి ఆడక వుండినఁ గదా
నాపై నీవల పెల్ల నమ్మి కుందును
చూపుల నాపె కెదురుచూడక వుండితేఁ గదా
చేపట్టి నాముచ్చటెల్లాఁ జెప్పుదు నీతోను ॥ఇరు॥

ఇచ్చుక మాపె కాడక యీడనె వుండినఁ గదా
ఇచ్చిననీబాస లెల్ల నియ్యకొందును
కచ్చుపెట్టి యాపెతో నేకతము మానినఁ గదా
తచ్చునలు మాని నీతో దగ్గరి నవ్వుదును ॥ఇరు॥

కడలు దొక్కక నాకాఁగిట నుండినఁ గదా
అడియాలముగఁ గళలంటుదు నిన్ను
కడువేగ శ్రీవెంకటనాథ నీవె నన్ను
యెడయక వుండఁగానె యితవాయఁ గాకా. ॥ఇరు॥ **56**

**భావపరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో దేవి స్వామితో నిర్ద్వంద్వంగా చెబుతున్న సంకల్పం వినండి. ప్రభూ! నీవు రెండు వైపులా వాడిగల సూదివని నేనెరుగుదును లేవయ్యా! ఆర్తత్రాణ పరాయణుడవు, అలరించే శృంగారరాయుడవు. అట్లే ఇంపుగా వుండుమయ్యా! అయినా నేను మనసువిప్పి నీతో మాటలడజాలను. ఎందుకో వివరిస్తాను వినుము. స్వామీ! ఆమెతో (చినతిరుమలయ్య భావనా సుందరి) నాకు పురుడు (పోటీ) పెట్టి నీవు నీ ముచ్చట తీర్చుకొంటావు. నీవు అది మానితే కదా! నీ వలపును నమ్ముకునేది. నీ చూపులు ఆమెకోసం యెదురు చూస్తూనేవుంటాయి. నీవు అది మానితే కదా, నేను మనసు విప్పి నాముచ్చట్లు చెప్పుకునేది. నన్ను తప్పుపట్టుట యెందులకు? దేవా! నీవామెతో వీలు చిక్కినప్పుడల్లా ఇచ్చకాలు చెబుతావు. నీవది మానితే కదా! నీవు నాకిచ్చిన బాసలను స్వీకరించేది. తమరు సమయం దొరికినప్పుడల్లా ఆమెతో "ఏకాంతం" ఆనందిస్తూనేవున్నారు.నీవు నీ కపటాలు మానితే కదా! నీకు చేరువయై నవ్వుతో వుండేది. మరి నాదోషమేముంది? ప్రభూ! ఆమె వలపుకడలు దొక్కక (అలలువంటి వలపును అంటక) నా కౌగిటిలో వుంటేనే కదా! సులభంగా నీకళాస్థానములనంటగలను. మిక్కిలి వేగముగల వో శ్రీవేంకటేశ్వరా! నీవు నన్ను వదలక వుంటే హితవుగా వుంటుంది కదా!

★ **తచ్చున** – కపటము ★ **అడియాలము** – సులభము





సంఖ్య : 71 సంపుటము : 28 పుట: 48 రాగం : శుద్ధదేశి

**42** నిన్నుఁ జూచి వెరగయ్యీ నేఁడు మాకిందరికిని
యెన్నికె కెక్కినవాఁడ వింత సేయఁదగునా ॥పల్లవి॥

సిగ్గువడఁగానే చెలిఁ జేయివట్టి తీసేవు
యెగ్గనౌ యెవ్వరుంటా నెఱఁగవు
అగ్గలము మోహమైతే నాడేవారిఁ జూడవద్దా
వొగ్గి మగవాఁడ వింత కొడిగట్టఁదగునా ॥నిన్నుఁ॥

తప్పించుకొనఁగానే తరుణి చన్ను లంటేవు
ఇప్పుడేఁటి కనవు నీ యెమ్మె మానవు
ముప్పిరిఁ జుట్టమవైతే ముందువెన కెంచవద్దా
చెప్పరాని దొరవైతే చేఁత సేయఁదగునా ॥నిన్నుఁ॥

తెరవేసుకొనఁగానే దీకొని ఇంతిఁ గూడేవు
అరిదిపడవు సారె నంటువాయవు
ఇరవై శ్రీ వేంకటేశ యేలితివి మమ్మునెల్లా
సరసుఁడ వింతేసి వేసాలు సేయఁదగునా ॥నిన్నుఁ॥ **71**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో ఆయన స్వామి చెలికత్తెయై యేమంటున్నారో వినండి. ప్రభూ! నేడు నిన్ను చూస్తే మాకందరికీ ఆశ్చర్యంగా వున్నది. నీవు సామాన్యుడవా? అగ్రగణ్యుడవు. అట్టి నీకు ఇంత సేయదగునా? కొంచెం మేము చెప్పేది వినవయ్యా! నీ చెలియ(దే) సిగ్గువడగానే ఆమెపై చెయ్యివేసి నీదగ్గరకు తీసికొనెదవు. ఎవ్వరైనా వుంటారని కూడా యెఱుగవా? నీ మోహము అగ్గలమైనా (అధికమైననూ) నడుస్తున్న వారిని చూడవద్దా? నీవు మగవాడివి కదా! ఇంతకు సిద్ధపడుటతగునా? ఆమె నిన్ను తప్పించుకొనబోతే కుచయుగ్మమునంటేవు. ఎప్పుడేమిటో చూడవు. నీవిలాసములు మానవు. నీవెంత ఆమెకు మేనబావవైనా, ముందూ వెనుకా చూసుకోవద్దా? నీవు సలహాలు చెప్పదగని నాయకుడవు. నిజమే కాని, ఇటువంటి సేతలు చేయదగునా. స్వామీ! తెరచాటు మూసీమూయగానే తెంపరివై ఇంతిని గూడెదవు ప్రతిసారీ వెనకాడక కౌగిలినొదలవు. సుస్థిరుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! మమ్మందరినీ యేలినావు. నీవు సరసుడవు కదా! ఇంతేసి చిలిపిపనులు నీకు తగునా?

★ **అరిదిపడవు** – వెనకాడవు ★ **ముప్పిరి** – వెంటబడునట్టి

సంఖ్య : 379 సంపుటము : 17 పుట: 219 రాగం : సామంతం

**43 వెడకూటములకంటె విరహమే మేలు**
**విడువక యాడఁబోతే వేసటౌరా మాటలు ॥పల్లవి॥**

**కోరి దవ్వులనుండఁగఁ గొండలు నున్నన గాని**
**చేరితేను చెట్లునుఁ జేమ లింతేరా**
**వారక కొక్కకవేళ వచ్చి పోవుటే చవి**
**నారి నిన్నుఁ గొసరితేఁ జప్పనౌరా రతులు ॥వెడ॥**

**వొక్కటై పసపునీడ నుండఁగాఁ బచ్చనఁ గాని**
**పక్కన నెండ నుండితేఁ బస లేదురా**
**తక్కక యడమాటలే తరితీపై వుండుఁ గాని**
**మిక్కిలి దగ్గరుపొందుమీఁద మొగచాటురా ॥వెడ॥**

**వొనరుఁ గోవిల కాకి నొక్కవన్నె వుండుఁ గాని**
**యెనసి వసంతవేళ నేరుపడురా**
**ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను,**
**తనువులే వేరు గాని తలఁపు లొక్కటేరా ॥వెడ॥ 379**

**భావపరిమళం :**
పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగారకీర్తనలో నాయిక విసిగిపోయి స్వామితో యేమంటున్నదో వినండి. నీవు మాతో జరిపే వ్యర్థమైన కూటములకంటే నీవలన కలిగే విరహబాధే మేలు సుమా! విడువకుండా నీవు మాట్లాడే నిరుపయోగమైన మాటలను వింటుంటేనే విసుగుగా వున్నదయ్యా నాకు. ప్రభూ! దూరంనుండి చూస్తే కొండలు నున్నగానే కనబడతాయి. దగ్గరకు వెళ్తేనేముంది చెట్లూ చేమలూను. అంతేకదా! విడువక అప్పుడప్పుడూ వచ్చిపోతుంటేనే, నీకు “రుచి”గా వుంటుంది. నిన్ను ఆడది కొసరి కొసరి రతికావాలంటే అది చప్పగానే వుంటుంది తమరికి. దేవా! పసపునీడలో (సమృద్ధిగానున్న నీడలో) మోసగాడైన విటునితో వుంటే, యెండలోవున్నట్లే. దానిలోపసలేనే లేదురా! విడువక వాడు జరిపే వ్యర్థమైన ప్రసంగాలకంటే వాడితో పొందునకు మొగము చాటుగా వుండుటయే మేలు. స్వామీ! కాకి కోకిలా రెండూ ఒకే రంగులో నల్లగా వుంటాయి. కాని వసంతవేళ వచ్చినదంటే కోకిలమధురంగా కూస్తుంది, కాకి దుస్సహంగా అరుస్తుంది. ఘనుడవైన వో శ్రీవేంకటేశ్వరా! నన్నీ విధముగా కలిసితివి. నీకు నాకుతనువులు వేరువేరేగా తలపులు వొక్కటే, ప్రియా!

★ **తరితీపు** – వలపు ★ **బచ్చన** – వంచన





సంఖ్య : 133 సంపుటము : 28 పుట: 28 రాగం : దేసాళం

**44 చాలుఁ జాలు మాతోను సటలేఁటికి**
**కోలు ముందుగా మాతో గుట్టు సేయవలెనా ॥పల్లవి॥**

**పంతగాఁడవు నీమోవి పచ్చి ఇంతేటికాయ**
**చింతలేనివాఁడవేల చెమరించేవు**
**బంతినున్నా రిద్దరును భావములు గానవచ్చె**
**కొంత గొంత మాతోను గుట్టుసేయవలెనా ॥చాలుఁ॥**

**మనసుగలవాఁడవు మాటలేఁటికాఁడవు**
**కినిసినవాఁడవేల కిందుపడేవు**
**పెనఁగేరు మీలోని ప్రియమెల్లఁగానవచ్చె**
**కొనబుఁజేఁతల మాతో గుట్టు సేయవలెనా ॥చాలుఁ॥**

**తమకించనివాఁడవు తగవులేల పెట్టేవు**
**తెమలనివాడవేల తేరి చూచేవు**
**అమర శ్రీవేంకటేశ ఆపె నన్నుఁ గూడితివి**
**గుమతాన మాతో నింత గుట్టు సేయవలెనా ॥చాలు॥ 133**

**భావపరిమళం :**
అన్నమయ్య చెప్పిన ఈ సరసశృంగార కీర్తనలో ఆయన దేవితోను, స్వామితోను యేమంటున్నారో వినండి. నాతో ఈ సటలు (కపటములు) దేనికి? చాలుజాలును. కోలుముందుగా (మునుముందుగా) మాతోకూడా గుట్టుసేయదగునా (మోసము చేయవచ్చునా?) స్వామీ! నీవేమో పంతగాడవు, నీమోవి (అధరము) ఇంతపచ్చిగా (గాయపడినట్లు) యెందుకయింది? నీవేనాడుచింతనుయెరుగని వాడవే మరి ఈ నాడెందుకు చెమటలు కక్కుతున్నావు? మీరిరువురూ భోజనబంతిలో మీమనోభావాలు మాకు కానవచ్చుచున్నవి. మాతోకూడా కొంత మోసంతో దాచవచ్చునా? ప్రభూ నీవు మనసున్న మారాజువు కదా! మరి ఆమెతో మాటాడవేమి. ఒకవేళ అలిగినవాడివి, యేల అంత లొంగిపోయెదవు? మీరు పైకి పోరాడినట్లున్నా ఒండొరులపై మీ ప్రేమ కనబడుతూనేవున్నది. సొగసైన మీ చేతలు మాతో రహస్యంగా వుంచదగునా? స్వామీ! మమ్మల్ని తన్మయత్వంలో ముంచినవాడవు మా ఇరువురి మధ్య తగవులెందుకు పెట్టెదవు? మావలన చలించని వాడవు మమ్మల్నేల తేరిపారచూస్తావు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు ఆమెను నన్నునూ కూడితివి. ఇట్టి కుమతివై మానుంచి ఇంత దాచతగునా?

★ **కొనబు** – సొగసైన ★ **తెమలని** – చలించని

సంఖ్య : 55    సంపుటము : 10-2  పుట: 32    రాగం : భైరవి

**45** తనువె యిక్కడఁ గాని తలఁపెల్లా నక్కడనె
మనసులో నాపె నింక మానసైనఁ గలవా ॥పల్లవి॥

మాయింటాడ నిచ్చకపు మాఁట లాడే వింతే కాక
వోయీ నీ వాపెఁ బాసి వుండ నోపేవా
ఆయెలే మాముందటను ఆసము దించవు గాక
చేయార నీవె యాపెను చెనక కుండేవా ॥తనువె॥

మానలేనివానివలె మన సరసేవు గాక
ఔనా ఆపె వడ్డించ కారగించేవా
తేనెలమాఁటలఁ దరితీపులు సేసేవు గాక
కానీలెయాపెపై తమకమె పట్టఁగలవా ॥తనువె॥

యీపొద్దుకు నాకాఁగిలి యింపాయ ననేవు గాక
పో పో నీవాపెఁ దలపోయ కుండేవా
కాపాడి నన్నును శ్రీవెంకటనాథ కూడితివి
మాపొందులాపెవద్దను మఱవఁగఁ గలవా. ॥తనెవె॥ **55**

**భావపరిమళం :**

ఇది తాళ్ళపాక చినతిరుమలయ్య వినిపించిన సరస శృంగార సంకీర్తన. ఆయన వేంకటనాథుని ప్రియురాలై స్వామితో యేమంటున్నారో వినండి. ప్రభూ! నీ తనువే ఇక్కడ వున్నది గాని నీ తలపంతా ఆమె(దేవి)దగ్గరనే వున్నది.నీమనస్సులో ఆమెవుంటే ఆమెను మాననైనా గలవా? మానలేవు. మాఇంటిదగ్గిరయేవో మా ఇచ్చకపు మాటలు చెబుతావు. ఓయీ! నీవామెను విడచియుండగలవా? బాగా అయిందిలే, మాముందట మాత్రం నీ అసము (దర్పమును) వదలవు. నీ చేతులతో నీవే ఆమెను స్పృశించకవుండేవా? ఆమెను (దేవిని) మానలేని వానివలె మనసులో దిగులు చెందెదవు. ఔనా? ఆమె భోజనం వడ్డించకుండా యెన్నడన్నా ఆరగించావా? తేనెలూరే నీ తీపి మాటలతో ఆమెని సంతోషపెట్టెదవు. కానీలేవయ్యా! ఆమెపై నీ మైమరపును ఆపుకోగలవా? ఓ శృంగారరాయా! ఈపూట నా కౌగిలిలో నలిగిపోతూ నావద్దనే బాగున్నది అంటావు. పోపోవయ్యా!నీవామెను తలచక వుండగలవా?నన్నునూ కాపాడిన శ్రీవేంకటేశ్వరా! నన్నూ కూడితివి. నిజం చెప్పు స్వామీ! నాపొందును నీవు ఆమెవద్ద మరువగలవా?

★ **తరితీపులు** – సంతోషములు ★ **ఇచ్చకము** – ముఖప్రీతి మాట





సంఖ్య : 134  సంపుటము : 28  పుట: 90    రాగం : మాళవి

**46** ఏఁటికి సిగ్గువడేవు ఇంకా నీవు
గాఁటపు నీమోహనము కడగురుతులేదే ॥పల్లవి॥

బలిమి నీజవ్వనమే పట్టఁగరాదుగాని
అల నీ చన్నులు వట్టే దదేమి దొడ్డే
చలపట్టి పంతములు సారె నాడరాదుగాని
మలసి నీ మర్మముల మాట లాడవచ్చునే ॥ఏఁటి॥

వల పింతంతని చెప్పవశముగాదుగాని
కొలఁదివట్టేనే నీయెక్కువ పిరుఁదు
విలువ వెట్టఁగరాదు వేయైనా నీవేడుకకు
తులఁదూఁచవచ్చు మనదొమ్మి సమరతులు ॥ఏఁటి॥

పెనఁగేటి నీగుట్టు భేదించరాదుగాని
చెనకి పోఁకముడి మచ్చికఁ దీసేనే
యెనసితి శ్రీ వేంకటేశుఁడ నయిన నాకు
చనవిచ్చితివి ఇన్ని సాదించవచ్చునే ॥ఏఁటి॥ **134**

**భావపరిమళం :**

అన్నమయ్య విరచితమైన ఈ సరస శృంగార కీర్తనలో రమణుడు దేవితో యేమంటున్నారో వినండి. దేవీ! ఇన్నాళ్ళ మన దాంపత్యంలో ఇంకా యెందుకు అంత సిగ్గుపడెదవు? గాఢమైన మోహాతిరేకము ఆసాంతము నీకు గురుతులేదా యేమి? దేవీ! బలవంతమైన నీ యౌవనమును పట్టుట సాధ్యమా? అందుచేత నీకుచగిరులను పట్టెదను. అదేమి గొప్పకాదా? తరుణులు పగవారివలె ప్రతిసారి పతితో పంతములాడరాదు కానీ, మరలి నీవు మాటలను మర్మముతో నాకు చెప్పవచ్చును కదా! ప్రియా!నీపై నావలపింతింత అని యే పోలిక చెప్పమందువు? నీయొక్క ఘన నితంబములను చూపి "ఇంత" అని చెప్పమందువా? అసంఖ్యాకంగా వున్న నీ వేడుకలను విలువగట్టలేము. కాని మన దొమ్మిసమ రతులను (సందడితో కూడిన మన ఉపరతులను) యెంచవచ్చును? దేవీ! మదనతాపమున నీ మనోభావముల గుట్టు భేదించనసాధ్యమే, కాని మచ్చిక జేసి నీవలువ పోకముడి సడలించగలను. అతిశయించిన శ్రీవేంకటేశుడనయిన నాకు ఇంత చనువునిచ్చావు. ఇక నీవు సాధించలేనిదేదైనావుంటుందా?

★ **గాటపు** – అధికమైన ★ **వేయైన** – అసంఖ్యాకమైన

సంఖ్య : 409 సంపుటము : 17 పుట: 236 రాగం : శ్రీరాగం

**47 సిగ్గులు వడుదువు నే మివి చెప్పిన ని న్నాళ్లయితే**
**అగ్గలమై కలిగెఁగా అన్నియు నీయంతనే ॥పల్లవి॥**

**తురుమునరాలెడి పువ్వుల తొరిగేటి సెలవుల నవ్వుల**
**అరవిరియై వచ్చే విదె ఆతనికడనుండి**
**గరిమల నీయందే యివి కంటిమిగా నేఁడైనా**
**సమరతాంతపుసింగారము చూపేవా మాకు ॥సిగ్గు॥**

**చెక్కులచెమటలజారుల చంద్రికమోవుల తీరుల**
**అక్కరదేరుచు వచ్చే వాతనికడనుండి**
**చక్కని నీయంద మరఁగ సంతస మైతిమిగా యిటు**
**మిక్కిలి మరు సామ్రాజ్యము మెఱసేవా యిపుడు ॥సిగ్గు॥**

**రతులనే చొక్కిన మరపుల రచనల సరసపు టొరపుల**
**అతివేడుకతో వచ్చే వాతని కడనుండి**
**అతఁడదే శ్రీవేంకటేశుఁడు అటు నినుఁ గూడిటు వచ్చెను**
**గతులను మామీఁదట మీకరుణలు చల్లేరా ॥సిగ్గు॥ 409**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య వినిపిస్తున్న ఈ సరస శృంగార కీర్తనలో తానొక చెలికత్తెయై, స్వామి పడకగదిలో నుంచి వచ్చిన దేవితో యేమంటున్నారో వినండి. ఏమమ్మా! మేమిన్నాళ్ళూ చెప్పినదంతా యేమైనది? ఇంకా ఆతనిముందు యేలసిగ్గుపడెదవు? నీవేమి చెప్పనక్కరలేదు చూడవలసినవన్నియు నీయందే అగ్గలమై (మెండుగా) కానవచ్చుచున్నవి. దేవీ! నీ కొప్పునుండి పువ్వులు రాలిపోతున్నాయి. పెదవులపై నుండి చిరునవ్వులు స్రవిస్తున్నాయి. నేడీ అరవిరి సొబగులన్నీ నీయందే కంటిమి. మాకు నీవు సురతి యనంతరము కానవచ్చే సింగారములన్నీ చూపుచుంటివా యేమి? దేవీ! నీ చెక్కిళ్ళపై నుండి చిరుచెమటలు జారిపడుతున్నాయి. అధరములపై దంతక్షత చంద్రికల తీరుతెన్నులు చూస్తుంటే ఆతని వద్దనుండి "అక్కర" తీరిన పిదప వచ్చితివని ఇట్టే తెలియుచున్నది. చక్కటి నీయందమును కని సంతసించితిమి. మన్మథుని సామ్రాజ్యమున మిక్కిలి తళుకులీనెదవా? దేవీ! రతిలో అలసిన తరుణికి మతిమరపులు సహజమే. సరసముతో కూడిన హత్తుకొనుటవంటి రచనలు అతి వేడుకతో ఆతని వద్దనుండి నేర్చినట్లున్నావు. అదిగో ఆతడే శ్రీవేంకటేశ్వరుడు. ఆ విధముగా నిన్నుకూడి ఇటు నావద్దకు వచ్చినాడు. ఆరీతి మాపై కరుణ చల్లితిరా మీరిరువురూ?

★ **తొరిగేటి** – స్రవించునట్టి ★ **అరవిరి** – సగము విరిసిన





సంఖ్య : 205 సంపుటము : 28 పుట: 138 రాగం : గుజ్జరి

**48 మాతోడఁ దనకేల మచ్చరములు**
**పోతరించి తానేల పుల్లసిలీనే ॥పల్లవి॥**

**మలసి మమ్మేల దూరీ మగఁడైనవానిఁ దానే**
**వలపించవలదా వనితైతేను**
**వెలయ నాతఁడు నావెంటవెంటఁ దిరిగితే**
**కలికి తానేల యింత కాఁకరేఁగీనే ॥మాతో॥**

**సవతులఁ దానేల సాదించీ నాతనినే**
**యేవలఁ బోకుండా భ్రమయింపించరాదా**
**రవళి నాచెప్పినట్లు రమణుఁడు సేసితేను**
**చివుకునఁ దానేల చిమ్మిరేఁగీనే ॥లల॥**

**అండనున్నవారినేల అద్దలించీ నాయకుని**
**బందు బందు సేసి యట్టె పట్టుకోరాదా**
**దండి శ్రీ వేంకటేశుఁడు తానే నన్నిటు గూడె**
**బెండుపడి తానేల పెచ్చురేఁగీనే ॥మాతో॥ 205**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరసశృంగార కీర్తనలో ఆయన స్వామి ప్రియురాలై తన చెలియతో యేమంటున్నారో వినండి. చెలీ! మాతో తనకు (దేవికి) మాత్సర్యమేలనే? పోతరించి (మదించి) తానేల వివర్ణురాలయ్యానే! చెలీ! ఆవిడ (దేవి) మమ్మెందుకు నిందిస్తున్నదే? తన మగడితో తనను వలపించుకోవాలిగాని వనితైతే తాను అందరినీ నిందించవచ్చునా? ఆతడు నన్ను ఇష్టపడి నావెంట తిరిగితే తానెందుకు మండిపడవలెనే? చెలీ! అందరూ తన సవతులవుతున్నారని తానేల నాబోటివారిని సాధించవలెనే? అతగాని నేయెక్కడకు బోకుండా తనవద్దనే వుండేట్లు భ్రమల ముంచి తనకే కట్టేసుకోవచ్చును కదా! రమణుడు నాపై మక్కువతో నేను చెప్పినట్లు చేస్తే తానేల చివుక్కుమని చిరుబురులాడీనే? చెలీ! మమ్మల్ని ఆ దేవిగారే "బందుబందుసేసి" (పటాపంచలు చేసి) తన మగనిని అదిలించి పట్టుకొని వుండవచ్చును కదా! ఆ శ్రీవేంకటేశ్వరుడు, తానే నన్ను కూడినాడు. మధ్యలో ఈ దేవి తానేల బెండుపడి చెలరేగిపోతున్నదే?

★ **నాయకుని** – మగనిని ★ **బెండుపడి** – బలహీనపడి

సంఖ్య : 63 సంపుటము : 10-2 పుట: 36 రాగం : సామంతం

**49** ఆఁటదానఁ గనక నే నాసలు మానలేఁ గాక
యేఁటికి మాచక్కఁదనా లింపు గాని నీకును. ‖పల్లవి‖

వాడికైననాఁటికి వలతు వింతే కాక
నేఁడుబాసలచెల్లించ నీ కేలయ్యా
వాడుదేరుకూలికి వలచిన వలపులు
యీడేరించుకొనేది యింత పిన్నపనులా ‖ఆఁట‖

పనిగల యప్పుడెల్లాఁ బైకొందు వింతే కాక
ననిచి యెప్పుడూ నేల నడపేవయ్యా
చెనకి గడ్డాయముగాఁ జేసినబాస లెల్ల
అనువుగా నడపఁగ నల్లాడఁ బడెనా ‖ఆఁట‖

చిత్తము నిలుప లేక శ్రీవెంకటనాథుఁడ
హత్తి కూడితివి గాక అల పేలయ్యా
కొత్తగాఁ దమకమునఁ గూడినకూటమెల్లా
తత్తరపడక యుండఁ దమయిచ్చులా. ‖ఆఁట‖ **63**

**భావపరిమళం :**

చినతిరుమలయ్య వినిపించిన ఈ సరస శృంగార కీర్తనలో నాయిక యేమంటున్నదో వినండి. ప్రభూ! నేనాడదానిని గనుక ఆశపడటం నా నైజం. దానిని నేను మానలేను. నీకు ఇంపుగాకున్నచో మా సౌందర్యం యేటికి(యెందులకు)? శుద్ధ నిరుపయోగం, సుమా! స్వామీ! నీకు అలవాటైతే వలచెదవు. అంతేకదా! మనతొలి వలపులనాటి బాసలు నీకెందుకు గుర్తుంటాయి? వాడిపోయిన కూలికి వలచిన వలపులు ఇలాగేవుంటాయి. వాటిని ఈడేరించుకోవాలని ప్రయత్నిస్తే పిల్లవేషాలుగానే అనిపిస్తాయి. నీకు పనిబడ్డప్పుడు నన్ను ఆక్రమించుకొంటావు. ననిచి (ప్రీతితో) యెప్పుడూ యేల వంచనలను నడపెదవయ్యా?ఒత్తిడితో గడ్డాయముగా (బలవంతంగా) చేసిన బాసలు నీ అనువుకు తగినట్లు నడిపితే కష్టము కలుగదా? ఓ శ్రీవేంకటేశ్వరా! నీ మనస్సును నిలుపుకోలేక హత్తుకొని కూడితివి కదా! అలపేలనయ్యా? నూతనమైన తమకముతో కూడిన కూటమి తత్తరపడకయున్న తన్మయత్వమునీయ జాలదా?

★ **వాడడుదేరు** - వాడిపోయిన ★ **అల్లాడ** - కష్టము



హరి సేవకే వేంకటేశ మకుటం

సంఖ్య : 408 సంపుటము : 17 పుట: 236 రాగం : శ్రీరాగం

**50** ఇన్ని సగినములు యింతికి మేలు
విన్న కన్న చెలు లెల్లా వెఱవకు రమ్మా ‖పల్లవి‖

విరహతాపముచేత విసిగిన చెలియకు
వెరపునఁ జల్లగాలి వీపు గాపు
సరుస నిండుమనసు చంచల మైనందుకు
యిరవైన కోవిలల యెలుపే నిలుపు ‖ఇన్ని‖

వలపుల చింతచేత వడి బడ్డఁ మగువకు
చెలఁగి వెన్నెలతేని చిచ్చేసిరి
నిలిచి విబునివద్ద నెయ్యము చల్లేవేళ
తెలిఁజన్నుజక్కవల తీరే మిక్కిలి ‖ఇన్ని‖

గక్కఁగూడిన శ్రీవేంకటపతి రతివేళ
గుక్కనిచిలుకపలుకులే దిక్కు
పక్కన నితనిమీఁది పాటలు వాడుటకు
వొక్కటఁ దుమ్మెదమోఁత వుపశ్రుతులు ‖ఇన్ని‖ **408**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో ఆయన దేవి చెలికత్తెయై తోటి చెలులకు ధైర్యం చెబుతున్నారు. ఇవన్నీ శుభశకునములే. ఇవి ఈ దేవికి తప్పక మేలు చేస్తాయి. వీటి గురించి విన్నవాళ్ళుగాని, చూచినవాళ్ళు గాని పెద్దగా ఆశ్చర్యపోకండమ్మా!ఇదివినండి విరహతాపముతో విసిగిపోయిన ఈ చెలికి (దేవికి) ఆశ్చర్యకరముగా చల్లటిగాలే వడగాడ్పు వీస్తున్నట్లున్నది. మన సరసననే వున్నప్పటికీ ఆమె మనస్సు చంచలమైనందున కోయిలల తీయని రాగములే ఆమెకు యెలుగెత్తిన అరుపులవలెనున్నవి. వలపుల తలపులతో వడిలిన వనితకు వెన్నెలరేయి చిచ్చేసిన రేయిలా (మంటలు రేపు రాత్రిలా) తోచుచున్నది. తన విభునివద్ద అనురాగము ప్రదర్శించువేళ జక్కువపిట్టల వంటి జవ్వని చనుదోయితీరే మిక్కిలి అచ్చెరువునొందించుచున్నది. శ్రీవేంకటేశుడు చటుక్కున కూడు రతిసమాగమమున చిలుకపలుకులే ధైర్యం చెప్పేదిక్కు. చివరికి ఈ చెలి తన విభునిపై శృంగార గీతికలు పాడుటనారంభించగానే అక్కడి తుమ్మెదల ఝుంకారము పక్కవాయిద్యములై ఒడబడినవి. స్వామి మనస్సు నలంకరించినవి.

★ **ఉపశ్రుతులు** - ఒడబడినవి ★ **వెరవున** - ఆశ్చర్యముతో

సంఖ్య : 140 సంపుటము : 28 పుట: 94 రాగం : ఆహిరి

**51** ఎంతకు నెంతేకాక యెక్కుడేఁటికి
మంతనాన బుద్ది చెప్పి మన్నించరాదా ॥పల్లవి॥

కన్నుల నీవు చూచితే కామిని యందుకుఁ బతి
చన్నుల నొత్తినదె సరియాయను
సన్నల నింకానేల చలములు సాదించేవు
కిన్నెర యదిగో మీఁటి గిలిగించరాదా ॥ఎంత॥

పలుకుల నవ్వితేను పడఁతి యందుకు నీతో
సెలవుల నవ్వినదే సెలవాయను
మలసి యప్పటి నేల మారుకొనఁ దలఁచేవు
వలపు చిత్తరువున వా(వ్రా?) సిచూపరాదా ॥ఎంత॥

ముట్టి నీవు చెనకితే మోహము రెట్టించ నాపె
పట్టి పెనఁగినదే బలువాయను
యిట్టె శ్రీవేంకటేశ యిరవై యిఁకఁ బాయవు
గట్టిగా తలఁపు దీర కప్పుర మీరాదా ॥ఎంత॥ **140**

**భావపరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస కీర్తనలో తాను స్వామి చెలికత్తెయై ఆయనతో యేమంటున్నారో వినండి. స్వామీ! పంతానికిపోయి, యెంతకునెంతేకాక (ఆమె యెంత అంటే అంత అని) నొప్పించుటకు బదులు యేకాంతమున బుద్ధి చెప్పరాదా (హితమును బోధించరాదా?) స్వామీ! నీవామెను కన్నులతో మనోహరముగా చూచినావు. దానికి ప్రతిగా ఆ కామిని తన చనుగవతో నిన్నునొత్తినది. సరికి సరి అయినది. సంధ్య పొద్దు ముగియబోతుంటే సైగలతో ఇంకా నీకీపంతము సాధించుటలేలనయ్యా? అదిగో ఆ కనబడుతున్న కిన్నెర (వీణ)ను మీటి చక్కిలిగింతవలె పులకింపజేయరాదా? స్వామీ! నీవు మాటలలోనే నవ్వితే అందుకు ప్రతిగా ఆ పడతి అరవిరిసిన పెదవులతో నవ్వుతుంది. మరల ఆమెను యేల మారుకొనదలచేవు (యెదిరించుటకు సిద్ధపడెదవు?) వలపుతో ఆమె చిత్తరువునుచిత్రించి చూపరాదా? ప్రభూ! నీవు ఆమెను చెనకితే (తాకితే) మోహము రెట్టింపై ఆమె నిన్నుపట్టి పెనగులాడినది. అదే బలప్రదర్శన అయినదా నీ దృష్టిలో. ఓ శ్రీవేంకటేశ్వరా! సుస్థిరుడవై ఇక నీవామెను విడచివుండలేవు. తలపులన్నీ నెరవేరుటకు నీవు వెంటనే ఆమెకు కర్పూరతాంబూలమును అందించరాదా?

★ **సన్నల** – సౌజ్ఞలతో ★ **కప్పురము** – కర్పూరతాంబూలము





సంఖ్య : 62 సంపుటము : 10-2 పుట: 36 రాగం : మాళవిగౌళ

**52** ఇంచుక యస మిచ్చితే యెవ్వరూ నేల మానేరు
కొంచేవా నీ విఁకఁ గోన చెన్నరాయఁడ ॥పల్లవి॥

మొగము చూచి వలచి ముందు ముందె నీకుఁ గేలు
మొగిచి మొక్కినదె మోస మాయఁగా
సగముచూపులఁ జూచి జాణతనా లాడేవు
తగునా చేఁతకు నీచేఁతలు వో విభుఁడా ॥ఇంచుక॥

కలికి నీచేఁతలకు కాఁక రేఁగి నాకు నేనె
నిలిచి మాటాడినదె నేర మాయఁగా
చిలుకుగోళ (ళ్ల) నూఁది చేరి సరస మాడేవు
తలఁపనందుకు నీవు తగునయ్య విభుఁడా ॥ఇంచుక॥

అగ్గలపు వేడుకతో నలపు దీర నీమీఁద
దగ్గరి చేయి చాచుటే తగు లాయఁగా
వెగ్గళించి కూడితి శ్రీవెంకటనాథుఁడ నన్ను
సిగ్గుదీర నిదె కోన చెన్నరాయఁడ వై. ॥ఇంచుక॥ **62**

**భావపరిమళం :**

చినతిరుమలయ్య గోన చెన్నకేశవునిపై చెప్పిన సరస శృంగార కీర్తనాలకించండి. ఓ గోన చెన్నకేశవా! నీకు ఇంచుకంత అనురాగమునిస్తే చాలును నీవు నన్ను నీ వలపులలో బంధిస్తావు. నీ ఈ అలవాటును నీవెందుకు మానుకుంటావు? కొంచేవా నీవు (నీవు సంకోచిస్తావా, యేమి?) నీ మొగమును చూచినంతనే నిన్ను వలచాను. ముందు ముందే నీకు మొక్కెదను. నీ దృష్టిలో అదే మోసమై పోయిందా? అర్ధనిమీలితనేత్రుడవై నావద్ద నీ జాణతనం ప్రదర్శిస్తున్నావు. ఓ విభుడా! నా చేతలకు (వలపునకు) నీ చేతలు తగినట్లున్నవా? ప్రభూ! నీ అందమైన చేతలకు కాఁకరేగి (మదనాతురనై) నాకు నేనే నీకు యెదురై మాటలాడితే,అదే నీదృష్టిలో నేరమై పోయిందా? ఓ విభుడా! చిలుకగోళ్ళవంటి గోళ్ళున్న నీవువాటితో నన్ను గీరి నా సరసకు చేరి సరసమాడేవు. ఆలోచిస్తే నీవట్లు చేయుట యుక్తమేనా? మెండైన వేడుకతో నా శ్రమదీరునట్లు నీపై చేయివేసినంత మాత్రాన నీకు లోనైనట్లేనా? ఓ శ్రీవేంకటనాథా! నీవు నన్ను అతిశయముతో సిగ్గుతీరా కూడుటకు, ఇదే కోన చెన్నరాయడవైనావు.

★ **అగ్గలము**– మెండైన ★ **వెగ్గళించి** – అతిశయించి

సంఖ్య : 39   సంపుటము : 17   పుట: 27   రాగం : పాడి

**53 ఏమనేము నిన్నుయెగసక్కేఁడ విన్నిటా**
**ఆముకొన్న సటకాఁడ వౌదువయ్యా** ॥పల్లవి॥

**మాటలాడవచ్చుఁగాక మనసులో కాఁతాళము**
**మూటగట్టవచ్చునా ముందరఁ దెచ్చి**
**సూటిచేసి నావలపు చూపుమనే వెదుటను**
**నీటు జాణతనాలు నేర్తువయ్యా నీవు** ॥ఏమ॥

**మొక్కు మొక్కవచ్చుఁ గాక మొగముపై నగవులు**
**మక్కు వేయ వచ్చునా మాపుదాఁకాను**
**అక్కరైన నావలపు లంగడిఁ బెట్టేవు నీవు**
**దిక్కులెరిఁగినయట్టి దిట్టవయ్యా నీవు** ॥ఏమ॥

**పొంది కూడవచ్చుఁ గాక పొంచి పొంచి మోవితేనె**
**బిందెఁ బోయవచ్చునా పెక్కుమాటలు (ల?)**
**ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి**
**కందు వెరిఁగిన యందఁగాఁడవయ్యా నీవు** ॥ఏమ॥ **39**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో ఆయన స్వామి వలపుకత్తెయై యేమంటున్నారో వినండి. స్వామీ! యెగసక్కెములు (వేళాకోళములు) ఆడుట నీకలవాటు. నిన్ను యేమనగలము? ఆముకొన్న సటకాడవు (అత్యధికమైన మాయగాడవు). నేను నీతో యెన్ని మాటలు చెప్పినా, నా మనస్సులోని కాతాళము (కోపము)ను ముందుకుదెచ్చి బయటపెట్టగలనా? ఎంతటి జాణతనాలు చూపుతున్నావయ్యా?తిన్నగా నావలపుచూపమంటావే, అదెట్లా సాధ్యమవుతుంది. ప్రియుడు ప్రేయసిని ప్రసన్నురాలను చేసికొనుటకు అనేక మాయ నమస్కారములు పెట్టవచ్చును గాక! మొగముపై నవ్వులు పులుముకొని వుండవచ్చును గాక! నీ అక్కరదీర్చిన నా వలపులను బజారులో బెట్టినావు. ఇంతా చేసి దిక్కులెరిగిన (ఎటు తప్పించుకోవాలో తెలిసిన) గట్టివాడవు స్వామీ! నీవు. ప్రభూ! నిన్నువలచిన బేలను తేలికగా పొంది ఆమెను కూడగలవు. ఎన్నోతీపి మాటలు చెప్పి ఆమె వలపును బిందెబోయవచ్చునా? ఇంతమంది వలపుకత్తెలు నీకుండగా, ఓ శ్రీవేంకటేశ్వరా! నన్నుయేలినావు.నీవు సమయానుకూలంగా యెప్పుడేమి చేయాలో తెలిసిన అందగాడివయ్యా!

★ **సూటిచేసి** – తిన్నగా ★ **బిందెబోయు** – క్రుమ్మరించు





సంఖ్య : 378  సంపుటము : 17  పుట: 218  రాగం : సామంతం

**54 ఇంతటి నీ చక్క దన మీలాగు నేరుపులు**
**చెంతల నేమని యింకఁ జెప్పుదుమే చెలియా** ॥పల్లవి॥

**ముత్తెపుఁబలువరుస మొగిఁ దెల్లఁగాఁ దోమి**
**జొత్తుల వీడెలు సేసి సొమ్ములతోడ**
**హత్తి చిఱునవ్వు నవ్వి అప్పుడే విభునివేలి**
**కొత్తవుగరము దీసుకొంటి వౌనె చెలియా** ॥ఇంతటి॥

**తద్దిన నొసలిగీరుఁదిరుమణి గానరాగా**
**కొద్దిఁ జిగుళ్ళు వెళ్ళినకొప్పుతోడ**
**అద్దపునెమ్మోము చూపి అతనిమై గరఁగించి**
**ముద్దు మోమిచ్చి మోహము ముంచితివె చెలియా** ॥ఇంతటి॥

**వలుదచన్నులమీఁదివలిపెము చెమటలఁ**
**బలుచఁగా నంటిన భావముతోడ**
**చలివాయఁ కౌగలించి సమరతులనే నీవు**
**కులికి శ్రీవేంకటేశుఁ గూడితివె చెలియా** ॥ఇంత॥ **378**

**భావపరిమళం :**

పెదతిరుమలయ్య ఈ సరస శృంగార కీర్తనలో తాను దేవి చెలికత్తెయై ఆమె సొబగులను కీర్తిస్తున్నారు. ఆలకించండి. ఓ దేవీ! ఇంతటి నీ చక్కదనము, నీ లాగు (ఆకర్షణ), నీ జాణతనము అనన్య సామాన్యము. చెలియా! ఇంక వాటిని నీవద్ద యేమని వర్ణింపగలమమ్మా! అయినా ప్రయత్నిస్తాము, వినవమ్మా! చెలియా! తెల్లగా తోమిన నీ పలువరుస మంచి ముత్యములవలె మెఱయుచున్నవి. తాంబూలముచేత నోరు ఎఱ్ఱబారినది. సొమ్ముల (ఆబరణముల)తో అలంకరించుకొనినావు. పొందిక గలిగినచిఱునవ్వుతో నీ ప్రియుని వేలి కొత్తవుంగరమును ఆనాడే గ్రహించినావు కదమ్మా! చెలియా! నీవిభుడు ప్రేమాతిరేకమున నీనుదుటిపై జేసిన గోటిగీరు నీకు దిద్దిన తిరుమణి (నొసట బెట్టిన నామము) వలెనున్నది. సన్నని నీ చిగుళ్ళు ముచ్చటగానున్నవి. నీ కొప్పు కొద్దిగా సడలినది. అద్దమువలె మెఱయుచున్న నీ నెమ్మోముజూపి ఆతని తనువునేనాడో కరిగించినావు. ఈనాడు ముద్దులొలుకు నీమోమునుజూపి మోహమున ముంచినావు గదమ్మా! స్థూలమైన చనుగవలమీది వలిపెము (సన్నని తెల్లని వస్త్రము) చెమటవలన అంటుకుపోతుందేమో అన్న భావముతో, తడివలన కలిగిన చలి తగ్గుటకు బిగికౌగలించినది. చెలియా! అటువంటి వైభవముగల నీవు శ్రీవేంకటేశ్వరుని సమరతుల గూడితివి కదమ్మా! ధన్యురాలివి. (పెదతిరుమలయ్య తండ్రికి తగ్గ తనయుడే సుమా!)

★ **వలుద** – స్థూలమైన ★ **మొగి** – పూనికతో

సంఖ్య : 54 సంపుటము : 10-2 పుట: 31 రాగం : మాళవిగౌళ

**55 మంచితనము ల దెట్టు మరచీనయ్యా**
**మంచముపై నున్న నెట్టు మరచీనయ్యా** ॥పల్లవి॥

**యెచ్చరించి వొక రొక రెనసి కూడుండేటి**
**మచ్చికలు చెలి యెట్టు మరచీనయ్యా**
**వచ్చినదాఁకాఁ దలవాకిటనె కాచుకుండే**
**మచ్చులచేఁత ల దెట్టు మరచీనయ్యా** ॥మంచి॥

**యిత వెరిఁ గొక రొక రిచ్చకాలు సేసేది**
**మతిలోనఁ జెలి యెట్టు మరచీనయ్యా**
**సతతము నొండొరుల జవ్వనమె కుదువైన**
**మతములు చెలి యెట్టు మరచీనయ్యా** ॥మంచి॥

**సంతసాన మనసులే సరిదాఁకినట్టి నీ**
**మంతనాలు చెలి యెట్టు మరచీనయ్యా**
**కాంతనునీవె శ్రీవెంకటనాథ కూడఁగాను**
**మంతు కెక్కె నిది యెట్టు మరచీనయ్యా.** ॥మంచి॥ **54**

**భావపరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో ఆయన దేవి చెలికత్తెయై స్వామితో యేమంటున్నారో వినండి. స్వామీ! నీవు చూపించిన అసమాన్యమైన మంచితనమును అదెట్టు మరచీనయ్యా (ఆ దేవి యెట్లా మఱచిపోయిందయ్యా?) మంచముపై మీరు చేరినప్పటినీ అనురాగమును ఆవిడెట్లా మఱచిపోయిందయ్యా? సావధానులై మీరిరువురూ అతిశయముతో సంగమించిన మధురక్షణములను ఆ చెలి యెట్లు మరచినదయ్యా? నీవు వచ్చేదాకా తలవాకిట నిలుచుండి నీకోసం కాచుకొని నిన్ను పరవశింపజేయు తన చేష్టల నాసతియెట్లు మఱచినదయ్యా? ఒకరికి హితవైనదింకొకరెరిగి ప్రియవచనములతో అన్యోన్యంగా మీరుండుట నాచెలి యెట్లు మరచినదయ్యా. ఎల్లప్పుడూ మీరొండొరుల జవ్వనమును ఒకరికొకరు కుదువబెట్టుకొనిన పద్ధతులను ఆ చెలి యెట్లు మఱచినదయ్యా? ప్రభూ! మీమనస్సులను దాకినట్టి సంతోసములను అనుభవించుచు ఆచెలి నీతో పలు మంతనములాడినది. ఆమె వాటినెట్లు మరచినదయ్యా? అట్టి కాంతను వో శ్రీవేంకటనాథా! నీవు ప్రియమార కూడితివి. ప్రసిద్ధిజెందిన మీ రతులనామె యెట్లు మఱచినదయ్యా?

★ **మచ్చులచేతలు** – పరవశింపజేయు చేష్టలు ★ **మంతుకెక్కు** – ప్రసిద్ధిచెందిన





సంఖ్య : 53 సంపుటము : 10-2 పుట: 31 రాగం : ఆటతాళము

**56 కాదని వేగిరించితే కరఁగీనా ఆతఁ డేమి**
**వాదు మాని వచ్చినట్టె వచ్చే దె చాలును** ॥పల్లవి॥

**మాఁట లాడించకురే మదనమంత్రాలు దప్పీ**
**నేఁటిదాఁకా నాపెవద్ద నేరిచినవి**
**నీటుతోడ నాతనిని నిండునిధానమువలె**
**సూటిచూపుల మనము చూచేదె చాలును** ॥కాదని॥

**గందము పూయకురే యంగజునిముద్రలు మాసీ**
**కందువ నిన్నాళ్లదాఁకా గడించినవి**
**దిందుపడ నుపారము దేవరకుఁ జూపినట్టు**
**ముందర నన్నియుఁ బెట్టి మొక్కే దె చాలును** ॥కాదని॥

**మల్లాడి తియ్యకురె మన్మథయోగ మెడసీ**
**తొల్లియూ నాపెవలన దొరకినది**
**కల్ల గాదు నన్ను శ్రీవెంకటనాథుఁడె కూడె**
**చెల్లుబడి నీచనవు చేకొనేదె చాలును.** ॥కాదని॥ **53**

**భావపరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో దేవి చెలికత్తెలతో యేమని చెబుతున్నారో వినండి, నేటి మనతెలుగులో. కాదని నేను తొందరపెట్టినంతమాత్రాన, ఆతడు కరగిపోతాడా యేమిటే? వాదనలు మాని నాదగ్గరకువస్తే చాలును. పాపం! అతగానిని మాటలాడించకండే. ఆయన నేటిదాకా తన నూతన ప్రియురాలి (చినతిరుమలయ్య) వద్ద నేర్చుకొనిన మదనమంత్రములన్నీ మఱచిపోతాడు. పోనీలేండి, నేటికైనా ఇక్కడకు వచ్చాడు కదా! నిండు నిధానమువంటి ఆయన తిన్నని చూపులతో మనము తృప్తి పడెదములే. మనకదే చాలును. తొందరపడి ఆయనకుగంధము పూయకండే. అంగజుని ముద్రలు (ఆమె ముద్దులు పెట్టిన గుర్తులు) మాసీ (మాసిపోతాయి). అవి ఒక్కనాటితో వచ్చినవా? ఆమె (చినతిరుమలయ్య) ఇన్నాళ్ళదాకా చుంబిస్తే ఈయనగారు గడించినవే (పొందినవే సుమా!) అజ్ఞానం నశించగా దేవరకు ఉపారము జూపినట్టు (నైవేద్యము పెట్టినట్లు) ఇతగాని ముందర అన్నీ పెట్టి మొక్కండే. ఓ చెలులారా! అతగాని కంటిన మన్మథయోగముద్రలు, పెనగి తీసివేయకండే. ఇదివరకు కూడా ఆవిడగారు చేసిన గుర్తులు దొరకలేదా? అది కల్లకాదు కదా! నన్ను శ్రీవేంకటేశుడెన్నిమారులు కూడినాడు చెల్లుబడి కలిగిన ఈ చనువులు నాకు చాలవా?

★ **దిందుపడి** – అజ్ఞానం నశించగా ★ **మల్లాడితియ్యకురే** – పెనగితీయకండే

సంఖ్య : 51 సంపుటము : 10-2 పుట: 30 రాగం : వరాళి

**57** నీ వేల వత్తువయ్య నెలఁతఁ బాసి
మావంటివారు నీకు మనసయ్యేరా ॥పల్లవి॥

ఇప్పటికి మాతోడ యిచ్చక మాడేవు గాక
తప్పరాని బాస నీవు దాఁటఁ గలవా
అప్పసమై తలఁపెల్లా ఆపెకుఁ గుదువవెట్టి
దెప్పరమై మావెంటఁ దిరుగ నోపుదువా ॥నీవేల॥

నిక్కమువంటి మాఁటలే నెరపేవు గాక నీవు
వొక్కమనసై యీడ నుండఁ గలవా
అక్కజపు నీమేను ఆపెకు మీదు (ది?)చ్చి
యిక్కడ మాతొంటిపొందు యితవయ్యీనా ॥నీవేల॥

ముచ్చట సేసుక మాతో మొగమోడే వింతే పక్క
మచ్చికయాపె కాఁగిలి మాన గలవా
కచ్చుపెట్టి నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
యెచ్చరిక నిట్టె మాయింటికి రాఁగలవా. ॥నీవేల॥ **51**

**భావపరిమళం :**

చినతిరుమలయ్య వినిపిస్తున్న ఈ శృంగార కీర్తనలో ఆయన స్వామిని వలచిన ప్రియురాలై యేమని రాజీకొచ్చారో వినండి. ప్రభూ! నీవా నెలతను (దేవిని) వదలి యేలవత్తువయ్యా? మావంటి సాధారణ ప్రియురాళ్ళు నీకు మనసయ్యేరా?(నీకు నచ్చుతారా?) ప్రభూ! ఇప్పటికి (ప్రస్తుతానికి) మాతో ఇచ్చకమాడేవు (తీపి మాటలు చెప్పేవు). నీవు చేసిన తప్పరానిబాసలు నీవు దాటగలవా? అప్పసమై (నీవంతట నీవే) నీ తలపంతా ఆమెకు (దేవికి) కుదువబెట్టి, దెప్పరవై (దుష్టుడవై) మాటలే చెప్పెదవు. నీవు ఏకాగ్ర చిత్తముతో నావద్దవుండగలవా? అచ్చెరువునందించు మనోహరమైననీతనువు ఆమె కధీనముజేసి, ఇక్కడ మాబోటి అనామకులతో పొందు నీకు హితమౌతుందా? స్వామీ! నీవు సంకోచములతో పొందు నీకు హితమౌతుందా? స్వామీ! నీవు సంకోచముతోనే మాతో ముచ్చటలాడేవు. నీకు మచ్చికయైన ఆ కౌగిటిని మానగలవా? ఓ శ్రీవేంకటేశ్వరా! పట్టుదలతో నన్ను కూడితివి. నీవు సావధానుడవై మా ఇంటికి అంత తేలికగా రాగలవా?

★ **మొగమోడు** – సంకోచపడు ★ **కచ్చుపెట్టి** – పట్టుదలతో





సంఖ్య : 185 సంపుటము : 28 పుట: 125 రాగం : సాళంగనాట

**58** కడు నేరుపరినంటా గర్వించేవు
జడియక యీవలపుసంగ తెరిఁగించవే ॥పల్లవి॥

మాటలాడనేరుతువు మనసుకు మర్మమేదే
ఆఁటదాన విదెఱఁగనంటేఁ గొరత
యీటున నాతఁడు నీవు నిద్దరొ(రు?) వొక్కరై
కూటపు నీ భావములగుఱుతెరిఁగించవే ॥కడు॥

సుద్దులన్ని నేరుతువు చూపులకు సూటేదే
కొద్దిమీరి ఇదెఱఁగకుంటే గొరత
చద్దిపండో వేఁడిపండో సరుస మీమోవులు
తిద్దుకొని నన్ను సమ్మతించఁ జేయవే ॥కడు॥

ముదురు జాణవు నీవు మోహానకుఁ జోటేదే
ఇది యెఱఁగకవుంటే ఇంతాఁ గొరత
కదిసి కూడె శ్రీ వేంకటేశుఁడు నిన్ను నన్ను
విదియ చందురులకు వేళ చెప్పవే ॥కడు॥ **185**

**భావపరిమళం :**

అన్నమాచార్యులవారు వినిపించిన మధురభక్తి సంకీర్తననాస్వాదించి తరిద్దాము. ఆయన స్వామివారివలపుకత్తెయై దేవి అలమేల్మంగను సవాలు చేస్తూ నేనూ స్వామిని వలచాను, నీవు జడియక (జంకక) యీవలపు సంగతి స్వామికినెరింగించవే, అంటున్నారు. నీవు కడు నేర్పరినని గర్విస్తుంటావు కదా! చేతనైతే స్వామికి ఈమెను (అన్నమయ్యను) స్వీకరించమని నచ్చజెప్పు. దేవీ! నీవు చక్కగ మాట్లాడ నేర్చినదానవు. నీ మనస్సులో మర్మమే లేదు. నీవు స్త్రీవి కదా! నీ అందగానిని యెవరు ప్రేమించరు? ఇది నీకు తెలియదంటేకొరత (లోపమే). ఆతడింకొకరికి లొంగుతాడని నీకు భయమైతే వేడుకతో మీ ఇద్దరి కూటములలో నీ మధురభక్తి గుర్తుచేయవమ్మా! దేవీ! ఆయన ప్రేమకథలు నీవు ఎఱగనివా? నీ నిశితమైన చూపులకు సూటేది? (సాటియేదమ్మా?) నీకీసంగతి (ఆయన మధురభక్తికి దాసుడని) తెలియకపోతే లోటే మరి!! దేవీ! సరసమున మీ మోవులు (పెదవులు) పెనగినప్పుడు అది చల్లటిపండో, వేడిపండో యెవరు చెప్పగలరు? ఏదియేమైనా అన్నమయ్య అనే ఒక వలపుకత్తె ననుగ్రహించమని సమ్మతించజేయవే. దేవీ! నీవు ముదురు జాణవు. నీవు మోహించుటకు ఆస్కారమే లేదు. ఇది నీకు మాత్రం తెలియదా? లేకుంటే కొరతే తల్లీ! శ్రీవేంకటేశుడు తక్కువవాడా? సరసశృంగారంతో నిన్ను మధురభక్తిలోకి లాగి నన్ను కూడినాడు. విదియచంద్రులకు (అర్ధచంద్ర నఖక్షతములకు) వేళైందని చెప్పవే.

★ **ముదురుజాణ** – పండిన సరసురాలు ★ **ఈటున** – వేడుకతో

## మంగళా శాసనం

1 శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2 లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

3 సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4 నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5 వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6 ఎమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7 మంగళశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వైః సత్కృతాయాస్తు మంగళమ్

పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః





రచయిత:

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




పిలవండి : **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

పుట్టింది : **9-6-1945**

చదివింది : ఎం.టెక్.

ఉండేది : ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,
సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.

రంధి : భగవన్నామ సంకీర్తన

నచ్చింది : శాస్త్రీయ సంగీతం

నచ్చందీ : నక్కజిత్తులు

మెచ్చింది : సజ్జన సాంగత్యం

రింగండి : 00919393021360

చదవండి : www.geetadeksha.com

ఇవ్వండి : e-mail : geetadeksha@gmail.com